శనివారం
07-12-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 76
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

చిలీ మాజీ అధ్యక్షురాలికి ఇందిరా గాంధీ శాంతి బహుమతి

న్యూఢిల్లీ: చిలీ మాజీ అధ్యక్షురాలు, ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త మిచెల్ బాచెలెట్‌ను ఇందిరా గాంధీ బహుమతితో వరించింది. ఈ మేరకు జాతీయ మాజీ భద్రతా సలహాదారు శివశంకర్ మీనన్ అధ్యక్షతన అంతర్జాతీయ జ్యూరీ శుక్రవారం ప్రకటించింది. ఐక్యరాజ్య సమితి మహిళా వ్యవస్థాపక డైరెక్టర్‌గా, మానవ హక్కుల కోసం ఐరాస హై కమిషనర్‌గా, చిలీ అధ్యక్షురాలిగా ఆమె లింగ సమానత్వం, బలహీన వర్గాల హక్కుల కోసం గళం వినిపించారని ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఆమె చేసిన కృషికిగాను శాంతి బహుమతిని ప్రదానం చేయనున్నట్లు తెలిపింది.

ఏపీలో 8 కేంద్రీయ, తెలంగాణలో 7 నవోదయ విద్యాలయాలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 85 నూతన కేంద్రీయ విద్యాలయాలు, 28 కొత్త నవోదయ విద్యాలయాలు ప్రారంభించాలని కేంద్రం నిర్ణయించింది. శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. నూతన కేవీల ద్వారా దాదాపు 82 వేల మందికి పైగా విద్యార్థులకు ఉన్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్య అందనుంది. కొత్త కేవీల నిర్మాణానికి అంచనా వ్యయం రూ.5,872.08 కోట్లుగా నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లో

- మిగతా 2 లో

'మోదీ-అదానీ భాయీ...భాయీ'

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ అవినీతి ఆర్థిక కుంభకోణం వెలుగులోకొచ్చిన క్రమంలో దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్న ఇండియా ఐక్యసంఘటన పక్షాలు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తూనే ఉన్నాయి. శుక్రవారం పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్ష ఎంపీలు 'మోదీ-అదానీ భాయీ...భాయీ' అని రాసి ఉన్న నల్లటి మాస్కులను ముఖానికి ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభలో

- మిగతా 2 లో

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ వీసీగా ఘంటా చక్రపాణి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం వైస్‌చాన్సలర్‌ను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఘంటా చక్రపాణిని నియమిస్తూ ఉత్తర్వులు వెల్లడించింది. ఈ పదవిలో చక్రపాణి మూడేళ్లు కొనసాగనున్నారు. గతంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సోషియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా చక్రపాణి విధులు నిర్వర్తించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టీఎస్‌పీఎస్సీ తొలి చైర్మన్‌గా ఘంటా చక్రపాణి సేవలందించారు.

ఇదీ లోకం!

లైన్‌లో జగన్ ఉన్నారు! అయనకు పుట్టెడు సమస్యలు ఉన్నాయట!

డ్రగ్స్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు

- ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ఏర్పాటు
- రాజకీయ ఒత్తిళ్లు, పైరవీలకు తావులేని పాలన
- ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రారంభోత్సవ సభలో రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: డ్రగ్స్ కేసులకు సంబంధించి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి ఆరు నెలల్లోగా తీర్పులు వచ్చేలా చూస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రారంభోత్సవ సభలో శుక్రవారం సీఎం మాట్లాడారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తయిందని, ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ఏర్పడిందని అన్నారు. రాజకీయ ఒత్తిడి, పైరవీలకు తావులేకుండా పాలన అందిస్తున్నట్లు చెప్పారు. పైరవీలు లేకుండా పోలీసులకు పదోన్నతులు, బదిలీలు జరిపామన్నారు. పోలీసు, అగ్నిమాపక శాఖలో 15వేల మందికి నియామక పత్రాలు అందించామని వివరించారు. 'సైబర్, డ్రగ్స్ రూపంలో కొత్త నేరాలు పుట్టుకొస్తున్నాయని, గంజాయి, కొకైన్, హెరాయిన్... మన రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్నాయన్నారు. యువతకు సైబర్ క్రైమ్ విభాగంలో శిక్షణ ఇవ్వాలని డీజీపీని కోరుతున్నట్లు పేర్కొన్నారు. టీజీ న్యాబ్‌కు డీజీపీ స్థాయి అధికారిని నియమించాం.. కఠిన చర్యలతో గంజాయి, డ్రగ్స్‌ను అరికడుతున్నాం. డ్రగ్స్ రవాణాదారులు ఇక్కడికి రావాలంటేనే భయపడాలి. డ్రగ్స్ విష వలయం గురించి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలి. ప్రత్యేక శిక్షణ పొందిన వారితో విద్యార్థులకు పాఠాలు చెప్పించాలి. పిల్లల భవిష్యత్తు గురించి పాఠశాలల యాజమాన్యాలకు బాధ్యత ఉండాలి. విద్యా సంస్థల యాజమాన్యాలతో పోలీసు కమిషనర్లు సదస్సులు నిర్వహించాలని అన్నారు.

మృతి చెందిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

రాష్ట్రంలో 14వేల మంది హోంగార్డులు ఉన్నారని, రోజుకు రూ.వెయ్యి వేతనం ఇస్తున్నామని, వీక్లీ పరేడ్ అలవెన్స్ రూ.200 చేస్తామన్నారు. మరణించిన హోంగార్డులు కుటుంబాలకు రూ.ఐదు లక్షల పరిహారం చెల్లిస్తామన్నారు. జనవరి 1లోగా అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసుల పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందిస్తామన్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూలుకు 50

- మిగతా 2 లో

'ఢిల్లీ చలో' ఉద్రిక్తం

శంభు సరిహద్దులో హైటెన్షన్

- హస్తినకు బయలు దేరిన రైతుల్ని అడ్డుకున్న పోలీసులు
- బాష్పవాయువు ప్రయోగం... సొమ్మసిల్లిన అన్నదాతలు
- ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని రైతుసంఘాల డిమాండ్
- ఆందోళన వాయిదా... కేంద్రంతో చర్చలకు సిద్ధమని రైతు నేతల వెల్లడి

న్యూఢిల్లీ: కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పీ) చట్టబద్ధత కల్పించడం సహా 12 డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పంజాబ్ రైతు సంఘాలు చేపట్టిన'ఢిల్లీ చలో' నిరసన కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. రైతు సంఘాల పిలుపు మేరకు శుక్రవారం వేలాదిగా రైతులు పంజాబ్-హర్యానా మధ్య శంభు సరిహద్దు వద్దకు చేరారు. ఇక్కడి నుంచి దేశ రాజధాని ఢిల్లీలోకి ప్రవేశించేందుకు వందలాది మంది ప్రయత్నించగా... అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. శాంతియుతంగా పాదయాత్ర చేపడతామని చెప్పినా నగరంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. దీంతో అక్కడి నుంచి వెళ్లేది లేదని రైతులు బైఠాయించారు. కేంద్ర ప్రభుత్వానికి, పంజాబ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, రైతులకు మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. రైతు సంఘాల పతాకాలను చేతబట్టిన రైతులు... పోలీసులు అడ్డుగా ఏర్పాటు చేసిన భారీ బారికేడ్లను, ముళ్ల కంచెలను దాటుకొని వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసు బలగాలు వారిని వెనక్కి నెట్టివేశాయి. అయినా వెనక్కి తగ్గకుండా ఉవ్వెత్తున్న ముందుకొస్తున్న రైతులను నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయువు గోళాలు, వాటర్ కెనాన్లను ప్రయోగించారు. అనేకమంది రైతులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు రైతులను నెట్టివేయడంతో కొంతమంది రైతు నాయకులు గాయపడ్డారు. భాష్పవాయువు ప్రభావంతో కొంతమంది పెద్ద వయసున్న రైతులు ఊపిరాడక సొమ్మసిల్లిపడిపోయారు. వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో "ఛలో ఢిల్లీకి" పిలుపునిచ్చిన పంజాబ్ రైతులు ఆందోళనలను ఆదివారానికి వాయిదా వేశారు. పోలీసులు ప్రయోగించిన బాష్పవాయు గోళాలతో కొంతమంది రైతులకు గాయాలయ్యాయని, అందుకే ర్యాలీని వాయిదా వేస్తున్నట్లు అన్నదాతలు తెలిపారు. శనివారం కేంద్రప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. "వారు చర్చలకు సిద్ధమని ప్రకటించారు. అందుకే శనివారం వరకు వేచి చూస్తాం. మేము చర్చలు జరగాలనే కోరుకుంటున్నాం. ప్రభుత్వంతో సంఘర్షణ జరగాలని అనుకోవడం లేదు. మేము శాంతియుతంగానే వ్యవహరిస్తాం" అని రైతు సంఘాల నాయకుడు శర్వన్‌సింగ్ పంధేర్ తెలిపారు.

ఇంటర్నెట్ నిలిపివేత

మరోవైపు రైతులు 'ఢిల్లీ చలో' ప్రదర్శన మొదలు పెట్టడానికి కొన్ని నిమిషాల ముందు హర్యానాలోని అంబాలా జిల్లా పరిధిలో 11 గ్రామాల్లో మొబైల్ ఇంటర్నెట్, ఎస్‌ఎంఎస్ సేవల్ని నిలిపివేశారు. డిసెంబర్ 9 వరకు

- మిగతా 2 లో

అందరివాడు అంబేద్కర్

- సకల వర్గాల అభ్యున్నతికి బాబాసాహెబ్ కృషి
- వివాహ చట్టం ద్వారా మహిళలకు హక్కులు
- సమస్యల పరిష్కారానికి రాజ్యాంగమే ఆధారం
- సమగ్ర కుటుంబ సర్వే 99 శాతం పూర్తి
- వర్ధంతి సభలో డిప్యూటీ సీఎం భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్... కేవలం అణగారిన వర్గాల కోసమే కాదు... సకల వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతో శ్రమించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. జేఎన్‌టీయూలో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భట్టి మాట్లాడుతూ... అంబేద్కర్ కృషి ద్వారానే అందరికీ సమానంగా ఓటు హక్కు లభించింది అన్నారు. అదే లేకపోతే ఏ రాజకీయ నాయకుడు ఇంటికి వచ్చి చేతులు జోడించి దండం పెట్టేవాడు కాదన్నారు. హిందూ వివాహ చట్టం ద్వారా అణగదొక్కబడిన మహిళలకు హక్కులు కల్పించారని, అందుకోసం ఆయన తన న్యాయశాఖ మంత్రి పదవిని వదులుకున్నారని గుర్తు చేశారు. ఈ చట్టం వల్లనే మహిళలకు ఆస్తిలో వాటా, విడాకులకు చట్టబద్ధత లభించిందని అన్నారు. మహిళలకు మెటర్నిటీ లీవ్, మైనింగ్ లేబర్ యాక్ట్ ... ఒక వర్గానికి సంబంధించిన హక్కులు కాదన్నారు. ఎనిమిది గంటల పని

- మిగతా 2 లో

బీజేపీ ఎంపీపై కాంగ్రెస్ హక్కుల తీర్మానం

న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీలు నిషికాంత్ దూబే, సంబిత్ పాత్రపై కాంగ్రెస్ శుక్రవారం హక్కుల తీర్మానం ప్రవేశపెట్టింది. రాహుల్ గాంధీకి విదేశీ పెట్టుబడిదారుడితో సంబంధాలున్నాయని, ఆయన దేశద్రోహి అంటూ గురువారం బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే వ్యాఖ్యానించారు. తాము నిషికాంత్ దూబే, సంబిత్ పాత్రపై పార్లమెంటులో ప్రివిలేజ్ మోషన్ ప్రవేశపెట్టామని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ చెప్పారు. అయితే ప్రశ్నోత్తరాల సమయం వాయిదా పడిందని, ఎవరికి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ ప్రవేశపెట్టారో, ఆ వ్యక్తిని తిరిగి పార్లమెంటులో మాట్లాడటానికి అనుమతించారని అన్నారు. పార్లమెంటు కొనసాగకుండా అడ్డుకునే కుట్రలో భాగమే ఈ చర్య అని మండిపడ్డారు. అదానీ అంశంపై భయపడి దాని నుండి పారిపోతున్నారని ఎద్దేవా

- మిగతా 2 లో

కరెన్సీ కలకలం

- కాంగ్రెస్ ఎంపీ సింఘ్వీ స్థానంలో లభ్యం
- దర్యాప్తునకు రాజ్యసభ చైర్మన్ ధన్కర్ ఆదేశం
- అధికార-విపక్షాల మధ్య వాగ్వాదం
- విచారణ పూర్తి కాకుండా సభ్యుడి పేరు ఎలా చెప్పారు: ఖర్గే
- ఇందులో తప్పేముంది... అభ్యంతరం ఎందుకు: రిజిజు

న్యూఢిల్లీ: రాజ్యసభలో రూ.500 నోట్ల కట్ట దుమారం రేపింది. కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్ సింఘ్వీకు కేటాయించిన సీటు 222 వద్ద 100 రూ.500 నోట్లను భద్రతా సిబ్బంది గుర్తించడం సంచలనంగా మారింది. అయితే ఆ నోట్లు అసలా లేక నకిలీవా అన్నది తేలాల్సి ఉంది. ఈ వ్యవహారంలో విచారణకు చైర్మన్ జగదీప్ ధన్కర్ ఆదేశించారు. అయితే దర్యాప్తు పూర్తి కాకుండా ఎంపీ పేరు వెల్లడించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభ్యంతరం చెప్పారు. సింఘ్వీ కుర్చీ వద్ద డబ్బు దొరికిందని, అందుకే ఆయన పేరు చెప్పానని ధంకర్ వివరణ ఇచ్చారు. రూ.500 నోట్ల కట్టపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదంతో సభ రసాభాస అయింది. 'గురువారం రాజ్యసభ వాయిదా పడిన తర్వాత భద్రతా అధికారులు జరిపిన సాధారణ తనిఖీల్లో భాగంగా సింఘ్వీ స్థానంలో రూ.500 నోట్ల కట్ట దొరికింది. ఆ డబ్బు తమదేనని ఎవరో ఒకరు చెబుతారని అనుకుంటే

- మిగతా 2 లో

ప్రభుత్వ పథకాలు పేదలకు వరం: కూనంనేని

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదవర్గాలకు వరం లాంటివని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. జాప్యం జరగకుండా సాంకేతిక సమస్యలు పరిష్కరించి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

2లో

ఏపీలో 18 పైవంతెనలు

కేంద్ర మంత్రి గడ్కరీ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో జాతీయ రహదారులపై రూ.1,046 కోట్ల నిధులతో చేపట్టిన 18 పైవంతెనల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శుక్రవారం వెల్లడించారు. లోక్‌సభలో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ... ఎన్‌హెచ్-216ఏ పై మోరంపూడి, ఉండ్రాజవరం జంక్షన్, జొన్నాడ, తేతలి, కైకవరం వద్ద నిర్మిస్తున్న 5 వంతెనలు 2 ఏప్రిల్, 2025 నాటికి పూర్తవుతాయని తెలిపారు. జాతీయ రహదారి (ఎన్‌హెచ్)-16పై గొలగమూడి జంక్షన్, నెల్లూరు టీ జంక్షన్ల వద్ద నిర్మిస్తున్న మరో రెండు వంతెనలు 2025 సెప్టెంబరు 11కి పూర్తికానున్నాయి. ఎన్‌హెచ్-16లో శ్రీసిటీ జీరో పాయింట్, చిల్లకూరు సెంటర్ల వద్ద తలపెట్టిన పైవంతెనల నిర్మాణాలకు బిడ్‌లు పిలవాల్సి ఉందని గడ్కరీ తెలిపారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టు

- మిగతా 2 లో

తెలంగాణ సర్కారుకు ఊరట

గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదు: సుప్రీం

హైదరాబాద్: గ్రూప్-1 అంశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్ వాయిదా వేయాలని కోరుతూ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. కొత్త నోటిఫికేషన్ చట్టవిరుద్ధమని కొందరు అభ్యర్థులు గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రిలిమ్స్‌లో 14 తప్పులున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాలని హైకోర్టును కోరారు. అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. పిటిషనర్లు మెయిన్స్‌కు క్వాలిఫై కానందున మెయిన్స్ పరీక్ష వాయిదా అవసరం

- మిగతా 2 లో

అంబేద్కర్ విగ్రహాన్ని అవమానిస్తారా

తాళాలు వేసి బంధించడం కుసంస్కారం: ప్రభుత్వతీరుపై కేటీఆర్ ఫైర్

విశాలాంధ్ర-హైదరాబాద్: అతిపెద్ద అంబేద్కర్ విగ్రహానికి వర్ధంతి రోజునైనా కనీసం పూలమాల వేయాలన్న సోయి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దళితులు, సమాజంలో ప్రజలందరికీ స్ఫూర్తినిచ్చే అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ ఉద్దేశాలతోనే అంబేద్కర్ విగ్రహాన్ని అవమానిస్తున్నారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రకాష్ అంబేద్కర్ చేత ప్రారంభించబడిన మహా విగ్రహాన్ని ప్రభుత్వం ఎందుకు అవమానిస్తుందని, తాళాలు వేసి బంధించి కనీసం శుభ్రపరచకుండా ఎందుకు పెట్టారని నిలదీశారు. బీఆర్ఎస్ పై అక్కసు ఉంటే దానిని అంబేద్కర్ విగ్రహంపై ఎందుకు చూపుతున్నారని ధ్వజమెత్తారు. అంబేద్కర్‌కి నివాళులు కూడా అర్పించలేని కుసంస్కారి రేవంత్ రెడ్డి అంటూ ఘాటుగా విమర్శించారు. మహా మేథావి అంబేద్కర్‌ని స్మరించుకునేందుకు 125 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తే ప్రభుత్వం కావాలని నిర్లక్ష్యం వహిస్తుందని పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాలను నెల రోజులపాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 11 నెలల కాలంలో సబ్బంద

- మిగతా 2 లో

రష్యా దేనికైనా సిద్ధం: లావ్రోవ్

మాస్కో: ఉక్రెయిన్‌పై పోరులో ఎలాంటి మార్గాన్ని అనుసరించేందుకైనా సిద్ధంగా ఉన్నామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడించారు. మాస్కో వ్యూహాత్మక ఓటమిని పశ్చిమ దేశాలు కోరుకుంటున్నాయన్నారు. ఈ పోరులో నెగ్గేందుకు రష్యా దేనికైనా సిద్ధమన్న సందేశాన్ని పశ్చిమ దేశాలకు ఇవ్వడం కోసమే హైపర్‌సోనిక్ క్షిపణిని ప్రయోగించినట్లు ఆయన ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. తమను తాము రక్షించుకునేందుకు మరిన్ని క్షిపణుల ప్రయోగానికి వెనుకాడబోమన్నారు. 'అమెరికా, దాని మిత్ర దేశాలు రష్యాను వ్యూహాత్మకంగా ఓడించాలని చూస్తున్నాయి. ఆ ప్రయత్నాలు తిప్పికొట్టడానికి దేనికైనా రష్యా సిద్ధం. వాళ్లు పోరాడేది పపంచంపై ఆధిపత్యం కోసం... ఏ దేశాన్నైనా, ప్రాంతాన్నైనా, ఖండాన్నైనా శాసించగలమని చెప్పుకునేందుకు... కానీ మేము న్యాయమైన భద్రతా ప్రయోజనాల కోసం పోరాడుతాం' అని ఆయన చెప్పారు. మాస్కోలో ప్రత్యేక సైనిక ఆపరేషన్‌కు పశ్చిమ దేశాలు పూనుకున్నాయని, భద్రతాపరమైన హామీలపై రష్యాతో చర్చించేందుకు నిరాకరించాయని లావ్రోవ్ అన్నారు. రెండు సార్లు ఒప్పందానికి ప్రతిపాదనలను తిరస్కరించి ప్రాదేశిక సమగ్రత నిర్వహణ అవకాశాన్ని ఉక్రెయిన్ కోల్పోయిందన్నారు. 'యుద్ధాన్ని మేము మొదలు పెట్టలేదు. మా సరిహద్దులకు నాటోను క్రమంగా చేరువ చేయడంతో సమస్య వస్తుందని చాలా ఏళ్లుగా హెచ్చరిస్తూ వచ్చాం' అని లావ్రోవ్ అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడి శాంతి ప్రణాళికలు అర్థంలేనివని తోసిపుచ్చారు. వారు ప్రకటించుకున్న రెడ్ లైన్స్‌ను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ పెద్ద తప్పే చేస్తున్నారని పశ్చిమ దేశాల తీరునుద్దేశించి లావ్రోవ్ అన్నారు. రష్యా రెడ్ లైన్స్ జోలికి వస్తే ఊరుకునేది లేదని చెప్పారు. పద్ధతి మార్చుకోకపోతే రష్యా ఎలాంటికైనా తెగిస్తుందని లావ్రోవ్ తేల్చిచెప్పారు.

కార్మిక వ్యతిరేక బిల్లు ఉపసంహరించాలి

ఏథెన్స్‌లో కార్మిక సంఘాల భారీ ర్యాలీ

ఏథెన్స్: కనీస వేతనాలపై వివాదాస్పద బిల్లు ఉపసంహరణకు ఐక్యంగా డిమాండ్ చేస్తూ గ్రీస్ కార్మిక సంఘాలు నిరసనబాట పట్టాయి. రాజధాని ఏథెన్స్‌లో సంయుక్తంగా భారీ ప్రదర్శన నిర్వహించాయి. తమ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేసేందుకు సొంతంగా ఓ ప్రతిపాదనను 637 కార్మిక సంఘాలు ప్రవేశపెట్టాయి. ఏథెన్స్‌లోని సైంటాగ్మా స్క్వేర్ వద్ద ప్రదర్శనలో ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల ట్రేడ్ యూనియన్లు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేతనాల్లో కోతలు విధించడానికి, వాటిని స్తంభింపజేయడానికి వీలుగా ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును ముక్తకంఠంతో వ్యతిరేకించారు. దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాల ఐక్యంగా డిమాండ్ చేశారు. 'నూతన కార్మిక వ్యతిరేక కనీస వేతన బిల్లును తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాం. దీనిపై పోరాటమే చేస్తున్నాం. కార్మిక సంఘాల డిమాండ్లను ప్రభుత్వం, కార్మిక శాఖ వెంటనే పరిష్కరించాలి. సమ్మిళిత ఒప్పందాలు కుదుర్చుకోవాలి. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి' అని కార్మిక సంఘాలు ఐక్యంగా డిమాండ్ చేశాయి.

యూన్‌పై వేటుకు అధికార పార్టీ మద్దతు

అధ్యక్షుడి అభిశంసనకు పార్లమెంటులో ఓటింగ్ నేడు

సియోల్: మార్షల్ లా అమలు నిర్ణయం దక్షిణ కొరియాలో ప్రకంపనలు సృష్టించింది. ప్రజానిరసనకు దారితీసింది. రాజకీయ సంక్షోభానికి దారితీసింది. అధ్యక్షుడి పీఠాన్ని కదిపి వేసింది. అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అభిశంసనకు రంగం సిద్ధమైంది. శనివారం పార్లమెంటులో ఓటింగ్ జరగనుంది. యూన్‌పై వేటుకు అధికార పీపుల్స్ పవర్ పార్టీ మద్దతు ప్రకటించింది. మార్షల్ లా అమలు చేయడం, దేశద్రోహం నెపంతో ప్రముఖ నేతలను అరెస్టు చేయించడం వంటి కారణాలతో యూన్‌ను పదవి నుంచి తొలగించాల్సిందేనని ఆ పార్టీ అధినేత హాన్ డోంగ్ హూన్ శుక్రవారం పార్లమెంటులో పార్టీ సమావేశం అనంతరం వెల్లడించారు. అయితే ఆయన ఆరోపణలను అధ్యక్ష కార్యాలయం తోసిపుచ్చింది. ప్రముఖ నేతల అరెస్టులకు ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదని తెలిపింది. మరోవైపు యూన్ అభిశంసన విషయమై ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ వరుసగా సమావేశమవుతూ కార్యాచరణను చర్చిస్తోంది. యూన్... విపక్షాలు, ప్రజల నుంచే కాకుండా సొంత పార్టీ నుంచి కూడా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. సైనిక పాలన విధించడంపై దేశ ప్రజలకు రక్షణ మంత్రి క్షమాపణలు చెప్పారు. తన రాజీనామాను సమర్పించారు. పీపుల్స్ పవర్ పార్టీ అధ్యక్షుడు మద్దతుతో యూన్‌పై వేటు పడటం ఖాయమైంది.

అందరివాడు అంబేద్కర్

(మొదటిపేజీ తరువాయి)

విధానాన్ని అమల్లోకి తెచ్చిన అంబేద్కర్ మనదేశంలో పుట్టడం మనందరి అదృష్టం అన్నారు. సమాజంలో అసమానతలు తగ్గించడానికి ఆయన అనేక విద్యాసంస్థలు స్థాపించారని తెలిపారు. భారతదేశంలో సకల సమస్యల పరిష్కారానికి భారత రాజ్యాంగం ఒక్కటే ఆధారం అని , అది మనల్ని కాపాడుతుందన్నారు. మనదేశంలో అద్భుతమైన మానవ వనరులు ఉన్నాయని, అవి జాతుల మధ్య పోరాటంతో నిర్వీర్యం అవుతున్నాయి, అది లేకుంటే భారతదేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉండేది అన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని , అంబేద్కర్ చూపిన మార్గంలో యువత పయనించాలన్నారు. గత ప్రభుత్వం ఏడాదిలో రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.70 కోట్లు ఖర్చు చేస్తే.. . తమ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి రూ.ఐదు వేల కోట్లు ఖర్చు చేస్తుందని వివరించారు. మేం అధికారంలోకి రాగానే 11 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాం, మరో ఆరువేల పోస్టులతో మరో డీఎస్సీ నిర్వహిస్తున్నామని తెలిపారు. 65 ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రాలుగా మార్చామని చెప్పారు. సమగ్ర కుల గణన , సమగ్ర కుటుంబ సర్వే 99 శాతం పూర్తయిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధునిక భారతదేశ నిర్మాణానికి కృషి చేయడమే అంబేద్కర్‌కు మనమిచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలకు వరం

విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదవర్గాలకు వరం లాంటివని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. జాప్యం జరగకుండా సాంకేతిక సమస్యలు పరిష్కరించి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపాలిటీ సహా నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల 215 మంది లబ్దిదారులకు రూ.2.15 కోట్ల విలువచేసే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 110 మందికి రూ.40.50 లక్షల విలువచేసే సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం స్థానిక ఓ క్లబ్బులో పంపిణీ చేశారు. నూతన వధూవరులకు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ ఆడపిల్లలకు వివాహం చేయడం భారంగా మారుతున్న ప్రస్తుత రోజుల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు తల్లిదండ్రులకు కొంత ధైర్యాన్ని ఇస్తున్నాయన్నారు. ఎన్నికల వాగ్దానం మేరకు తులం బంగారం అందించాలని డిమాండ్ చేశారు. వైద్యానికి పరిమితి ఎత్తివేసి పూర్తిస్థాయిలో ఖర్చు భరించాలని కోరారు. ఆర్డీవో మధు, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణ, ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్ స్వామి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కే సాబీర్ పాష, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, చంద్రగిరి శ్రీనివాసరావు, కౌన్సిలర్ ధర్మరాజు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని అవమానిస్తారా

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలకు చేసిన అన్యాయాలను అసెంబ్లీలో ప్రశ్నిస్తామన్నారు. లగచర్ల మొదలుకొని రాష్ట్రంలో కొనసాగుతున్న ఆత్మహత్యలు , 420 హామీల అమలులో వైఫల్యం, వ్యవసాయ రంగం, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. కేసీఆర్‌పై కారుకూతలు మానకుంటే ముఖ్యమంత్రి పదవికి కూడా గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. రేవంత్ రెడ్డి నోటి తీరు మార్చుకుంటేనే ఆయన పదవికి గౌరవం దక్కుతుందన్నారు. రేవంత్ రెడ్డి ఏర్పాటు చేస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహమా లేక కాంగ్రెస్ తల్లి విగ్రహమా అనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు విగ్రహాల రూపులు, చరిత్రను మారుస్తామంటే ఎవరూ ఒప్పుకోరన్నారు. ఉద్యమకాలంలో సబ్బండ వర్గాలు, కవులు, కళాకారులు, మేధావులు అంతా కలిసి తెలంగాణ పరిస్థితిలకు అనుగుణంగా సంస్కృతికి అనుగుణంగా రూపం ఇచ్చిన తల్లి విగ్రహమే తెలంగాణ తల్లి అని అన్నారు. గతంలో ఇందిరా గాంధీ భరతమాత విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే తర్వాతి ప్రభుత్వాలు మార్చినాయా అని ప్రశ్నించారు. తాము ప్రభుత్వంలోకి రాగానే రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేసిన చోట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఏర్పాటు చేస్తామన్నారు.

గొప్ప దార్శనికుడు: కేసీఆర్

రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు వెలకట్టలేనివని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు.

కరెన్సీ కలకలం

(మొదటిపేజీ తరువాయి)

ఎవరు రాలేదు' అని చైర్మన్ అన్నారు. విషయం తనకు తెలిసిన తర్వాత సభ దృష్టికి తీసుకు రావడం తన కర్తవ్యమని చెప్పారు. సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ స్పందిస్తూ ఈ వ్యవహారంలో దర్యాప్తుపై అభ్యంతరం లేదు కానీ సభ్యుని పేరు బయటకు చెప్పకుండా రాజ్యసభకే పరిమితం చేస్తే సముచితంగా ఉండేదని అన్నారు. తాజా వివాదంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ సభ్యుని పేరు చెబితే అభ్యంతరం ఏమిటి? ఫలానా సభ్యుని స్థానంలో డబ్బు దొరికిందని సభాపతి చెప్పడంలో తప్పేమిటి? అని ప్రశ్నించారు. సభకు నోట్ల కట్టలు తేవడం తగదని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని అన్నారు. రూ.500 నోట్ల కట్ట దొరకడంపై విచారణకు అభ్యంతరం లేదు కానీ విచారణ పూర్తి కాకుండానే సభ్యుని పేరును ఎలా ప్రకటిస్తారని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. ఇది రాజ్యసభ సమగ్రతకు అవమానం... సభ హౌందాతనానికి సంబంధించినదని, దీనిపై అధికార, విపక్షాల మధ్య విభజన తగదు' అని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. కొన్ని అంశాల్లో దూకుడు ప్రదర్శిస్తారు... మరికొన్నింటిని కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తారంటూ విపక్షాలనుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. ఖర్గే వ్యాఖ్యలపై ఖర్గే స్పందిస్తూ 'అంశాలను కప్పిపుచ్చేది మీరు... మేము కాదు... మాపై నిందలు ఎందుకు మోపుతున్నారు' అని ఎదురు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్పందిస్తూ తప్పుడు కథనాలతో సభను సాగనివ్వడంలేదని విపక్షాన్ని దుయ్యబట్టారు. సభ కార్యకలాపాలను విఘాతం కలిగించేందుకు వీల్లేదంటూ తీర్మానించాలని నడ్డా అన్నారు. అనంతరం రాజ్యసభలో జీరో అవర్ నిర్వహించారు.

రూ.500తో సభకు వచ్చా: సింఘ్వీ

తాను సభకు రూ.500 మాత్రమే తెచ్చానని అభిషేక్ మను సింఘ్వి తెలిపారు. 'గురువారం రాజ్యసభకు వచ్చినప్పుడు నా జేబులో రూ.500 మాత్రమే ఉన్నాయి. మధ్యాహ్నం 12.57 గంటలకు సభకు వచ్చా. ఒంటి గంటప్పుడు సభ వాయిదా పడింది. దాంతో క్యాంటీన్‌కు వెళ్లా అరగంట ఉన్నా. మధ్యాహ్నం 1.30 గంటలకు పార్లమెంటు నుంచి వెళ్లిపోయా' అని వెల్లడించారు. పార్లమెంటు వద్ద విలేకరులతో మాట్లాడుతూ 'నిన్న సభలో మూడు నిమిషాలు ఉన్నా. మొత్తంగా పార్లమెంటులో అరగంట గడిపాను. ఇలాంటి అంశాలను రాజకీయ చేయడం విడ్డూరంగా ఉంది' అని అన్నారు. సభకు వచ్చే వారు ఎక్కడ పడితే అక్కడ ఏది పడితే అది పెట్టకుండా చర్యలు తీసుకోవడం మంచిది. తాజా వ్యవహారంలో విచారణ జరిపించాల్సిందే అని ఆయన చెప్పారు. ఇందుకు అంతా సహకరించాలన్నారు. ఒకవేళ భద్రతా వైఫల్యం బయట పడితే దానిని బహిర్గతం చేయాలని సంఘ్వీ సూచించారు. ఇదిలావుంటే, అదానీ వ్యవహారం నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఎంపీ ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు. 'నోట్ల కట్ట దొరికిందని గోల చేస్తున్నారు. అధికారంలో ఉన్నారు కాబట్టి దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి. అభిషేక్ మను సింఘ్వీ ఒక న్యాయవాది. ఇలాంటి పనిని ఆయన ఎందుకు చేస్తారు. అదానీ అవినీతిపై చర్చ నుంచి వాళ్లు తప్పించుకుంటున్నారు' అని ఇమ్రాన్ వెల్లడించారు.

తెలంగాణ సర్కారుకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

లేదని స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టుల జోక్యంతో నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. మెయిన్స్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. ఫిబ్రవరిలోగా మెయిన్స్ ఫలితాలు విడుదల చేస్తామని తెలిపింది.

'ఢిల్లీ చలో' ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

నిలిపివేస్తున్నట్లు హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుమితా మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గ్రేటర్ నోయిడాలోని పరి చౌక్ వద్ద 'ఢిల్లీ చలో' ఆందోళనలో పాల్గొంటున్న రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావడంతో గ్రేటర్ నోయిడాలో భారీ ట్రాఫిక్ స్తంభించింది. ఇదిలా ఉండగా.. రైతుల ఆందోళన నేపథ్యంలో హర్యానా ప్రభుత్వం అప్రమత్తమైంది. సరిహద్దుల్లో కేంద్ర పారా మిలటరీ బలగాలను మోహరించారు. అదనంగా మూడంచెల బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది ఒకచోట గుమిగూడకుండా నిషేధాజ్ఞలు జారీ చేశారు.

బారికేడ్లను బద్దలుకొట్టే ఉద్దేశం లేదు: పంధేర్

శుక్రవారం మధ్యాహ్నం రైతులు పాదయాత్ర ప్రారంభించడానికి ముందు పంధేర్ మాట్లాడుతూ... 100 మంది రైతుల బృందం శాంతియుతంగా ఢిల్లీకి ప్రదర్శనగా బయలుదేరుతుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న బారికేడ్లను బద్దలు కొట్టే ఉద్దేశం రైతులకు లేదని వెల్లడించారు. రైతులు ట్రాక్టర్లపై ఢిల్లీ వైపునకు వెళ్లడం వల్ల తమకు సమస్యగా ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టుకు చెప్పాయని అన్నారు. అందుకే 100 మంది రైతుల బృందం శాంతియుతంగా ఢిల్లీ వైపు వెళుతుందన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు హరియాణా, పంజాబ్ ప్రభుత్వాలు తమకు అనుమతినిస్తాయని భావిస్తున్నామన్నారు. 'మాకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం లేదు. మేము కూడా భారతీయులమే. మరీ ముఖ్యంగా రైతులం. ప్రభుత్వం మమ్మల్ని ఎందుకు ఆపుతోంది? సరిహద్దుల వద్ద శాంతియుతంగా నిరసన తెలపడానికి ఎందుకు అనుమతించడం లేదు. కేంద్ర ప్రభుత్వం మా మాట వినడం లేదు' అని పంధేర్ మండిపడ్డారు.

ఎంఎస్‌పీనే మా ప్రధాన డిమాండ్

పంటలకు కనీస మద్దతు ధరే (ఎంఎస్‌పీ) తమ ప్రధాన డిమాండ్ అని రైతు నాయకురాలు సుఖ్వీందర్ కౌర్ వ్యాఖ్యానించారు. "మాకు 12 డిమాండ్లు ఉన్నాయి. అందులో ప్రధాన డిమాండ్ పంటలకు కనీస మద్దతు ధర. పంజాబ్ ప్రభుత్వం ఎంఎస్‌పీ అందిస్తుందని హామీ ఇచ్చింది. కానీ ఆ హామీ నెరవేర్చలేదు. పంజాబ్ సర్కార్‌తో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని కౌర్ తెలిపారు.

రైతులకు కాంగ్రెస్ మద్దతు

ఢిల్లీలో రైతుల శాంతియుత నిరసనలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. అలాగే రైతులు కేంద్రానికి చేస్తున్న డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందని ఆ పార్టీ అగ్రనేత జైరాం రమేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. రైతుల నిరసనలకు ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్ వంటి వ్యక్తుల పరోక్ష మద్దతు లభించిందని అన్నారు. అది రైతులకు బూస్టర్ డోస్ అని పేర్కొన్నారు. ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ధన్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'రైతులకు కేంద్ర వ్యవసాయ మంత్రి ఏమి వాగ్దానం చేశారో దయచేసి నాకు చెప్పాలని అభ్యర్థిస్తున్నాను? ఎందుకు హామీలను నేరవేర్చలేదు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ఏం చేయాలి? గత ఏడాది రైతు ఉద్యమం జరిగింది. ఈ ఏడాది కూడా ఉద్యమం చేస్తున్నారు.' అని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ధన్కర్ వ్యాఖ్యలను ఉదహరిస్తూ కాంగ్రెస్ కేంద్ర సర్కార్‌పై విమర్శలు గుప్పించింది. రైతుల ఆందోళన నేపథ్యంలో వ్యవసాయ ఉత్పత్తులన్నింటినీ మోదీ సర్కార్ కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ శుక్రవారం రాజ్యసభలో తెలిపారు. వరి, గోధుమ, జొన్న, సోయాబీన్ పంటలను మూడేళ్ల క్రితం కంటే 50 శాతం ఎక్కువకు కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు.

'మోదీ-అదానీ భాయీ...భాయీ'

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ సహా ఆర్జేడీ, జేఎంఎం, వామపక్షాల ఎంపీలు ఉన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రతిని పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తూ... అదానీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మాట్లాడుతూ... అదానీని వెంటనే అరెస్టు చేశాయాలని, జేపీసీ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదానీ అంశంపై చర్చ జరగాలంటే ప్రభుత్వం భయపడుతోందని ప్రియాంక గాంధీ అన్నారు.

ఆత్మీయ వారధిగా పీటీఎం

నేడు తల్లిదండ్రులు... ఉపాధ్యాయుల సమావేశాలు

విశాలాంధ్ర-అమరావతి : విద్యా వ్యవస్థలో అతి పెద్ద పండుగను నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించనుంది. ఇప్పటికే విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల వికాసం, సమస్యల పరిష్కారానికి ఈ సమావేశం మార్గనిర్దేశం చేస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. దాంతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ వారధిగా నిలుస్తుందని అభిప్రాయపడుతున్నారు. ఈ సమావేశాలను ప్రతి పాఠశాలలో పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. విద్యావ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచడం... విద్య నేర్చుకునే పిల్లలు, వారి తల్లిదండ్రులను పాఠశాలలకు దగ్గర చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ మేరకు నవంబరు 29న విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ రాజకీయాలకతీతంగా ఎంపీల నుంచి వార్డు సభ్యుల వరకు ప్రజాప్రతినిధులకు ఆహ్వాన లేఖలు కూడా పంపారు. పాఠశాలలకు విరాళాలు ఇచ్చిన దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 45,099 పాఠశాలల్లో ఈ సమావేశాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.90,64,0600 నిధులు విడుదల చేసింది. ఇక సమావేశం రోజు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లకు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను స్వయంగా ప్రధానోపాధ్యాయులు ఆహ్వాన లేఖ అందించి సమావేశానికి హాజరయ్యేలా చూడాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముందుగానే హాజరయ్యే తల్లిదండ్రుల సంఖ్యను తెలుసుకోవాలని, వారి సంఖ్యను ఐఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ వివరాల ఆధారంగా బిల్లులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కాగా ఈ పీటీఎం సమావేశాలు పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల వికాసానికి, సమస్యల పరిష్కారానికి దిక్సూచిగా నిలవనున్నాయి.

ఏపీలో 18 పైవంతెనలు

(మొదటిపేజీ తరువాయి)

జంక్షన్ వద్ద నిర్మిస్తున్న పైవంతెన 2025 ఫిబ్రవరి 15కి, గుంటూరు మిర్చి యార్డు వద్ద నిర్మిస్తున్న వంతెన జనవరి 6వ తేదీకల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్‌హెచ్-16పై నాగులుప్పలపాడు గ్రోత్ సెంటర్, రాజుపాలెం జంక్షన్ల వద్ద తలపెట్టిన వంతెనల నిర్మాణాలకు అనుమతి లేఖలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంత జాతీయ రహదారిలోని జొన్నతాళి, రాజుపాలెం, చెవ్వూరు క్రాస్‌రోడ్లు, రణస్థలం టౌన్‌తో పాటు ఎన్‌హెచ్-44పై కియో వద్ద తలపెట్టిన పైవంతెనల నిర్మాణాలకు బిడ్‌లు పిలిచినట్లు వివరించారు.

ఎంఎస్‌పీకే పంటలు కొంటాం

రాజ్యసభలో వ్యవసాయమంత్రి చౌహాన్ కీలక ప్రకటన

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రైతుల నిరసనలు, దేశ రాజధాని ఢిల్లీకి పెద్ద ఎత్తున రైతుల సమీకరణ జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాజ్యసభలో కీలక ప్రకటన చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అంశంపై అనుబంధ ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ఈ మేరకు హామీ ఇచ్చారు. "రైతుల పండించే అన్ని పంట ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని మీ ద్వారా సభకు హామీ ఇవ్వాలనుకుంటున్నాను. ఇది మోదీప్రభుత్వం, మోదీ గ్యారెంటీని నెరవేర్చే హామీ" అని చౌహాన్ సభలో తెలిపారు. ఓ పక్క ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించడం సహా వివిధ డిమాండ్లతో రైతులు ఢిల్లీకి పాదయాత్ర చేపట్టిన క్రమంలోనే వ్యవసాయమంత్రి ఈ ప్రకటన చేయడం గమనార్హం. "అవతలి వైపు కూర్చున్న మా స్నేహితులు అధికారంలో ఉన్నప్పుడు, వారు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు... ముఖ్యంగా ఉత్పత్తి ధర కంటే 50 శాతం ఎక్కువ ఇవ్వడాన్ని అంగీకరించలేదని... దీనికి సంబంధించిన రికార్డు నా వద్ద ఉంది" అని మంత్రి స్పష్టం చేశారు. తన వాదనకు మద్దతుగా మాజీ వ్యవసాయ శాఖ సహాయ మంత్రి కాంతిలాల్ భూరియా, వ్యవసాయ మంత్రులు శరద్ పవార్, కేవీ థామస్ పేర్లను ఆయన ఉదహరించారు. దీంతో చైర్మన్ జగదీప్ ధన్కర్ జోక్యం చేసుకుంటూ మంత్రి తన వాదనను ధృవీకరించడానికి పత్రాలను రికార్డ్ చేయమని అడిగారు, దానికి చౌహాన్ అంగీకరించారు. "వారు ఎన్నడూ రైతులను గౌరవించలేదు. లాభదాయక ధరల కోసం రైతుల డిమాండ్లను ఏనాడూ తీవ్రంగా పరిగణించలేదు. రైతులకు ఉత్పత్తి ఖర్చుపై 2019 నుండి 50 శాతం లాభంతో కనీస మద్దతు ధరను లెక్కించాలని ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయించారని మీ ద్వారా నేను సభకు హామీ ఇస్తున్నాను" అని మంత్రి పేర్కొన్నారు. వరి, గోదుమలు, జొన్నలు, సోయాబీన్‌లను మూడేళ్ల క్రితం నుంచి ఉత్పత్తి ధర కంటే 50 శాతం ఎక్కువకు కొనుగోలు చేస్తున్నామని, మోదీ ప్రభుత్వం ఇప్పటికే రైతులకు లాభసాటి ధరలను ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ఉత్పత్తుల రేట్లు పడిపోయినప్పుడల్లా ప్రభుత్వం ఎగుమతి సుంకాలు, ధరలను మారుస్తోందని చెప్పుకొచ్చారు. ఎంఎస్‌పీపై మీకున్న అవగాహన ఏంటని కాంగ్రెస్ సభ్యుడు జైరామ్ రమేశ్ ప్రశ్నించగా... "ఎంఎస్‌పీ గురించి నాకు స్పష్టమైన అవగాహన ఉంది. నెంఎస్‌పీని 50 శాతం కంటే ఎక్కువ లాభంతో మేము నిర్ణయిస్తాం. రైతుల ఉత్పత్తులను కూడా కొనుగోలు చేస్తాం" అని చౌహాన్ బదులిచ్చారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పంట ఉత్పత్తులను ఎంఎస్‌పీకి ఎన్నడూ కొనుగోలు చేయలేదని... రైతుల రక్తపు కన్నీరు కార్చారని మంత్రి విమర్శించారు. నా వరకు రైతులకు సేవ చేయడం అంటే... భగవంతునికి సేవ చేయడం లాంటిదన్నారు. జైరామ్ రమేశ్ మాట్లాడుతూ... ఎమ్మెస్పీపై రైతులతో మాట్లాడాలని మంత్రికి చైర్మన్ సూచించిన మాటల్ని గుర్తు చేశారు. దీనిపై ధన్కర్ స్పందిస్తూ... వ్యవసాయ మంత్రితో కలిసి తాను పర్యటించానని, రైతుల పట్ల తనకున్న నిబద్ధతపై హామీ ఇచ్చానని చెప్పారు. వ్యవసాయ రుణాల మాఫీ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందా అని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా అడిగిన ప్రశ్నకు చౌహాన్ బదులిస్తూ... రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. 'మోదీ జీ ప్రభుత్వం దూరదృష్టితో పని చేస్తుంది. మేము ఉత్పత్తిని పెంచుతాము. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తాం. ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలను అందిస్తాం. పంట నష్టపోతే నష్టపరిహారం అందిస్తాం. వ్యవసాయంలో వైవిధ్యాన్ని తీసుకువస్తాం. సహజ వ్యవసాయం వైపు మళ్లిస్తాం. రైతుల ఆదాయం పెరిగేలా చూస్తాం. ఎంతగా అంటే వారు ఎలాంటి వ్యవసాయ రుణమాఫీని కోరే స్థితిలో లేకుండా" అని చౌహాన్ చెప్పుకొచ్చారు.

బీజేపీ ఎంపీపై కాంగ్రెస్ హక్కుల తీర్మానం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ కూడా కేంద్రంపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాల ఎత్తుగడను అణిచివేసేందుకు మోదీ ప్రభుత్వం బుల్డోజింగ్ వైఖరి అనుసరిస్తోందని దుయ్యబట్టారు. గురువారం పార్లమెంట్ వెలుపల బీజేపీ నేత, మరో సభ్యుడు ప్రతిపక్ష నాయకుడిపై తీవ్ర అవమానకర వ్యాఖ్యలు చేశారని అన్నారు. ఇద్దరు నేతలపై కాంగ్రెస్ హక్కుల తీర్మానం ఇచ్చిందని అన్నారు.

ఓ సభ్యుడిని కించపరిచే వ్యాఖ్యలు చేశారని తాము ఫిర్యాదు చేస్తే... అదే సభ్యుడిని మాట్లాడేందుకు అనుమతించారని ఆరోపించారు. స్పీకర్‌పై అధికార పార్టీ ఒత్తిడి తీసుకువస్తోందని అన్నారు.

డ్రగ్స్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు

(మొదటిపేజీ తరువాయి)

ఎకరాలు కేటాయించినట్టు పేర్కొన్నారు.

పోలీస్‌కు నేరగాళ్లు భయపడాలి

ఎక్కడ తీవ్రవాద కార్యకలాపాలు జరిగినా మన పోలీసుల సాయం తీసుకుంటాం. పోలీసు ఉద్యోగం భావోద్వేగం... ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచే బాధ్యత. బాధితుల పట్ల పోలీసులంతా గౌరవంగా, మర్యాదగా మెలగాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరగాళ్లు, కబ్జారాయుళ్లకు అండగా ఉండటం కాదు. పోలీసు పేరు వినిపిస్తే చాలు... నేరగాళ్లు భయపడేలా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో మొత్తం 94 వేల మంది పోలీసులు ఉన్నారు. కొందరి తీరు కారణంగా అందరికీ చెడ్డ పేరు వస్తుంది. నేరగాళ్ల పట్ల కఠిన వైఖరి ప్రదర్శించాలి. స్టేషన్‌కు వచ్చిన ఏ ప్రజాప్రతినిధి అయినా మర్యాదగా వ్యవహరించాలి. పేదలు, సామాన్యులు, బాధితులకు పోలీసులు అండగా ఉండాలి. విధి నిర్వహణలో మరణించిన అధికారులు, పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు అండ...

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చూడాలని సీఎం అన్నారు. ట్రాన్స్ జెండర్ల సమస్యలను ప్రభుత్వం మానవీయ కోణంలో చూడాలి. ట్రాన్స్ జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమిస్తున్నాం. వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తాం. వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి తెలిపారు.

7 నవోదయ విద్యాలయాలు

(మొదటిపేజీ తరువాయి)

అనకాపల్లి, చిత్తూరులోని వలసపల్లె, సత్యసాయి జిల్లాలోని పాలసముద్రం, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తాళ్లపల్లె, రొంపిచర్ల, ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నందిగామ, నూజివీడు, నంద్యాల జిల్లాలోని డోన్‌లో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. తెలంగాణకు సంబంధించి కొత్తగా ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలను కేంద్రం ప్రకటించింది. రాష్ట్రంలోని జగిత్యాల, నిజామాబాద్, కొత్తగూడెం, మేడ్చల్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేటలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయనుంది.

కామాంధుడికి ఉరిశిక్ష

కోల్‌కతా: ఆర్జీ కర్ ఘటన తర్వాత బెంగాల్‌లో అత్యాచారాలపై చర్యలు కఠినతరమయ్యాయి. తొమ్మిదేళ్ల పాపను అపహరించి, ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టి, దారుణంగా చంపేసిన 19ఏళ్ల ముస్తకిన్ సర్దార్‌కు ఉరిశిక్ష విధిస్తూ బెంగాల్ పోక్సో కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. బీఎన్ఎస్‌లోని సెక్షన్ 65 (2), పోక్సో చట్టంలోని సెక్షన్ 6 కింద మరణ దండన విధించింది. అలాగే బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 140(1) కింద రూ.5వేల జరిమానా, యావజ్జీవ శిక్ష.... సెక్షన్ 238 కింద రూ.5వేల జరిమానా, ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధిత కుటుంబానికి రూ. 10లక్షల పరిహారమివ్వాలని ఆదేశించింది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో అక్టోబరు 4న బాలికపై హత్యాచారానికి సర్దార్ ఒడిగట్టాడు. ఈ కేసు దర్యాప్తు 25 రోజుల్లో పూర్తి కాగా... 61 రోజుల్లోనే దోషికి శిక్ష విధిస్తూ చారిత్రక తీర్పు వెలువడింది. ఆరోజు పాప కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులు జయ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేవలం రెండున్నర గంటల్లో కేసును ఛేదిం చారు. ప్రత్యక్ష సాక్షులు, సీసీటీవీ ఫుటేజి ఆధారంగా నిందితుడిని గుర్తించారు. సర్దార్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. అతను నేరాన్ని అంగీకరించి పాప మృతదేహం ఉన్న ప్రాంతాన్ని పోలీసులకు తెలిపాడు. దీంతో రాత్రికి రాత్రి పోలీసులు ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆపై ఐదుగురు సభ్యులతో కూడిన సిట్ బృందం సమగ్ర దర్యాప్తు చేపట్టింది. 25 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసింది. పోక్సో కోర్టులో అక్టోబరు 30న చార్జిషీటు దాఖలు కాగా నవంబరు 4న కోర్టు విచారణ మొదలైంది. 38 మంది సాక్షులను విచారించిన క్రమంలో నవంబరు 26వ తేదీతో కోర్టు విచారణ పూర్తి అయింది.

ప్రజా బలంతోనే వందేళ్లు మనగలిగాం : సాబీర్ పాషా

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సిపిఐ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు పేద ప్రజలు, కష్టజీవుల కర్షక కార్మికుల కోసం సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో మనుగడ సాగిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కే. సాబీర్ పాష అన్నారు. శుక్రవారం పాత పాల్వంచ బొడ్రాయి సెంటర్‌లో సీపీఐ 1వ, 2వ వార్డ శాఖల సమావేశం రెహమాన్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత నూతనంగా ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్థంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్ పాష మాట్లాడుతూ సిపిఐది వందేళ్ల చరిత్రని మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా ప్రజాక్షేత్రంలో మనగలుగుతామన్నారు. నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐకి ఎదురులేదన్నారు. ఎమ్మెల్యే కూనంనేని నాయకత్వంలో నియోజకవర్గని అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. డిసెంబర్ 26 నాటికి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో గ్రామ గ్రామాన వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించలన్నారు. ఈ సందర్భంగా పాత పాల్వంచ కు చెందిన 50 కుటుంబాలు సిపిఐలో చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, నాగరాజు, పద్మజ, జానీమియా, రాజు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, చెన్నయ్య, వెంకట్రామయ్య, మన్నెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

విశాలాంధ్ర - గార్ల : అంటరానితనంతో పాటు అసమానతలు, వివక్షతలపై అలుపెరుగని పోరాటం చేసి, కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడు బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వరావు, రిటైర్డ్ ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ గంగావత్ రాంసింగ్ నాయక్‌లు అన్నారు. శుక్రవారం గార్ల పట్టణ కేంద్రం, పెద్దకిష్టపురంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుష బేధాలు లేకుండా మనుషులందరూ ఒక్కటేనని చాటి స్త్రీలకు ఓటు హక్కు కల్పించిన మహానుభావుడు అన్నారు. రాజ్యాంగ హక్కులు బాధ్యత వర్గాలందరికీ దక్కాలని కలలు కన్న స్వప్నికుడని కొనియాడారు. మానవ జాతి ఉన్నంత వరకు ఆయన ప్రజల గుండెల్లో చిరంజీవిగా బ్రతికే ఉంటారన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కట్టేబోయిన శ్రీనివాస్, జి.సక్రు, హతిరాం నాయక్, బాపనపల్లి సుందర్, చిట్టిబాబు, మోహన్, చెన్న నాయక్, మంగీలాల్, మండ రాము, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేద్కర్‌కు జిల్లా కాంగ్రెస్ నివాళి

విశాలాంధ్ర - ఖమ్మం : భారత రత్న, ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మహోన్నతుడని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి కృషి చేశారని, స్వతంత్ర భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పి, సామాజిక సమానత్వం, న్యాయం, హక్కుల రక్షణకు బాబాసాహెబ్ రాజ్యాంగం రచించారని పేర్కొన్నారు. వీరితో పాటు ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు, సేవాదళ్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, బొడ్డు ఓబొందయ్య, సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, రాష్ట్ర ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు వద్దేబోయిన నరసింహరావు, కార్పొరేటర్లు దుద్దుకూరి వేంకటేశ్వరరావు, మలీదు వేంకటేశ్వరరావు, లకావత్ సైదులు నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ అబ్దుల్ రషీద్, మద్దినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో డీయంహెచ్ఓ తనిఖీ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ములుగు మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల మల్లంపల్లి, పందికుంట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు ఆకస్మిక తనఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్‌రావు మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వారికి, అర్హులైన వారందరికీ, సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని జాతీయ కార్యక్రమాల్లో లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం చేస్తే, శాఖ పరమైన చర్యలు ఉంటాయని సిబ్బందిని హెచ్చరించారు. అటు తరువాత అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ, మామ్ పిల్లల గురించి ఆరా తీసి, అంగన్వాడి పిల్లలకు బాలా మృతం వంటి పోషకాహార ఆహారాన్ని అందించాలని, పోషకాహార ప్రాముఖ్యతపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ఆరోగ్యవంతు లైన పిల్లలుగా తీర్చిదిద్దాలని అంగన్వాడి టీచర్కు కోరారు. జిల్లా తల్లి ఆరోగ్యం, పోషకాహార ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్. ప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ఏఐటీయుసీ లక్ష్యం

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి: సింగరేణి కార్మిక సమస్యలే గుర్తింపు కార్మిక సంఘం, ఏఐటీయుసి లక్ష్యమని యూనియన్ అధ్యక్షులు వి.సీతా రామయ్య అన్నారు. శుక్రవారం గోదావరిఖని సెంటినరీ కాలనీలో జరిగిన యూనియన్ కేంద్ర కమిటి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత పది సంవత్సాలుగా టీబీజీకెఎస్ గుర్తింపు కార్మిక సంఘంగా కాలంలో పరిష్కారం కాని సమస్యలు ఒక్కొక్కటి పరిష్కారం చేస్తున్నామని, ఇటీవల జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో మెడికల్ అన్ఫిట్ ఐన మైనింగ్ సూపర్ వైజర్లకు స్యూటేబుల్ ఉద్యోగాలుతో పాటు మరికొన్ని సాధించామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శితో పాటు నాయకులు కె.సారయ్య, వై.విరావు, మడ్డి ఎల్లయ్య, సమ్మయ్య, వెంకటస్వామిలతో పాటు కేంద్ర నాయకులు, బ్రాంచి కార్యదర్శులు మాట్లాడారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తం

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రానున్న నాలుగు సంవత్సరాల కాలంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో మిగిలిపోయిన, పెండింగ్ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. ఈనెల 7న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా పర్యటన సందర్భంగా శుక్రవారం అయన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రాఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నాల ప్రభాకర్‌తో కలిసి నల్గొండ జిల్లా నార్కెట్పల్లి మండలం, బ్రాహ్మణ వెల్లేముల బాలెన్సింగ్ రిజర్వాయర్‌ను సందర్శించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్న బ్రాహ్మణ వెల్లేముల ప్రాజెక్టు పైలాన్‌ను, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద నిర్వహించనున్న పూజా కార్యక్రమాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ బ్రాహ్మణ వెల్లేముల ప్రాజెక్టు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలల ప్రాజెక్టు అని, ముఖ్యంగా కరువు ప్రాంతమైన బ్రాహ్మణ వెల్లెములకు ఉదయ సముద్రం ద్వారా లక్ష ఎకరాలకు సాగు నీరు అందించే బ్రాహ్మణవెల్లెముల ప్రాజెక్టు గొప్ప విషయమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శనివారం బ్రాహ్మణవెల్లెముల ప్రాజెక్టుకు ఉదయ సముద్రం నుండి బ్రాహ్మణ వెల్లములకు 0.3 టిఎంసి నీటిని విడుదల చేయనున్నారని తెలిపారు. బ్రాహ్మణ వెల్లేములకు సంబంధించి నిధులు, అనుమతులు, టెక్నికల్ శాంక్షన్ అన్నింటిని యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేస్తామని, వారం రోజుల్లో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకుగాను మిగిలిపోయిన 730 ఎకరాల భూసేకరణ కూడా పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సాగునీరు ఇస్తామన్నారు. ఈ ప్రాంతంలో మొదటి విడుతన 50000 ఎకరాలకు సాగునీరు రావడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ప్రాజెక్టుల పూర్తికి కంకణం కట్టుకున్నామని, ప్రత్యేకించి నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేసే ఎస్ఎల్ బీసీ టన్నెల్ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ టర్మ్ లోనే ఎస్ఎల్ బిసీ టన్నెల్ పూర్తి చేస్తామని, ఎస్ఎల్ బీసీ ద్వారా శ్రీశైలం డెడ్ స్టోరేజ్ నుండి కూడా నీరు తీసుకోవచ్చని, ఎస్ ఎల్ బి సి ద్వారా 3 లక్షల ఎకరాలకు పైగా ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా ప్రాజెక్టుల సీఈ అజయ్ కుమార్, సిఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డిఓ అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మచ్చలేని కమ్యూనిస్టు నేత పోటు ప్రసాద్

విశాలాంధ్ర - ఖమ్మం : మూడున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఏ కళంకం అంటని మచ్చలేని కమ్యూనిస్టు నాయకునిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పేరొందారని, ఆయన మరణం ప్రజా పోరాటాలకు తీరని లోటని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. పేదల అభ్యున్నతి కోసం ప్రసాద్ పాటు పడ్డారని ఆయన పేర్కొన్నారు. దివంగత సిపిఐ నేత పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఖమ్మం హవేలీ సిపిఐ సమితి ఆధ్వర్యంలో స్థానిక సిటీ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ సంపన్న, రైతు కుటుంబంలో జన్మించిన పోటు ప్రసాద్ కుటుంబ సభ్యులంతా కమ్యూనిస్టు పార్టీ కోసం-అనేక త్యాగాలు చేశారన్నారు. పోటు ప్రసాద్ తాత, నాయనమ్మ, తండ్రి సాయుధ తెలంగాణ పోరాటంలో కీలక భూమిక పోషించారన్నారు. ప్రసాద్ నాయనమ్మ ఎర్రమ్మను అప్పట్లో తీవ్ర చిత్ర హింసలు పెట్టారని ఆస్తి, కుటుంబాన్ని వదిలి గుంటూరులో తలదాచుకుందన్నారు. ఖమ్మంలో పిజి కాలేజీ సాధన కోసం జరిగిన ఆందోళనలో ఆయన అగ్ర భాగాన నిలిచారని హేమంతరావు తెలిపారు. ప్రజా పోరాటాలే ప్రసాద్కు సరైన నివాళి అన్నారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఎస్కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, సిపిఎం నాయకులు దొంగల తిరుపతిరావు, ఎంఎల్ పార్టీ నాయకులు శిరోమణి, శ్రీనివాసరావు, సిపిఐ, ఏఐటియుసి నాయకులు పి. మోహన్రావు, జాకీర్, అక్రం, ఆముదాల-వెంకన్న, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని సిర్పూర్ టి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి సందర్శించి పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, రిజిస్టర్లు, నిత్యవసర సరుకులు నాణ్యతలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించాలని. వంట చేసే సమయంలో నాణ్యత గల నిత్యవసర సరుకులను, తాజా కూరగాయలను వినియోగించాలని, కాలం చెల్లిన వాటిని వినియోగించినట్లయితే తగిన చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

సొసైటీల అభివృద్ధికి అన్ని శాఖలు కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : సొసైటీల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ అధికారులు కేవలం పశువులకు వ్యాక్సినేషన్ ఇవ్వడం, వాటి సంఖ్య నమోదు చేయడం మాత్రమే కాకుండా పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో గ్రామంలో ఎన్ని పశువులు ఉన్నవి పాడి పరిశ్రమలు నెలకొల్పితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది అనే ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. అజోల్ల పెంపకం, పశుగ్రాసం పెంపకంపై దృష్టి పెట్టి కృషి చేయాలన్నారు. డిసిసిబి, నాబార్డ్ సహకారంతో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో మొక్కజొన్న పండించే ప్రాంతాల్లో మొక్కజొన్న ఆకుల ద్వారా దానా తయారీ పరిశ్రమల స్థాపనకు ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుల క్రింద పత్తి విత్తనాల నుండి ఆయిల్ సేకరణ పరిశ్రమ, చేపల దాన తయారీ పరిశ్రమ, పాడి పరిశ్రమ, కమ్యూనిటీ పశువుల షెడ్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. జడ్పీ సీఈవో చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సహకార శాఖ అధికారి ఖుర్షీద్, పశు సంవర్ధక, మత్స్య శాఖ అధికారి ఇంతియాజ్ ఖాన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - వనపర్తి : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారాలు చేయాలని శుక్రవారం పెబ్బేరు ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు తెచ్చి మరి విద్యార్థుల కడుపులు నింపుతున్నారని. కార్మికుల పెండింగ్ బిల్లులు మాత్రం ఎనిమిది నెలల నుంచి ఇవ్వడం లేదని ఆరోపించారు. పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, గుడ్లకు మార్కెట్లో ఏడు రూపాయలు ధర పలుకుతుందని ప్రభుత్వ మాత్రం కార్మికులకు ఐదు రూపాయలు మాత్రమే అందజేస్తుందని తెలియజేశారు. ప్రభుత్వమే గుడ్లను ఉచితంగా సరఫరా చేయాలని అక్రమ తొలగింపులు అరికట్టాలని కార్మికులకు కనీస వేతన 26000 ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని వారికి పని భద్రత కల్పించి పర్మినెంట్‌గా వారినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి నాలుగు జతల కాటన్ చీరలు యూనిఫామ్‌లుగా ఇవ్వాలని ప్రమాద బీమా 20 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈఓ జయరాములుకు వినతిపత్రాన్ని సమర్పించడం జరిగింది. మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మి, పద్మ, గోవిందమ్మ శ్రీదేవి సరోజ శేషమ్మ అనురాధ మహేశ్వరి శారద, మన్నెమ్మ, మహిముదా, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు ఆఫీసర్స్ పనితీరు ప్రశంసనీయం : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పోలీసు శాఖలో హెూంగార్డు ఆఫీసర్స్ పనితీరు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. 62వ హెూంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఐఎంఏ ఫంక్షన్ హాల్లో శుక్రవారం వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ హాజరై మాట్లాడారు. ముందుగా ఎస్పీ శాంతి కపోతాన్ని ఎగురవేశారు. పోలీస్ శాఖలో ఒక భాగమై పోలీసులతో సమానంగా హెూంగార్డ్ ఆఫీసర్స్ నిరంతరం విధులు నిర్వర్తిస్తూ తమకు అందించే సేవలు చాలా కీలకమన్నారు. వీరు చాలా అంకిత భావంతో సేవలందిస్తున్నారని కొనియాడుతూ ఉదంతాలు వివరించారు. హెూంగార్డ్స్ ఆఫీసర్స్ సంక్షేమానికి అన్ని వేళలా ముందుంటామన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటూ తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టీ.సాయి మనోహర్, ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, డిఎస్పీలు అబ్దుల్ రెహమాన్, డిఎస్పీ సతీష్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు, సీఐలు సంజీవ్ కుమార్, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, సురేష్, టి. కరుణాకర్, ఇంద్రాసేనారెడ్డి, ఆర్ఐలు నరసింహారావు, లాల్ బాబు, సుధాకర్, కృష్ణారావు, రవి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చర్లలో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

విశాలాంధ్ర - చర్ల : మండల కేంద్ర పరిధిలో ఉన్న పలుచోట్ల రాజకీయపార్టీలు, కుల సంఘాల ఆధ్వర్యంలో బాబా సాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ నాయకులు టీపీసిసి సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అస్పృశ్యత, అంటరానితనం పోయి సమానత్వం రావాలని అంబేద్కర్ అహర్నిశలు పనిచేశారన్నారు. భారతదేశానికి ఒక దిక్సూచి రాజ్యాంగాన్ని అందించి ప్రతి పౌరుల హక్కులు కలిగేలా జీవితకాలం శ్రమించిన మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఈ వర్ధంతి సభను వారి కార్యాలయంలో నిర్వహించారు. అంబేద్కర్ చేసిన త్యాగాలను ఒక్కొక్కటి వివరించారు. బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో వాహన తనిఖీలు

విశాలాంధ్ర - పినపాక : మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాల తనిఖీలు జరుగుతున్నాయి. ఏడూళ్ల బయ్యారం ఎస్ఐ రాజ్ కుమార్ శుక్రవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. పినపాక మండలం, మణుగూరు - ఏటూరునాగారం ప్రధాన రహదారి జానంపేటలో ఎస్ఐ వాహనాలు తనిఖీ చేపట్టి ప్రయాణికుల రాకపోకల వివరాలను సేకరించారు. మండల ప్రజలు మావోలకు సహకరించి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దన్నారు. గ్రామాల్లోకి కొత్తగా వచ్చే వారు అనుమానంగా కనబడిన పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలకు కుర్చీలు వితరణ

విశాలాంధ్ర - ఖమ్మం : కొనిజర్ల మండలం తుమ్మలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పరిస సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ వారు 15 కుర్చీలను అందజేశారు. ఈ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు లుపరిశ పుల్లయ్య పేద విద్యార్థుల పై చదువుల కోసం సహాయం చేస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం సాధ్యమైనంత సహకారం అందిస్తున్నారు. తుమ్మలపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి రాజశేఖర్ మాట్లాడుతూ పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. కుర్చీలను ట్రస్ట్ తరపున అనుమోలు నాగేశ్వరరావు అందజేశారు. తుమ్మలపల్లి ఉన్నత పాఠశాలకు అవసరమైన సదుపాయాలు సమకూర్చటానికి పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. పదవతరగతి వార్షిక పరీక్షలలో మంచిఫలితాలు సాధించాలని నాగేశ్వరరావు విద్యార్థులను కోరారు. అనుమోలు గాయత్రి, మైలవరపు పుల్లారావు, నల్లా సాయిబాబు, ఉపాధ్యాయులు రమేష్ పాల్గొన్నారు.

ఐటెల్ 'ఐకాన్ 3' స్మార్ట్‌వాచ్ విడుదల

హైదరాబాద్: భారత్‌లో ప్రముఖ టెక్నాలజీ బ్రాండ్ ఐటెల్ తన ప్రీమియం స్మార్ట్‌వాచ్ 'ఐకాన్ 3'ని విడుదల చేసింది. ఇది ఫిట్‌నెస్, ఫ్యాషన్ ప్రియులను ఎంతగానో ఆకట్టుకోనుంది. ఆకర్షణీయమైన డిజైన్, హెల్త్ పర్పస్ ఫీచర్లతో తీర్చిదిద్దబడింది. ఈ స్మార్ట్‌వాచ్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉంది. ఫిట్‌నెస్, ఫ్యాషన్ ప్రియులకు మరింత సులభంగా అందుబాటులో ఉంటుంది. ఈ స్మార్ట్‌వాచ్ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో 70 శాతం డిస్కౌంట్‌తో కేవలం రూ. 1699 కే పొందవచ్చు. ఈ ఆఫర్ పరిమిత కాలం మాత్రమే ఉంటుంది.

అతిపెద్ద ఇన్వెర్టర్ బ్యాటరీ రేంజ్‌తో ఈస్ట్‌మన్ ఇండియాకి పవర్

న్యూఢిల్లీ: ఈస్టమన్ ఆటో అండ్ పవర్ అనేది విద్యుత్‌రంగంలో ఒక అగ్రగామి సరఫరాదారు. తాజాగా అది తన ఇన్వెర్టర్ బ్యాటరీ పోర్ట్‌ఫోలియో పెద్ద విస్తరణని ప్రకటించింది. అది సుమారు 100 కొత్త మోడల్స్‌ని ఈస్టమన్ బ్రాండ్‌లను, ఏడిడిఓ బ్రాండ్‌లో మొత్తం 170పైగా ఎస్‌కెయులను పరిచయం చేసింది. ఇది ఇన్వెటర్ బ్యాటరీ మార్కెట్ నాయకుడిగా నిలిచింది, అత్యధిక పోర్ట్‌ఫోలియోని అందిస్తుంది. ఇది ప్రతి శక్తి అవసరాలకు ఒక పరిష్కారాన్ని అందిస్తుంది. ఈ విస్తరించిన పోర్ట్‌ఫోలియో విస్తృత స్పెక్ట్రమ్ సమర్థ్యాలను 100ఏహెచ్ నుంచి 400ఏహెచ్ గ్రౌండ్ బ్రేకింగ్ వరకు కవర్ చేస్తుంది. ఇలాంటిది ఇండియాలో ఇదే మొదటిసారి. ఇది ప్రతి అప్లికేషన్‌కి అనగా ఇల్లు, కమర్షియల్ ప్రదేశాలు లేదా పరిశ్రమలకు శక్తి పరిష్కారాలను అందిస్తుంది. ఈస్టమన్ నమ్మకం కోసం ఇండియా బ్యాటరీ మార్కెట్‌కి పరిశ్రమ విస్తృత రేంజ్ వారెంటీతో కొత్త బెంచ్ మార్క్‌ని సెట్ చేసింది. వినియోగదారులు 36 నెలల నుంచి అపూర్వమైన 240 నెలలు (20 సంవత్సరాల) వరకు ప్రశాంతతని అందించేలా చేస్తుంది. ఇది ఈస్టమన్ ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని ఉత్పత్తి నాణ్యతతో పాటు అందిస్తుంది.

దుబాయ్‌లో స్వల్ప పర్యటన చేయడం ఎలా?

ముంబయి: విమాన ప్రయాణాలలో సాధారణ విరామాన్ని కూడా ఒక మినీ-సెలవు దినంగా మార్చడానికి దుబాయ్ అనువైన గమ్యస్థానంగా ఉంది. గ్లోబల్ కనెక్టివిటీ, చూడవలసిన, చేయవలసిన విభిన్న కార్యక్రమాలతో, దుబాయ్ ప్రయాణంలో కేవలం ఒక రాత్రి లేదా రెండు రోజులు మాత్రమే ఉన్నా, సందర్శించేందుకు చక్కటి ప్రదేశంగా ఉంటుంది. అదెలా అంటే, మీరు ఎమిరేట్స్‌లో ప్రయాణిస్తున్నట్లయితే, దుబాయ్ స్టాప్‌ఓవర్‌ను సులభంగా బుక్ చేసుకోవచ్చు. వారు విమానాశ్రయంలో కలుసుకోవడం, గ్రీట్ చేయడం ప్రారంభించి 24 గంటల చెక్-ఇన్, పర్యటనలు, విహారయాత్రలు, అవసరమైతే వీసాల వరకు ప్రతిదీ చూసుకుంటారు. అనేక దేశాల్లో, ఎమిరేట్స్ పర్యటనను రూపొందించడంలో సహాయపడటానికి 'దుబాయ్ ఎక్స్‌పీరియన్స్' ప్రోగ్రామ్‌ను కూడా అందిస్తుంది. దుబాయ్ 70 కంటే ఎక్కువ జాతీయులకు వీసా-రహిత రాకపోకలను అందిస్తుంది. అవసరమైతే, ఎమిరేట్స్‌లో ప్రయాణించే వారికి 96 గంటల వీసా అందుబాటులో ఉంటుంది. పర్యాటకులు దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఉచిత మొబైల్ సిమ్ కార్డ్‌ని పొందవచ్చు. 24 గంటల పాటు చెల్లుబాటు అయ్యే 1జీబీ ఉచిత మొబైల్ డేటాను పొందవచ్చు.

విదేశీ విద్యలో సమస్యలకు షిఫ్టెడ్ 2024 పరిష్కారం

హైదరాబాద్: గ్రాడ్‌రైట్ ప్రతిష్టాత్మక కార్యక్రమం రెండవ ఎడిషన్, షిఫ్టెడ్ 2024, ప్రపంచ ఉన్నత విద్యా పర్యావరణ వ్యవస్థలో పారదర్శకత, విశ్వాసం, జవాబుదారీతనం పరంగా ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులను ప్రభావితం చేసే ఒక క్లిష్టమైన సమస్యను పరిష్కరించడానికి 4,000 మంది విద్యార్థులు, 8 మంది ఆర్థిక భాగస్వాములు, 24 ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమ ప్రముఖులను ఒకచోట చేర్చింది. సెయింట్ లూయిస్‌లోని వాషింగ్టన్ విశ్వవిద్యాలయం, లెహి విశ్వవిద్యాలయం, రట్జర్స్ విశ్వవిద్యాలయం, బ్రాండీస్ విశ్వవిద్యాలయం, సిటీ యూనివర్శిటీ ఆఫ్ న్యూయార్క్, శాన్‌డియాగో విశ్వవిద్యాలయం వంటి వివిధ విశ్వవిద్యాలయాల నుండి డీన్స్, అడ్మిషన్ల డైరెక్టర్లతో పాటుగా హెచ్‌డిఎఫ్‌సి క్రెడిలా, ఐసిఐసిఐ బ్యాంక్, ప్రాడిజీ ఫైనాన్స్, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ తో సహా రుణ భాగస్వాములతో పాటు పలువురు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

2024 మోస్ట్ పాపులర్ ఇండియన్ స్టార్స్‌లో నెంబర్‌వన్‌గా త్రిప్తి డిమ్రీ

ముంబై: సినిమాలు, టీవీ, ప్రముఖుల సమాచారం కోసం ప్రపంచంలోని అత్యంత ప్రాచుర్యం పొందిన ఐఎండీబీ తాజాగా 2024 టాప్ 10 మోస్ట్ పాపులర్ ఇండియన్ స్టార్స్ జాబితాను ప్రకటించింది. 2024లో నెం.1 ఇండియన్ స్టార్ అయిన త్రిప్తి డిమ్రి ఈ ఏడాది బ్యాడ్ న్యూజ్, విక్కీ విద్యా కా వో వాలా వీడియో, భూల్ భులైయా 3 అనే మూడు సినిమాల్లో నటించి ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించిందని ప్రకటించింది. ఆ రకంగా 2024 సంవత్సరానికి గాను టాప్ 10-మోస్ట్ పాపులర్ ఇండియన్ స్టార్స్‌లో నెంబర్‌వన్‌గా త్రిప్తి డిమ్రీ ఉండగా, తదుపరి స్థానాల్లో దీపికా పదుకొణె, ఇషాన్ ఖట్టర్, షారుఖ్ ఖాన్, శోభిత ధూళిపాళ, శార్వరి, ఐశ్వర్య రాయ్ బచ్చన్, సమంత, అలియా భట్, ప్రభాస్‌లు నిలిచారు.

శామ్‌సంగ్ ఎడ్జ్ సీజన్ 9 విజేతలు ఖరారు

గురుగ్రామ్: భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ తాజాగా శామ్‌సంగ్ ఎడ్జ్ (ఈడీజీఈ) తొమ్మిదవ ఎడిషన్ విజేతలను ప్రకటించింది. ఎడ్జ్-ఎంపవరింగ్ డ్రీమ్స్ గెయినింగ్ ఎక్సలెన్స్ అనేది వార్షిక ఫ్లాగ్‌షిప్ క్యాంపస్ ప్రోగ్రామ్. ఇది వేలాది మంది తెలివైన యువకులకు వారి వ్యాపార చతురత, వ్యూహాత్మక ఆలోచన, నాయకత్వ నైపుణ్యాలను ప్రదర్శించడానికి అవకాశాలను అందిస్తుంది. ఈ సంవత్సరం, టాప్-టైర్ బీ-స్కూల్స్, ఇంజనీరింగ్ కాలేజీలు, డిజైన్ స్కూల్‌లతో సహా 40 ప్రముఖ క్యాంపస్‌ల నుండి 15,000 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. దేశంలోని కొంతమంది తెలివైన విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ, ఆవిష్కరణ, సహకార స్ఫూర్తిని ప్రతిబింబించారు. గురుగ్రామ్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో కార్యక్రమంలో మిస్టర్ జెబి పార్క్, ప్రెసిడెంట్, సిఇఒ, శామ్‌సంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా, శామ్‌సంగ్ ఇండియాలోని ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గ్లోబల్ క్లైమేట్ యాక్షన్ మూవ్‌మెంట్ '1.5 మేటర్స్' ప్రారంభం

హైదరాబాద్: 1ఎం1బీ (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) ద్వారా ప్రారంభించబడిన 1.5 మేటర్స్ దేశవ్యాప్త వాతావరణ కార్యాచరణ కార్యక్రమం. ఈ వినూత్న కార్యక్రమం, భారతదేశ వాతావరణ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేషన్లు, విద్యాసంస్థలు, వినూత్న ఛేంజ్ మేకర్స్‌ను ఏకతాటి పైకి తీసుకురావడానికి ఒక పరివర్తన క్షణాన్ని సూచిస్తుంది. పారిస్ ఒప్పందం ప్రకారం, వాతావరణ మార్పుల అత్యంత తీవ్రమైన ప్రభావాలను తగ్గించడానికి దేశాలు ప్రపంచ ఉష్ణోగ్రతను 1.5 డిగ్రీల సెల్సియస్ లోపల పరిమితం చేయడానికి కట్టుబడి ఉన్నాయి. హైదరాబాద్‌లోని టి-వర్క్స్‌లో జరిగిన అత్యున్నత స్థాయి కార్యక్రమంలో 1.5 మేటర్స్ ఆవిష్కరించబడింది. ప్రపంచ వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో రాష్ట్రం దృఢ నిబద్ధతను సూచిస్తూ, 1.5 మేటర్స్ కార్యక్రమానికి మద్దతు ఇస్తానని నిర్ణయాత్మక ప్రతిజ్ఞ చేస్తూ తెలంగాణ నుండి ప్రభావవంతమైన నాయకులను, 10,000 మందికి పైగా పౌరులను ఒకచోట చేర్చింది.

9 నుంచి ఇసుజు ఐ-కేర్ వింటర్ క్యాంప్'

హైదరాబాద్: అసాధారణ, అసమానమైన యాజమాన్య అనుభవాన్ని అందించడంలో తన నిబద్ధతను కొనసాగిస్తూ, ఇసుజు మోటార్స్ ఇండియా దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇసుజు ఐ-కేర్ వింటర్ క్యాంప్'ను ప్రకటించింది. ఇసుజు డి-మాక్స్ పికప్‌లు, ఎస్‌వియూల శ్రేణి కోసం రూపొందించిన ఈ సేవా శిబిరం దేశవ్యాప్తంగా ఉన్న ఇసుజు వాహన యజమానులందరికీ అనేక రకాల ఉత్తేజకరమైన ప్రయోజనాలు, నివారణ నిర్వహణ తనిఖీలను అందిస్తుంది. 'ఇసుజు కేర్' చొరవ, మాన్‌సూన్ క్యాంప్ అన్ని ఇసుజు అధీకృత డీలర్ సర్వీస్ అవుట్‌లెట్‌లలో డిసెంబరు 9-14వ తేదీ మధ్య (రెండు రోజులు కలుపుకొని) నిర్వహించబడుతుంది. ఈ కాలంలో, కస్టమర్‌లు తమ వాహనాలకు ప్రత్యేక ఆఫర్‌లు, ప్రయోజనాలను కూడా పొందవచ్చు 'ఇసుజు కేర్' చొరవతో వింటర్ క్యాంప్ జరుగుతుంది.

పారా అథ్లెట్లు అసాధారణ విజయాలు

హైదరాబాద్: ఆధునిక పారా స్పోర్ట్స్ అకాడమీ, రీహాబిలిటేషన్ సెంటర్ ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్)లో శిక్షణ పొందిన పారా అథ్లెట్లు అసాధారణ విజయాలు సాధించారు. రంగారెడ్డి జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చదువుతున్న ఈ యువ ఛాంపియన్లు థాయ్‌లాండ్‌లోని రచ్చసింహలో నిర్వహించిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్ యూత్ గేమ్స్ 2024లో భారతదేశానికి నంబర్ వన్ ర్యాంకు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్లో శిక్షణ పొందిన ఈ అథ్లెట్లు మూడు రోజుల్లో 16 మెడల్స్ (5 బంగారం, 8 వెండి, 3 కాంస్యం) గెలుచుకున్నారు.

సంపాదకీయం

'ఇండియా' అనైక్యతా రాగం

శత్రువు బలపడ్తున్న కొద్దీ ప్రతిపక్షం బలహీనపడడానికి పోటీ పడ్తున్నట్టుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్వేష పూరిత రాజకీయాలను, రాజ్యాంగ విధ్వంసాన్ని ఎదిరించే ఉద్దేశంతో ప్రతిపక్ష పార్టీలు "ఇండియా" ఐక్య సంఘటన పేరుతో ఏకమైనాయి. ప్రతిపక్షాల ఐక్యత గురించి అనేక సందర్భాలలో చర్చ జరిగింది. మమతా బెనర్జీ, కె.చంద్రశేఖరరావు లాంటి వారందరూ ప్రతిపక్షాలను ఐక్యం చేయడానికి ఎంతో కొంత ప్రయత్నం చేశారు. చివరకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చేసిన ప్రయత్నం ఫలించి పట్నాలో "ఇండియా" ఐక్య సంఘటన రూపు దిద్దుకుంది. విచిత్రం ఏమిటంటే ఆ వెంటనే నితీశ్ కుమార్ తానే చొరవ తీసుకుని ఏర్పాటు చేసిన ప్రతిపక్ష ఐక్య సంఘటన నుంచి ఒక్క గెంతు గెంతి ఎన్.డి.ఎ.తో కలిసి పోయారు. ప్రధానమంత్రి కావాలన్న కోరిక ఎవరికి ఉండదుగనక! నితీశ్ కుమార్ కూడా ప్రతిపక్షం గెలిస్తే తానే ప్రధానమంత్రిని కావాలని అనుకుని ఉండొచ్చు. కానీ తీరా "ఇండియా" ఐక్య సంఘటన ఏర్పడిన తరవాత ఆయనను కనీసం "ఇండియా" సమన్వయకర్తనైనా చేయలేదు. అందుకని ఆయన మళ్లీ మోదీ చేయిపట్టుకుని వెళ్లినట్టున్నారు. 2025 ఫిబ్రవరి 20లోగా దిల్లీ శాసనసభకు, అక్టోబర్–నవంబర్ నెలల్లోగా బీహార్ శాసనసభకు ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. దిల్లీలో అధికారంలో ఉన్న కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ఆద్మీ పార్టీ "ఇండియా" ఐక్యసంఘటనలో పైకి చూడడానికి భాగస్వామిలాగే కనిపిస్తుంది. కానీ వరసగా మూడు ఎన్నికల్లో గెలిచామని, పంజాబ్‌లో అధికారం తమదేనన్న ధీమావల్ల కేజ్రీవాల్ పార్టీ ఏ దశలోనూ "ఇండియా" ఐక్య సంఘటనతో సఖ్యంగా ఉన్న దాఖలాలు లేవు. మొన్నటి లోక్‌సభ ఎన్నికలలో మాత్రం దిల్లీ లోక్‌సభ స్థానాల మేరకు ఆమ్ఆద్మీ పార్టీ కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుంది. అయినా రెండు పార్టీలకు దక్కిందేమీ లేదు. శాసనసభ మేరకు ఇప్పటి దాకా ఆమ్ఆద్మీ పార్టీకి తిరుగు లేదు. అందువల్లే కేజ్రీవాల్ మిగతా ప్రతిపక్షాలతో అంటీముట్టనట్టే ఉంటున్నారు. దిల్లీ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తూ ఉండదని వారం రోజుల కింద తెగేసి చెప్పారు. అంటే ఆయన దృష్టిలో ఉమ్మడి శత్రువు అయిన మోదీని, ఆయన నాయకత్వంలోని బీజేపీని ఓడించడం కన్నా దిల్లీలో అధికారం కాపాడుకోవడమే ప్రధానమైపోయినట్టు ఉంది. ప్రతిపక్షాల మధ్య ఐక్యత ఉండాలంటే అన్ని పక్షాలకూ సర్దుబాటు తత్వంఉండాలి. ఇచ్చి పుచ్చుకునే ధోరణి ఉండాలి. అవసరమైనప్పుడు త్యాగం చేసే శక్తీ ఉండాలి. లోక్‌సభ ఎన్నికలలో ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్ వాదీ పార్టీ, కాంగ్రెస్‌కు సీట్లు కేటాయించడంలో ఇచ్చి పుచ్చుకునే తత్వం నిండుగా ప్రదర్శించింది. అందుకే ప్రతిపక్షాలు ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్న బీజేపీకన్నా ఎక్కువ స్థానాలు సాధించగలిగాయి. కానీ దిల్లీలో బలంగా కనిపిస్తున్న ఆమ్ఆద్మీ పార్టీ నాయకుడు కేజ్రీవాల్, బెంగాల్‌లో అసాధారణమైన పట్టు సాధించిన మమతా బెనర్జీ "నా కోడి నా కుంపటి లేకపోతే తెల్లారదు" అన్న రీతిలోనే వ్యవహరిస్తున్నారు. మమతా బెనర్జీ కూడా అనేక సార్లు "ఇండియా" ఐక్య కూటమితో విభేదించిన సందర్భాలున్నాయి. ఇప్పటికీ ఆమె వైఖరి ఒంటరిగానే నడవాలన్నట్టే కనిపిస్తోంది. ఆమ్ఆద్మీ పార్టీ, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ మధ్య ఓ సామ్యం ఉంది. తమకు కాలు మోపడానికి సూదిమొనంత సందు లేకపోయినా ఇతర రాష్ట్రాలలో కూడా తమ అభ్యర్థులను పోటీకి పెడ్తుంటారు. కలిసొచ్చిన చోట ఒకటో రెండో సీట్లు దక్కాయి కూడా. కానీ తాము బలంగా ఉన్న చోట ఇతర పార్టీలతో ఎలాంటి సంబంధాలు ఉండవు అన్న ధోరణిలోనే ఉంటాయి.

"ఇండియా" ఐక్య సంఘటనకు అంతర్నిహితంగా చాలా బలహీనతలు ఉన్నాయి. దాదాపు రెండేళ్ల కింద ఏర్పడిన ఈ ఐక్య సంఘటనకు ఓ సమన్వయ కర్త లేరు. సంస్థాగత స్వరూపమూ లేదు. కాంగ్రెస్‌కు తిరుగు లేని నాయకుడు రాహుల్ గాంధీ అనడంలో సందేహమే లేదు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకు రావడానికి, బీజేపీని సైద్ధాంతికంగా ఎదుర్కోవడానికి రాహుల్ పాటుబడ్తున్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడి పాత్రను ఎన్నదగిన రీతిలోనే నిర్వహిస్తున్నారు. వ్యక్తిగతంగా ఆయన మీద గౌరవం కూడా పెరిగింది. ఇప్పుడు ఆయనను రాజకీయాలలో ఆరో వేలుగా ఎవరూ ఎద్దేవా చేయడం లేదు. ఇటీవల వయనాడ్ నుంచి ఎన్నికైన ప్రియాంకా గాంధీ వక్తగా రాహుల్ కన్నా మెరుగు అని నిరూపించుకున్నారు. మాటకు మాట సమాధానం ఇవ్వగల శక్తి ఆమెకు ఉంది. "ఇండియా" ఐక్యసంఘటనను నడుపుతున్న తీరే అయోమయంగా ఉంది. ఇప్పటి వరకు మూడే మూడు సమావేశాలు జరిగాయి. ఆఖరి సమావేశం లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించడానికి మూడు రోజుల ముందు జూన్ ఒకటిన దిల్లీలో జరిగింది. ఆ తరవాత శాసనసభ ఎన్నికలు కొన్ని చోట్ల జరిగాయి. హర్యానాలో గెలిచి తీరుతుందనుకున్న కాంగ్రెస్ బోర్లా పడింది. అంతకు ముందు మధ్యప్రదేశ్ లో సమాజ్ వాదీకి కనీస సీట్లైనా కేటాయించడానికి కాంగ్రెస్ సిద్ధపడకపోవడంతో ఐక్యత దెబ్బ తిన్నది. మొన్నటికి మొన్న మహారాష్ట్రలో బీజేపీ నాయకత్వంలోని మహాయుతి మీద ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత ఉంది కనక ప్రతిపక్ష మహా వికాస్ అగాధీకి గెలిచే అవకాశాలున్నాయన్న ఊహాగానాలు గాలిలో కలిసి పోయాయి. ఎన్నిలుకలుకలున్నా మహాయుతి ఇదివరకెన్నడూ లేని స్థాయిలో విజయం సాధించింది. వారం రోజులుగా పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయి. పార్లమెంటు వేదిక మీద అనుసరించే వ్యూహాన్ని ఖరారు చేయడానికి ప్రతిపక్షాల సమావేశమైతే జరిగింది. కానీ కాంగ్రెస్ సూచించిన మార్గాన్ని అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ మెచ్చలేదు. అందువల్ల పార్లమెంటులో ఆ పార్టీలు నిరసన మార్గానికి దూరంగా ఉన్నాయి. పార్లమెంటుకు చాలా అరుదుగా వచ్చే ప్రధానమంత్రి మోదీ ఈ సమావేశాల్లో కాస్త ఎక్కువగానే కనిపిస్తున్నారు. వచ్చినప్పుడల్లా రాహుల్ మీద విమర్శనాస్త్రాలు ఘాటుగానే సంధిస్తున్నారు. ఈ స్థితిలో ప్రతిపక్షాలు ఐక్యంగా వ్యవహరిస్తే అధికార పక్షాన్ని నిలదీయడానికి అవకాశం ఉండేది. ఆ ఐక్యత మచ్చుకైనా కనిపించడం లేదు. "ఇండియా" ఐక్య సంఘటన ఏర్పడడంతో ప్రజలకు చిన్నపాటి ప్రత్యామ్నాయం కనిపించింది. అందుకే ఈ సారి 400 కన్నా ఎక్కువ సీట్లు సాధిస్తామని బీరాలు పలికిన బీజేపీ 240 సీట్ల దగ్గర చతికిల పడిపోవలసి వచ్చింది. ఇది కచ్చితంగా ప్రతిపక్ష ఐక్యత ఫలితమే. ఈ ఐక్యతను కొనసాగించడానికి "ఇండియా"ఐక్య సంఘటనలో ఏ ప్రయత్నమూ కనిపించడం లేదు. అన్నింటికన్నా మించి మోదీ వ్యతిరేకత మినహా తమ చూపే సైద్ధాంతిక ప్రత్యామ్నాయం ఏమిటో చెప్పే నాథుడే లేడు. రాహుల్ లాంటి నేతల ప్రయత్నాలు ఎంత ఎన్నదగినవి అయినా అవి సంఘటిత ప్రతిపక్షానికి సంకేతం కాదు.

తీరని నాటో యుద్ధ దాహం

చిన్నా

ఏ ఉద్దేశంతో చివరి ఉక్రెయిన్ పౌరుని ప్రాణం కోసం రష్యాతో పశ్చిమ దేశాలు ధైర్యంగా యుద్ధం చేయిస్తున్నాయి? ఉక్రెయిన్‌పై సుదీర్ఘ కాలం పాటు యుద్ధం చేయడంద్వారా రష్యాను అన్ని రంగాలలో నిర్వీర్యం చేయటానికి నాటో దేశాలు కంకణాలు కట్టుకొన్నాయి.

రష్యాతో నాటో దేశాలు సుమారు 3 సంవత్సరాల నుంచి దౌత్య సంబంధాల్ని తెగతెంపులు చేసుకొన్నాయి. ఉక్రెయిన్ యుద్ధ భూమిలో వేలాది మంది సైనికులు మరణిస్తున్నప్పటికీ నాటో దేశాలు దౌత్య ద్వారాలు తెరవటం లేదు. దౌత్య సంబంధాలతో హింసలు తగ్గుతాయి, తీవ్రతరం గాకుండా నిరోధించగలవు. తద్వారా శాంతి మార్గాలు వెతకవచ్చు. కానీ దీనికి భిన్నంగా పశ్చిమ దేశాల నేతలు, మీడియా ప్రతినిధులు మాత్రం దౌత్యం లేకపోవటమే నైతికబలంగా ప్రచారం చేసుకొంటున్నారు. వారి వారి ప్రకటనలు, మాటల్ని బట్టి యుద్ధాన్ని ధర్మ యుద్ధంగా చిత్రీకరిస్తున్నారు. సుదీర్ఘ కాలంపాటు యుద్ధాన్ని నెరిపించి రష్యన్లు ఉక్రెయిన్లను ఒకరికొకరు చంపుకునేలా చూడటమే పశ్చిమ దేశాల లక్ష్యంగా ఉంది. అమెరికా ప్రత్యర్థి అయిన రష్యాను బలహీనపర్చటమే తమ ధ్యేయమని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ అస్టీన్ ఇప్పటికే అనేకసార్లు ప్రకటించాడు. ఉక్రెయిన్‌పై జరుపుతున్న యుద్ధ తీరును భవిష్యత్తులో మరెక్కడ చేయలేని బలహీన స్థితికి రష్యా చేరుకోవటం వారి ప్రధాన లక్ష్యం. అసలు కొన్ని పశ్చిమ దేశాలు ఈ యుద్ధాన్ని ఏమీ పట్టించుకోకుండా రష్యా, ఉక్రెయిన్‌లు రెండు దేశాలు సర్వ నాశనం కావాలని కోరుకొంటున్నారు

యుద్ధ ప్రారంభంలో శాంతి ఒప్పందాలకు ఉక్రెయిన్– రష్యాలు అంగీకరించాయని టర్కీ, ఇజ్రాయిల్ తెలిపాయి. రష్యా యుద్ధం విరమిస్తే, ఉక్రెయిన్ తటస్థ దేశంగా నాటో సభ్యత్వాన్ని కోరదనేది సారాంశం. అయితే పశ్చిమ దేశాలు ఈ ఒప్పందాన్ని ఉక్రెయిన్‌చే తిరస్కరింపజేశాయి. అప్పుడు యు.కె. ప్రధాని జాన్సన్ ఆఘమేఘాలపై కీవ్ వెళ్లి ఉక్రెయిన్ ఆధ్యక్షుడు జెలెన్‌స్కీని ఒప్పందానికి దూరంగా ఉండాలని ఒప్పించాడు. 9 సంవత్సరాల క్రితం జరిగిన మిన్స్క్ ఒప్పందాన్ని పశ్చిమ దేశాలు ఎప్పుడూ గౌరవించలేదు. ఉక్రెయిన్ మిలిటరీ పరంగా బలం పుంజుకోటానికే మిన్స్క్ ఒప్పంద ఎరవేశామని సాక్షాత్తు ఒకప్పటి జర్మనీ ఛాన్సలర్ మెర్కల్ ప్రకటించింది కూడా. జర్మనీతో పాటుగా ఫ్రాన్స్ కూడా మిన్స్క్ ఒప్పందానికి కట్టుబడిలేమని ఒప్పుకొంది. నాటో దేశాలు యుద్ధానికే మొగ్గు చూపాయని టర్కీ విదేశాంగ మంత్రి, ఇజ్రాయిల్ మాజీ ప్రధాని కూడా తెలియజేశారు. రష్యాను ఆర్థికంగా, సైనికంగా బలహీనపర్చేందుకు అమెరికా, యు.కె.లు, పన్నాగం పన్ని శాంతి చర్చలకు ఎప్పుడూ మద్దతునివ్వలేదు. లిండేగ్రహం వంటి అమెరికా కాంగ్రెస్ సభ్యుడు "చివరి ఉక్రేనియన్" వరకూ రష్యాతో పోరాటానికి బహిరంగ మద్దతు ఉంటుందని, అమెరికా ప్రాణాలను పణంగా

పెట్టకుండా ఉక్రెయిన్‌కు ఆయుధ సహాయం చేయటం అమెరికా 'తెలివైన పెట్టుబడి' అని అన్నారు. యుద్ధానికి ఆర్థిక సహాయం చేయటమంటే, అమెరికా జాతీయ భద్రతకు 'పెట్టుబడి' గా పేర్కొన్నాడు. ఒకసారి రష్యా బలహీనపడిన తర్వాత ఉక్రెయిన్‌లో రష్యాకు పశ్చిమాన శక్తిమంతమైన నాటో మిలిటరీ స్థావరాలు ఏర్పరచటమేనని అమెరికాలో యుద్ధ నిపుణుల విశ్లేషణ.అటుపిమ్మట రష్యాసంపదను కొల్లగొట్టి ముక్కలు ముక్కలు చేయటమే వారి ధ్యేయం.

యుద్ధాల ద్వారా ప్రపంచ ఆయుధ అమ్మకాలు పెరిగాయి. 2022 సంవత్సరంలో ఉక్రెయిన్‌యుద్ధం,గాజాపై ఇజ్రాయిల్ మారణకాండ జరగని సమయాని స్తబ్దతగా ఉన్న ఆయుధ అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయని సీప్రీ (స్టాక్‌హోల్మ్ పీస్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్) రెండు రోజుల క్రితం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. 4.2శాతం పెరిగా అంతకు క్రితం సంవత్సరం కంటే ఎక్కువ అమ్మకాలు జరిగాయి. తాజాగా 2024 నాటికి వివరాలు తెలియవల్సి ఉంది(అమ్మకాలు 50శాతం కంటే ఎక్కువ పెరుగుతాయని అంచనా). ఈ మొత్తం ఆయుధఅమ్మకాల్లో అమెరికా కంపెనీలు సింహభాగం అమ్మకాలను నెరిపాయి. 31,700 కోట్ల డాలర్లు (సగం అమ్మకాలకంటే ఎక్కువ) అమెరికా కంపెనీలు అమ్మాయి. అమెరికా కంపెనీల్లో లోక్‌హీట్ మార్టీన్, ఆర్‌టిఎక్స్(ఇదివరకటి రైతోన్ టెక్నాలజీస్), నార్త్ రోప్ గ్రుమ్మన్, బోయింగ్, జనరల్ డైనమిక్ ప్రధానమైనది. 10 అగ్రభాగ అమ్మకాల కంపెనీల్లో మొదటి 6 కంపెనీలు అమెరికావి కావడం విశేషం. యుద్ధాలు విరమించి శాంతి ఒడంబడికలుజరిగితే ఈ కంపెనీలు మూసివేసి అధిక లాభార్జనలకు దూరంగాఉండాలి. అందుకోసం ప్రతి నిత్యం పపంచంలో యుద్ధాలు, కలహాలకోసం అమెరికా ప్రధానపాత్ర పోషిస్తుంది. పుతిన్‌ను యుద్ధ నేరస్థుడుగా ముద్రవేసి 'దౌత్యం' అనే భావనను ఈ.యూ. నాయకులు జోసెఫ్‌బోరెల్, కాజోం కల్లాసులు కొట్టి పారేశారు. ఈయూ దేశమైన హంగరీ ప్రెసిడెంట్ విక్టర్ ఓర్బన్ దౌత్యానికి ప్రయత్నిస్తే ఈయూ దేశాలు వ్యతిరేకించాయి. ప్రస్తుతం యుద్ధం ముదురుతూ మరణాల సంఖ్య ఉక్రెయిన్‌లో పెరుగుతూ ఉన్నాయి. ఉక్రెయిన్‌లో ఏ ప్రాంత ప్రజలు కూడా నిరంతర యుద్ధానికి మద్ధతు పలకటం లేదు. ఒకప్పుడు ఉక్రెయిన్ నాయకులు వారి విజయంపై ఉన్న ఆశాజనకాన్ని నేడు క్రమేపీ వదులుకొంటున్నారు. తాజా సర్వేల్లో ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్స్కీపై భ్రమల్ని వదులుకుంటున్నారు. ఉక్రెయిన్ ఫ్రంట్‌లైన్లు కుప్పకూలిపోతున్నాయి. నాటో భౌగోళిక విస్తరణకు ఉక్రెయిన్ భారీ మూల్యం చెల్లిస్తున్నది. సంఘర్షణ ఎంత ఎక్కువకాలం కొనసాగే కొద్దీ ఉక్రెయిన్ ప్రజలు మరిన్ని ప్రాణ నష్టాలతో, ఆర్థిక నష్టాలతో అంత ఎక్కువ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుంది. ఈ స్పష్టతతో పశ్చిమ దేశాల వ్యూహం భవిష్యత్తులో విఫలమవుతుంది. రష్యాపై ఉక్రెయిన్ శత్రు వైఖరిని విడిచిపెట్టినప్పుడు మాత్రమే యుద్ధం ముగుస్తుంది.

రష్యాతో నాటో దేశాలు సుమారు 3 సంవత్సరాల నుంచి దౌత్య సంబంధాల్ని తెగతెంపులు చేసుకొన్నాయి. ఉక్రెయిన్ యుద్ధ భూమిలో వేలాది మంది సైనికులు మరణిస్తున్నప్పటికీ నాటో దేశాలు దౌత్య ద్వారాలు తెరవటం లేదు. దౌత్య సంబంధాలతో హింసలు తగ్గుతాయి, తీవ్రతరం గాకుండా నిరోధించగలవు. తద్వారా శాంతి మార్గాలు వెతకవచ్చు.

పెద్దల కోసం పిల్లల కవిత్వం

కవి చేసే అంతర్, బహిర్ ప్రయాణమే అతని కవిత్వం. మూడు సంపుటాలతో ఇప్పటికే మంచి కవిగా ముద్ర వేయించుకున్న వసీరా తన నాలుగో సంపుటితో ఆ ముద్రను శాశ్వతం చేసుకున్నాడు. ఏ వయసుకా ముచ్చట అంటారు కదా... అలా ఉంటుంది వసీరా కవిత్వం. ఈ ఆరు పదుల వయసులో తాతయ్యాడు. తన మనవడు, మనవరాలికే కాదు తనలాంటి ఎంతో మంది తాతలకి ఆనాటి ఏనుగమ్మ... ఏనుగు పద్యాన్ని మరోసారి గుర్తు చేశాడు. ఇదిగో ఇప్పుడు ఆ సమస్త ప్రపంచంలోని మనవలు, మనవరాళ్లను తన వెనుక ఎక్కించుకుని ఏనుగాట ఆడుకుంటున్నాడు ఈ లోకంతో. నూనూగు మీసాల నూత్న యవ్వనంలో ఎదురైన అనుభవాలు, ప్రపంచ పరిణామాలు, రావిచెట్టు, పార్కులో జారుడు బల్ల, ఆవుతోక వంటివి వసీరా కవిత్వ వస్తువులయ్యాయి. అది లోహనదిగా ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ప్రవహించింది. అందులోనే మళ్లీ తాను విశ్వసించే రాజకీయాలను కూడా కవిత్వంగా మలిచాడు. ప్రజాస్వామ్యం అపహాస్యం కావడంపై ఆగ్రహించాడు. ఈ మిక్సిడ్ డబుల్ యాక్షన్‌కి అనాటి విమర్శకులు అచ్చెరువొందారు. తెలుగు కవిత్వంలో ఉన్న అన్ని వర్గాల వారు లోలోపల వసీరాని తమ వర్గం వాడే అని సంబర పడ్డారు. నిజానికి వసీరా ఏ వర్గం వాడు కాదు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని కవిత్వీకరించినట్లుగానే తనకు తారసపడిన సాదాసీదా అంశాలను కూడా అంతే సాదాసీదా భాషలో కవిత్వీకరించాడు.

కవిగా వసీరాకి ఏది వస్తువో ఎంత తెలుసో... దాన్ని ఎలా చెప్తే రక్తి కడుతుందో కూడా మాబాగా తెలుసు. బహుశా విప్లవాన్నీ కాంక్షిస్తూ రాసిన పద్యాలకి మురిసిన వీవీ, శివారెడ్డి వంటి కవులు వసీరా మృదు

చక్రవాకం

\- ముక్కాము చక్రధర్

కవిత్వానికి కూడా అంతే ఆనందించారు. శివసాగర్ తర్వాత ఇలా ప్రకృతిని, ఓ ఆకాంక్షని ఏక కాలంలో పలికించిన కవులు చాలా తక్కువ మందే ఉన్నారు. వారిలో వసీరా ఒకరు. తన మూడో సంపుటి సెల్ఫీలో అయితే తన విప్లవ కాంక్ష, ప్రకృతి మీద ప్రేమలకు తోడుగా ఆధ్యాత్మిక కవిగా కూడా తనని తాను నిరూపించుకున్నాడు. ఇంతకు ముందు అన్నట్లు ఆ వయసుకు ఆ ముచ్చట అది.

"ఎన్ని సామాజిక సిద్ధాంతాలున్నప్పటికీ మనిషి సమాజంలో తప్పిపోయి, సమాజాలు గ్లోబల్ సంతల్లో తప్పిపోయి, రాజకీయ వ్యవస్థలు వ్యాపారాల్లో తప్పిపోయి, వ్యాపారాలు యుద్ధాల్లో తప్పిపోయి, అంధ యుగాల మనిషే ఇప్పుడు రాజ్యమై నోట్లో అణ్వస్త్రం, కడుపులో కంప్యూటర్, ఛాతీలో చచ్చిన సముద్రం, ఓ చేత్తో శాటిలైట్, ఇంకో చేత్తో రిమోట్ పట్టుకుని, వళ్లంతా పేటెంట్ బ్రాండ్ ముద్రలతో దేని కోసం వెతుకుతున్నాడో తెలుసుకోవడానికి రాసానా...?" అని వసీరా ప్రశ్నిస్తున్నాడు. వీటన్నిటి గురించి మాట్లాడుతున్నాడంటే మనిషి కోసమే, మంచి జీవిక కోసమే రాసాడని పాఠకుడికి వేరే చెప్పాలా...! ఇంతకు ముందు అనుకున్నట్లు కవి చేసే అంతర్ ప్రయాణమే ఈ వేదనంతా. అదే వసీరా కవిత్వం. మనిషి డీ హ్యూమనైజ్ కావడం దశాబ్దాల క్రితమే అనుభవించి పలకరించిన వసీరా ఇప్పుడు మళ్లీ ఈ పొత్తం తెరవగానే దాని వెర్షన్ మార్చేశాడు. దానికే డీహ్యూమనైజేషన్ బ్రాండ్ ఎఐ (వర్షన్ 2024) అని నామకరణం చేసి ఏనుగు ఎక్కుదాం అనుకున్న మనల్ని అది ఎక్కే ముందు సమాజం ఇలా ఉందిరా బాబూ అని చెప్తున్నాడు.

" ఓ గులాబీ పువ్వు పట్టుకుని తిరుగుతున్నాను/ దీన్ని ఓ హత్యా స్థలంలో ఉంచాలి/ అక్కడ దొర్లి దొర్లి పొగిలి ఏడవాలి/ నా కన్నీటితో రక్తంతో తడిసిన ఆ నేలలో నన్ను పాతుకోవాలి" ఇలా ప్రారంభించిన కవితని "ఏమైనా నన్ను చోరీ చేసింది నిజం/ హత్య జరిగింది నిజం/ స్థలమే గుర్తు లేదు.. ఈ గులాబీ పట్టుకుని తిరుగుతున్నాను/ దీన్ని ఇక్కడుంచి ప్రార్థించాలి! ఏడవాలి!/ నా కన్నీటితో రక్తంతో తడిసిన ఆ నేలలో నన్ను పాతుకోవాలి" అంటూనే "భూమిని పెళ్లగించుకుని/ రిక్టర్ స్కేళ్లను విరిచేస్తూ/ భూగర్భ నేత్రమై విస్ఫోటిస్తూ/ లావా నదులు విదిలిస్తూ నేను లేవాల్లేవాలి" అంటూ పద్యాన్ని ముగిస్తాడు కానీ పాఠకుడిలో ఓ అలజడికి ఆజ్యం పోస్తాడు. "ఏ సాహిత్య ప్రక్రియ అయినా కానివ్వండి నిన్ను అది ఏదో రూపంలో డిస్టర్బ్ చేయాలి" అంటాడు ఓ.వీ. విజయన్. ఈ వసీరా కూడా తన సృజనతో అ పనే చేస్తున్నాడు. వసీరాకి తన కాన్వాస్ చాలా పెద్దదిగా ఉండాలి. తాను చెప్పదలచుకున్న అంశాన్ని పైపైన తరచి, మునివేళ్లతో ముట్టుకుని, కుక్కర్ విజిల్స్ వచ్చిన తర్వాత దింపేసే వంట వంటిది కాదు. అందుకే లోహనది నుంచి నేటి ఏనుగమ్మ ఏనుగు వరకూ చాలా పద్యాలు పెద్దగానే ఉంటాయి. ఇంచుమించు ఓ కావ్యం వంటి కాన్వాస్ కావాలి. ఇలాంటి పద్యాలు రాయడం చాలా కష్టం. ఇది రాసే క్రమంలో కవి ఎక్కడో దారి తప్పుతాడు. ఎక్కడెక్కడికి వెళ్లిపోతాడు. అలా వెళ్తున్నాననే ధ్యాస కూడా ఉండదు. అదిగో అప్పుడే ఓ నియంత్రణ అవసరం అవుతుంది. ఇది రావాలంటే అభ్యాసం ఒక్కటే మార్గం. అది వసీరాకి పుష్కలంగా ఉంది. వసీరా విషయంలో అభ్యాసం కూసు విద్య కాదు.... పేజీల కొద్దీ వివరించే విద్య.

(ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో వసీరా కవిత్వ సంపుటి ఏనుగమ్మ... ఏనుగు ఆవిష్కరణ)

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

బూసన్ చర్చలు విఫలం

టి.వి.సుబ్బయ్య

కాలుష్యం కలిగించే వాటిలో ప్లాస్టిక్ మానవాళికి అత్యంత ప్రమాదం కలిగిస్తుంది. కాలుష్యం తగ్గించి ఆరోగ్యం కల్పించడానికి 1972లో జరిగిన ధరిత్రి పరిరక్షణ ప్రపంచస్థాయి సదస్సు జరిగింది. ఇప్పటికీ 29సదస్సులు (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) జరిగినా ఏ దేశాల లక్ష్యాలు నెరవేర్చలేదు. అలాగే ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో దక్షిణకొరియా నగరంలో బుసాన్‌లో జరిగిన ఐదవ ప్లాస్టిక్ సదస్సులో ఎలాంటి ఒప్పందం జరగకుండా ముగిసింది. గతంలో నాలుగు సదస్సులు జరిగాయి. అయినప్పటికీ ప్లాస్టిక్ ఉత్పత్తి తగ్గకపోగా మరింతగా పెరిగింది. చర్చలు గడచిన ఆదివారం ముగిశాయి. వివిధ దేశాలమధ్య విభేదాలు పరిష్కారం కాలేదు. సౌదీ అరేబియా నాయకత్వంలో చమురు ఉత్పత్తి సంపన్నదేశాలు మాత్రం ప్లాస్టిక్ ఉత్పత్తి తగ్గింపు ఒప్పందానికి అంగీకరించలేదు. చాలా దేశాలు ఒప్పందానికి అంగీకరించినా ముఖ్యంగా సంపన్నదేశాలు అంగీకరించలేదు. మొత్తం 175 దేశాల ప్రతినిధులు పాల్గొన్నాయి. గత రెండేళ్లుగా ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నా ఒప్పందం కుదరలేదు. ప్లాస్టిక్ పెద్ద వ్యాపారమైంది. 2024 నాటికి అంతర్జాతీయంగా కట్టుబడిన ఒప్పందం జరగాలని తీర్మానించినప్పటికీ బుసాన్ సదస్సులోనూ ఒప్పందం కుదరలేదంటే సంపన్నదేశాలు ఒప్పందానికి అంగీకరించలేదు.

దక్షిణ కొరియా నగరం బుసాన్‌లో ప్లాస్టిక్ ఉత్పత్తి, వినియోగం ఒప్పందం కోసం ప్రపంచ స్థాయిలో సదస్సు జరిగింది. ఇంతవరకు నాలుగు సదస్సులు జరగగా, తాజాగా 5వ సదస్సు జరిగింది. పాలిమర్ల తయారీలో విష రసాయనాలు కలుస్తున్నాయి. ఉత్పత్తి తగ్గితే విషరసాయనాల ప్రమాదం తగ్గుతుంది. ఈ ప్రమాదం తగ్గితే అనేక తీవ్రమైన వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. విషతుల్యమైన కాలుష్యం

కొంతైనా తగ్గుతుంది. ప్రపంచంలో ప్లాస్టిక్‌లేని ప్రాంతంలేదు. నదులు, సముద్రాలు, పట్టణాలు, నగరాలు, గ్రామాలు, పొలాలు, కాలువలు తదితర అనేకచోట్ల ప్లాస్టిక్ ముక్కలు, గాలి రేణువులు నిండి ఉన్నాయి. అయితే సంపన్న దేశాలలో ప్లాస్టిక్ ఉత్పత్తి, వినియోగం ఎక్కువ. వీటికి ప్రత్యామ్నాయాలు ఉన్నప్పటికీ పాలకులు వాటిపై శ్రద్ధచూపడంలేదు. కలుషిత చెత్త చెదారం తగ్గించకపోగా, దేశ అత్యున్నతస్థాయి పాలకులు వీధులూడ్చే చీపురు పట్టుకుని పత్రికల్లో ఫొటోలు వేయించుకోవడానికే పరిమితం కావడం ఇండియాలో మనం చూస్తున్నాము. ప్లాస్టిక్ రహిత సమాజ లక్ష్యం సాధించడం కోసం సంపన్న దేశాలు అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు ఆర్థిక సహాయం అందించేందుకు నిధులను సమీకరించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం ఉత్పత్తికోసం సమీకరించిన నిధులు అందించాలని ఇండియా ఆఫ్రికా, లాటిన్, కరేబియన్ గ్రూపునకు చెందిన దాదాపు వంద దేశాలు ప్రతిపాదించాయి. 2025లో ఉత్పత్తి ఆధారంగా 2040నాటికి 40శాతానికి ఉత్పత్తిని తగ్గించాలని ద్వీపకల్ప దేశాలు ప్రతిపాదించాయి. ఉత్పత్తి తగ్గింపు పారదర్శకంగా ఉండాలని కెన్యా ప్రతిపాదించింది.

అధిక ఆదాయాలు పొందే దేశాలు, తక్కువ ఆదాయాలున్న దేశాలకు ప్లాస్టిక్ చెత్తను ఎగుమతి చేయడం చెత్త వలసవాదం అని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇండియా సైతం దిగుమతి చేసుకుంటోందని వాతావరణం కార్యకర్తలు విమర్శిస్తున్నారు. దక్షిణప్రాంత దేశాలకు ప్లాస్టిక్ చెత్తను ఉత్తర ప్రాంత దేశాలు ఎగుమతి చేయడం దారుణమైన విషయం. 200 శిలాజ ఇంధనాలు, కెమికల్ పరిశ్రమల లాబీయిస్టులు ప్రభావితం చేసేందుకు సదస్సులో పాల్గొనేందుకు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీలుకాలేదు. అయితే డౌ, ఎక్సాన్ మొబైల్ పరిశ్రమలు మాత్రం పాల్గొన్నాయి. సదస్సు చివరి దశలో సమగ్ర ఒప్పందం కావాలనుకున్న దేశాలకు అలాగే రానున్న సదస్సులో ఒప్పందం కుదుర్చుకోవచ్చునన్న దేశాలలో తీవ్ర విభేదాలు ఏర్పడ్డాయి. శిలాజ ఇంధనాలకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్న దేశాలు ప్లాస్టిక్ తగ్గింపుపై పెద్దగా ఆసక్తి చూపించడంలేదు. ప్రపంచ సముద్రాలలో సంవత్సరానికి దాదాపు 10 మిలియన్‌టన్నుల ప్లాస్టిక్ ముక్కలు చేరుతున్నాయి. ఇవన్నీ సముద్రం లోపలికిచేరి అట్టకట్టుకుపోతున్నాయి. అలాగే సముద్రతీర జీవ వైవిధ్యం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. రానున్నకాలంలో ప్లాస్టిక్ ఉత్పత్తి ఇప్పటికంటే మూడురెట్లు పెరుగుతుందని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు. ధరిత్రిపైన కర్బనపు కాలుష్యాలు 2050నాటికి విపరీతంగా పెరగవచ్చునని కూడా ఒక అధ్యయనం తెలియజేస్తుంది. 2050నాటికి ప్లాస్టిక్ ఉత్పత్తి దాదాపుగా మూడురెట్లు పెరుగుతుందని అధ్యయనం తెలియజేస్తుంది. ఒప్పందం కుదరకపోయినప్పటికీ అనేక కీలక సమస్యలను సదస్సు గుర్తించింది. తరువాత జరగబోయే సదస్సులో ఒప్పందం చేసుకోవడానికి ఇప్పటి చర్చలను వచ్చే సంవత్సరానికి వాయిదా వేయాలని ఈక్వెడేరియన్ దౌత్యవేత్త లూయిస్ వయాస్ ప్రతిపాదించారు. ఐరోపా యూనియన్‌తో సహా 100 ఇతర దేశాలు గత గురువారం ఒప్పందం చేసుకోవాలని పనామా ప్రతిపాదించిన అంశానికి అంగీకరించాయి. సుస్థిరస్థాయిలో ప్లాస్టిక్ ఉత్పత్తిని తగ్గించాలని చర్చలలో చాలా దేశాలు కోరాయి.

గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్న సాదా చర్చలు జాప్యం జరుగుతుందని అనేక దేశాలు విమర్శించాయి. ఈ చర్చల్లో ఇరాన్, రష్యాలు పాల్గొన్నాయి. ఒప్పందం కుదరకపోవడానికి వాణిజ్యంపై దృష్టిపెట్టిన దేశాలు ఆటంకం కలిగిస్తున్నాయి. సదస్సు జరిగినప్పటికీ, ఇది విజయం కావడం కష్టమేనన్న సంకేతాలు వెలువడ్డాయి. ఎక్కువ ప్లాస్టిక్ ఉత్పత్తిచేసి ఉపయోగించే దేశాలు చైనా, అమెరికాలు, ఇండియాసైతం ఎక్కువ ప్లాస్టిక్‌ను ఉపయోగిస్తోంది. వీటో అధికారాలున్న దేశాలు ఒప్పందానికి సుముఖంగా లేవన్న సంకేతాలున్నాయి. భవిష్యత్‌లోనైనా చర్చలకు ప్రోత్సహించాలని సెంటర్‌ఫర్ ఇంటర్నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ చట్టం ఎన్‌జీఓ కోరింది. కొన్ని వస్తువులపై నిషేధం విధించి ఒప్పందం కుదుర్చుకోవాలని కొన్ని దేశాలు, ఒప్పందంపూర్తిగా వద్దని 95దేశాలు తిరస్కరించాయి. చట్టబద్ధమైన ఒప్పందాన్ని అసలు అంగీకరించే పరిస్థితులు కనిపించలేదు. ప్లాస్టిక్ ఉత్పత్తి పెంపొందించాలని అమెరికాలో ఉత్పత్తి పరిశ్రమల్లో అతిపెద్దదైన అమెరికన్ కెమిస్ట్రీ కౌల్ కోరింది. విధానాలు మార్చుకోకపోతే ప్రజలు ఉపయోగించే ప్లాస్టిక్‌లో 2040నాటికి 70శాతం పెరగవచ్చునని అంచనా వేస్తున్నారు.

మనం రోజువారీ వినియోగించే ప్లాక్ కవర్లు, అనేక రకాలున్నాయి. పాలప్యాకెట్లు, నీళ్ల, శీతలపానీయాల బాటిళ్లు నీరు నిల్వ చేసుకునే టిన్నులు, ఆహారపదార్థాలు పార్సిల్ చేసేకవర్లు, ఇళ్లలో వాడే ప్లాస్టిక్ వస్తువులు, పిల్లలుతినే వస్తువులను పాక్ చేసేవి, చెప్పులు,ఆహారం తీసుకువెళ్లే బాక్సులు తదితర అనేక పదుల వస్తువులు మానవాళి ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి. కాఫీ, టీ లుతాగే కప్పులు ప్లాస్టిక్‌వే. కనీసం వీటినైనా ఉత్పత్తిని నిషేధించి ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించడం చాలా తేలిక. పాలకులకు, ప్రజల ఆరోగ్యంపట్ల శ్రద్ధలేకపోవడమే ఎన్నో అనర్థాలకు కారణం.

మంత్రులకు శాఖలు కేటాయించిన సోరెన్

రాంచీ : జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ శుక్రవారం కొత్త మంత్రులకు శాఖలను కేటాయించారు. ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం, హోం (జైలుతో సహా), క్యాబినెట్ సెక్రటేరియట్, అనేక ఇతర శాఖలను ఆయన తన వద్దే ఉంచుకున్నారు. జేఎంఎంకు చెందిన చమ్ర లిండాకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖను, కాంగ్రెస్ ఎమ్మెల్యే రాధాకృష్ణ కిశోర్‌కు ఆర్థిక శాఖ, ఆర్‌జేడీకి చెందిన సంజయ్ ప్రసాద్ యాదవ్‌కు కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ, కాంగ్రెస్‌కు చెందిన ఇర్ఫాన్ అన్సారీకి ఆరోగ్యం, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖ కేటాయించారు. ఇక సిబ్బంది, పరిపాలనా సంస్కరణలు, అధికార భాష, రోడ్ల నిర్మాణం, భవనాల నిర్మాణం, ఇంకా ఎవరికీ పంపిణీ చేయని శాఖలను కూడా ముఖ్యమంత్రి తన వద్దే ఉంచుకున్నారు. హేమంత్ సోరెన్ ప్రభుత్వంలో మొత్తం 11 మంది ఎమ్మెల్యేలు గురువారం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. నవంబరు 28న సోరెన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే.

కొడనాడు హత్య కేసు విచారణకు మద్రాసు హైకోర్టు అంగీకారం

చెన్నై: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కొడనాడు హత్య, దోపిడీ కేసులో మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి, శశికళ తదితరులను విచారించేందుకు సీబీసీఐడీ పోలీసులకు అనుమతిచ్చింది. వారిద్దరినీ విచారించకుండా ఊటీలోని జిల్లా కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. 2017లో కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడీ కేసుపై తొలుత పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాదాపు ఐదేళ్లపాటు దర్యాప్తు కొనసాగినా ఎలాంటి ఫలితం లేకపోయింది. ప్రభుత్వం మారిన తర్వాత కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించారు. ఈ కేసులో ఇప్పటి వరకు 10 మందిని అరెస్టు చేయగా... సుమారు 100 మందిని విచారించారు. ఈ కేసులో పళనిస్వామి, శశికళను విచారించేందుకు గతంలో దిగువ కోర్టు అనుమతి ఇవ్వలేదు. దీంతో సీబీసీఐడీ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం విచారణకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఎస్టేట్‌లో కనిపించకుండా పోయిన కొన్ని విలువైన వస్తువుల గురించి శశికళ, ఇళవరసిని ప్రశ్నించాలని ఆదేశించింది. అన్నాడీఎంకే నేత జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో 2017లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి కాపలాదారుడు ఓం బహదూర్‌ను హత్య చేసి, వస్తువులు దోచుకెళ్లిన సంగతి తెలిసిందే.

ఢిల్లీలో తెరుచుకున్న పాఠశాలలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఆదేశాలతో దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం నుంచి పాఠశాలలు తెరుచుకున్నాయి. ఢిల్లీలో వాయు కాలుష్యం మెరుగుపడటంతో సుప్రీంకోర్టు కొన్ని సడలింపులు ఇచ్చింది. దీంతో ఇకపై పాఠశాలలు ఫిజికల్ మోడ్‌లో నడుస్తాయని, విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలని ఢిల్లీ ప్రభుత్వ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఢిల్లీలో కాలుష్యం కారణంగా కొంతకాలంగా కఠిన నిబంధనలు అమలు చేశారు. దీంతో ఆన్‌లైన్‌లో పాఠశాలలు నిర్వహించారు. ఇప్పుడు కాలుష్య స్థాయి మెరుగుపడిన తర్వాత నిబంధనలు కొన్ని తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో ఆన్‌లైన్ చదువుల విధానాన్ని రద్దు చేసినట్లు విద్యాశాఖ ప్రకటించింది. పరిమితుల సడలింపు తర్వాత శుక్రవారం నుంచి ఢిల్లీ పాఠశాలల్లో ఫిజికల్ క్లాసులు ప్రారంభమవుతాయని విద్యా శాఖ డైరెక్టరేట్ తెలిపింది. 12వ తరగతి వరకు అన్ని పాఠశాలల్లోని పిల్లలందరికీ ఆన్‌లైన్ తరగతులు ఇకపై నిర్వహించబడవని స్పష్టం చేసింది.

బీపీఎస్‌సీ అభ్యర్థులపై విరిగిన లాఠీ

పాట్నాలో ఆందోళన హింసాత్మకం... గాయపడిన నిరసనకారులు

పాట్నా : బీహార్ రాజధాని పాట్నాలో బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్‌సీ) అభ్యర్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. మూల్యాంకన ప్రక్రియలో పారదర్శకతను డిమాండ్ చేస్తూ అభ్యర్థులు నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. విద్యార్థి నాయకుడు దిలీప్ కుమార్ సహా అనేక మంది గాయపడ్డారు. శుక్రవారం అభ్యర్థులు పాట్నాలోని బీపీఎస్‌సీ కార్యాలయం వెలుపల నిరసనలు చేపట్టారు. బైలీ రోడ్డును కూడా దిగ్బంధించారు. దీంతో పోలీసులు అభ్యర్థులను చెదరగొట్టేందుకు లాఠీఛార్జ్ చేశారు. బీపీఎస్‌సీ పరీక్ష కోసం 'ఒక షిఫ్ట్, ఒక పేపర్' ఫార్మాట్‌ను నిర్వహించాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. అయితే ఈ ఆందోళనా కార్యక్రమం హింసాత్మకంగా మారింది. మూల్యాంకన ప్రక్రియలో పారదర్శకత, న్యాయంగా ఉండాలని కోరుతూ అభ్యర్థులు ఒక ప్రధాన రహదారిని అడ్డుకోవడంతో పోలీసులు జరిపిన లాఠీఛార్జ్‌లో అనేక మంది గాయపడ్డారు. నిరసన గురించి బీహార్ డీఎస్పీ అను కుమారి మాట్లాడుతూ 'వారికి అనుమతి లేనందున నిరసన చట్టవిరుద్ధం. వారి డిమాండ్లను ముందుకు తెచ్చే ఐదుగురి ప్రతినిధి బృందం పేర్లను మేము అడిగాం' అని తెలిపారు.

అభ్యర్థుల డిమాండ్లు ఇవే...

70వ బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్‌సీ) సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను గత సంవత్సరాల్లో జరిగిన విధంగానే నిర్వహించాలని, పరీక్షను సాధారణీకరించాలని డిమాండ్ చేస్తూ నిరసనలో పాల్గొన్న అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై బీపీఎస్‌సీ కార్యదర్శి సత్య ప్రకాశ్ శర్మ స్పందిస్తూ, కమిషన్ సాధారణీకరణ పద్ధతిలో ఫలితాలను విడుదల చేయదని స్పష్టం చేశారు. కమిషన్ ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశంతో ఇలాంటి వదంతులు వ్యాపింపజేస్తున్నారని, మీడియాలో ప్రచారం జరుగుతున్న వాదనలను కూడా ఆయన ప్రస్తావించారు. అంతకుముందు గురువారం, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్... బీపీఎస్‌సీ నిర్వహించిన 70వ కంబైన్డ్ ప్రిలిమినరీ పరీక్ష అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ... బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు లేఖ రాశారు. తక్షణమే పరిష్కరించాల్సిందిగా కోరారు. వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే, అభ్యర్థుల ఆందోళనలను ప్రభుత్వం విస్మరిస్తే తాము వారి పక్షాన నిలబడి కలిసి పోరాడతామని ఆయన సామాజిక మాధ్యమ పోస్ట్‌లో పేర్కొన్నారు.

మణిపూర్ సందర్శించండి

మోదీకి 'ఇండియా' పార్టీల విజ్ఞప్తి

న్యూఢిల్లీ: మణిపూర్‌లోని ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకోవడం, క్రియాశీలంగా వ్యవహరించడం ద్వారా మాత్రమే రాష్ట్రంలో శాంతిని, సాధారణ స్థితి ఏర్పడుతుందని నొక్కి చెబుతూ, హింసాత్మక ఘటనలతో దెబ్బతిన్న రాష్ట్రాన్ని వీలైనంత త్వరగా సందర్శించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ఇండియా ఐక్య సంఘటన విజ్ఞప్తి చేసింది. మణిపూర్ ఇండియా కూటమికి ప్రాతినిధ్యం వహిస్తున్న 10 పార్టీల ప్రతినిధుల బృందం శుక్రవారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసేందుకు తమకు అనుమతి నిరాకరించారని తెలిపారు. 'మేము జంతర్ మంతర్ వద్ద నిరసన ధర్నా నిర్వహించవలసి ఉంది. కానీ అధికారులు మా అభ్యర్థనను తిరస్కరించారు. మా కూటమికి చెందిన దాదాపు 10 రాజకీయ పార్టీలు పాల్గొంటున్నాయి. నిరసన తెలిపే మా హక్కును నిరాకరించడం దురదృష్టకరం. దీని ద్వారా మమ్మల్ని అడ్డుకోలేరు. మా నిరసన వివిధ రూపాల్లో కొనసాగుతుంది' అని కాంగ్రెస్ పార్టీ మణిపూర్ అధ్యక్షుడు కె.మేఘచంద్ర స్పష్టం చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రధాని మోదీకి అందజేశామన్నారు. 'మణిపూర్ కూడా భారతదేశంలో భాగమే. అయితే గత 18 నెలలుగా కేంద్ర ప్రభుత్వం ఎందుకు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది? 60 వేల మందికి పైగా ప్రజలు సహాయక శిబిరాల్లో ఉన్నారు. వందల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకెంత కాలం బాధపడాలి?' అని ఆయన ప్రశ్నించారు. మణిపూర్‌లో శాంతిభద్రతలను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రజలు ప్రధానిని కోరుతున్నారని మణిపూర్ అసెంబ్లీలో ఎమ్మెల్యే అన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నేరుగా కేంద్ర ప్రభుత్వం నియంత్రిస్తోందని, ముఖ్యమంత్రి కాగితపు పులిలా వ్యవహరిస్తున్నారని, ఇది అప్రకటిత రాష్ట్రపతి పాలనలా ఉందని, హోం మంత్రి నేరుగా రాష్ట్రంలో పరిస్థితిని నియంత్రిస్తున్నారని ఆరోపించారు. 'మణిపూర్‌లో ప్రస్తుత సంక్షోభంపై ప్రధాని మాట్లాడలేదు, రాష్ట్రాన్ని సందర్శించలేదు లేదా చర్చలకు ప్రతినిధులను ఆహ్వానించలేదు. అందువల్ల ఇది ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి స్పష్టమైన ఉదాహరణ' అని అన్నారు. మణిపూర్‌కు చెందిన ఇండియా కూటమి పార్టీలు ప్రధానికి రాసిన లేఖలో ఇలా పేర్కొన్నాయి... 'మేము మణిపూర్ ప్రజల తరఫున, ఇండియా ఐక్య సంఘటన మణిపూర్ తరఫున మణిపూర్‌కు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం. 2023 మే 3 నుంచి దాదాపు రెండు సంవత్సరాల కాలంగా రాష్ట్రంలో పరిస్థితులు గందరగోళంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రజలు తమ నిస్సహాయ స్వరాన్ని మీకు వినిపించడానికి రాష్ట్రంలో మీ పర్యటన కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ సంవత్సరం 2024 ముగిసేలోపు మణిపూర్‌ను సందర్శించడానికి మీకు సమయం లేకపోతే, మణిపూర్‌లోని అన్ని రాజకీయ పార్టీలను మీ కార్యాలయంలో లేదా న్యూఢిల్లీలోని మీ అధికారిక నివాసంలో ఆహ్వానించవలసిందిగా మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాం' అని అన్నారు. మణిపూర్‌లోని 10 రాజకీయ పార్టీల కన్వీనర్ క్షేత్రమయుమ్ శాంత విలేకరులతో మాట్లాడుతూ శాంతి, సాధారణ స్థితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేయడానికి వారు 3,000 కి.మీ దూరంలో ఉన్న మణిపూర్ నుంచి వచ్చారని, అయితే నిరసన ధర్నా చేయడానికి అనుమతి నిరాకరించారని విమర్శించారు. 'ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ వైఖరిని మేము ఖండిస్తున్నాం. గత రెండేళ్లుగా ఆయన మణిపూర్‌లో పర్యటించలేదు. అందుకే మణిపూర్‌లో పర్యటించాల్సిందిగా మేము ఆయనను ఆహ్వానించాం' అని తెలిపారు. 'బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వ దుర్వినియోగం కారణంగా మేము ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నాం' అని శాంత చెప్పారు. 'ఈ ప్రభుత్వం ద్వారా విభజనకు గురయ్యాం. ఇది అంతం కావాలని, మళ్లీ ఐక్యంగా ఉండాలని కోరుకుంటున్నాం. మణిపూర్ ఐక్యత, సమగ్రత కోసం నిలబడతాం' అని అన్నారు.

నేను అడిగితేనే షిండే అంగీకరించారు

ఫడ్నవీస్

ముంబై: తాను అడిగితేనే ఉప ముఖ్యమంత్రిగా ఉండేందుకు మాజీ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అంగీకరించారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఫడ్నవీస్ శుక్రవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడించారు. 'ఎన్నికల్లో విజయం తర్వాత జరిగిన మహాయుతి తొలి సమావేశంలో సీఎం అభ్యర్థి బీజేపీ నుంచి ఉండేందుకు ఏక్‌నాథ్ షిండే అంగీకరించారు. అయితే, ప్రభుత్వంలో షిండే భాగం కాకూడదని, మహాయుతి కూటమి సజావుగా సాగేందుకు నేతృత్వం వహిస్తే చాలని శివసేనలోని ఓ వర్గం భావించింది. తమ పార్టీ నుంచి సీఎం కావాలని శివసేన నాయకులు కోరుకున్నారు. వ్యక్తిగతంగా షిండేతో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. ప్రమాణస్వీకారోత్సవానికి రెండు రోజుల ముందే నేను షిండేతో భేటీ అయ్యాను.

అప్పుడే ఆయన ఉప ముఖ్యమంత్రిగా ఉండేందుకు అంగీకరించారు' అని ఫడ్నవీస్ వివరించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 230 స్థానాల్లో మహాయుతి కూటమి విజయం సాధించిన విషయం తెలిసిందే.

'కాల్చివేస్తా... గోహత్య కేసులో ఇరికిస్తా'...

సేల్స్‌మెన్‌కు పోలీసు బెదిరింపు

వీడియో వైరల్

లక్నో: 'కాల్చివేస్తా... గోహత్య కేసులో ఇరికిస్తా'... అంటూ ఓ వ్యక్తిని పోలీస్ కానిస్టేబుల్ బెదిరించి అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పోలీస్‌పై చర్యలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే... గత నెల 22న కైరానా కొత్వాలి ప్రాంతంలోని పెట్రోల్ బంక్ వద్దకు మరో పోలీస్‌తో కలిసి కానిస్టేబుల్ మనీష్ కుమార్ వెళ్లాడు. సేల్స్‌మెన్ అఫ్తాబ్‌పై గతంలో వచ్చిన ఫిర్యాదుపై ప్రశ్నించాడు. అతడిని కానిస్టేబుల్ దూషించాడు. అతడి కాలుపై కాల్పులు జరుపుతానని, గోహత్య కేసులో ఇరికిస్తానని బెదిరించాడు. ఇదంతా ఆ పెట్రోల్ బంక్ సీసీటీవీ కెమెరాలో ఇది రికార్డ్ అయింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో అధికార దుర్వినియోగానికి పాల్పడిన పోలీస్ కానిస్టేబుల్ మనీష్ కుమార్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆయనపై చర్యలు చేపట్టారు. సస్పెండ్ చేయడంతోపాటు అంతర్గతంగా దర్యాప్తు జరుపుతున్నారు.

కలుషిత భోజనం... 100 మంది విద్యార్థుల అస్వస్థత

చంద్రాపూర్ : కలుషిత ఆహారం కారణంగా 100 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతతో ఆస్పత్రి పాలైన ఘటన మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో జరిగింది. సావోలి తహసీల్‌లోని పార్డిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మొత్తం 106 మంది విద్యార్థులు బుధవారం మధ్యాహ్నం పాఠశాలలో భోజనం చేశారు. అయితే వారు ఆ రాత్రి కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారని అధికారి శుక్రవారం తెలిపారు. గురువారం పాఠశాలకు చేరుకున్న తర్వాత కూడా విద్యార్థులకు అవే లక్షణాలు కనిపించడంతో వారిని మొదట గ్రామీణ ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ఆ తరువాత వారిని మెరుగైన వైద్య సౌకర్యాలు ఉన్న ఇతర ఆస్పత్రులకు తరలించారు. ప్రస్తుతం 62 మంది విద్యార్థులు ముల్ తహసిల్‌లోని ఉప జిల్లా ఆసుపత్రిలో ఉన్నారు. 20 మంది గడ్చిరోలి జిల్లా ఆసుపత్రిలో, 17 మంది సావోలీలో, మిగిలిన వారు చంద్రపూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో ఉన్నారు' అని జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ మహదేవ్ చించోల్ తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. ఈ ఆసుపత్రులలో పరిశీలనలో ఉన్నారు. పరిశోధనలో భాగంగా విశ్లేషణ కోసం ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా ఆహార నమూనాలను సేకరించారు' అని ఆయన వివరించారు. ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని స్థానిక ఎమ్మెల్యే సుధీర్ కోరారు.

ప్రసవం తర్వాత ఆరుగురు మహిళల మృతి

ప్రజానిరసనకు ఆరోగ్య మంత్రి పిలుపు

బెంగళూరు: కర్నాటకలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం తర్వాత ఆరుగురు మహిళలు మృతిచెందడంపై ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి పరిణామాలను ప్రజలు సహించరాదని, నిరసనలు తప్పవని అన్నారు. బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందని తెలిపారు. ఇకపై ఎలాంటి మరణాలు సంభవించకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నిర్లక్ష్యం వహించిన వారితోపాటు బాధ్యులపై చర్యలు చేపడతామని మంత్రి స్పష్టం చేశారు. సిజేరియన్ చేసిన అనంతరం వీరంతా చనిపోయారన్నారు. వీరి మరణాలకు ఐవీ ఫ్లూయిడ్స్ కారణమని ల్యాబ్ పరీక్షలో తేలిందన్నారు. దీంతో వాటిని సరఫరా చేసిన బెంగాల్ ఫార్మా కంపెనీపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై ప్రజలు నిరసన తెలపాలని అన్నారు. వివరాల్లోకి వెళితే... బళ్లారిలోని విజయనగర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో డెలివరీ కోసం సుమయ అనే మహిళ (25) గత నెల 10న అడ్మిట్ అయింది. 12న ఆమెకు సిజేరియన్ ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత ఐవీ ఫ్లూయిడ్స్ ఇచ్చారు.

ఆమెకు కిడ్నీ సమస్యలతో పాటు బహుళ అవయవ వైఫల్యానికి దారితీసింది. డయాలసిస్ చేయించుకుంటున్న ఆమె ఈ నెల ఐదో తేదీన మరణించింది. ఆమెకు ముందు రోజమ్మ, నందిని, ముస్కాన్, మహాలక్ష్మి, లలితమ్మ కూడా డెలివరీ అనంతరం ఇవే సమస్యల వల్ల మృతి చెందారు. ఈ సంఘటనలపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 12 మంది దుర్మరణం

లక్నో: ఐదు గంటల వ్యవధిలో వేర్వేరు ప్రదేశాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 12 మంది దుర్మరణం చెందారు. 45 మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్ వేపై ప్రయాణికులతో వెళ్తున్న ఓ డబుల్ డెక్కర్ బస్సు అదుపుతప్పి ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. మరో 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. మరో ప్రమాదం... ఝాన్సీ-మీర్జాపూర్ హైవేపై జరిగింది. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఒకేరోజు కేవలం ఐదు గంటల వ్యవధిలో రెండు ఘోర రోడ్డు ప్రమాదాలు జరగడంతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు.

ఖడ్గే...మోదీ నవ్వులే నవ్వులు

న్యూఢిల్లీ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్థంతి సందర్భంగా పార్లమెంటు ఆవరణలో మహాపరినిర్వాణ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే పరస్పరం పలకరించుకున్నారు. కొంతసేపు నవ్వుతూ మాట్లాడుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మల్లికార్జున ఖడ్గే తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖడ్గే... మోదీ వద్దకు వచ్చి కరచాలనం చేశారు. అనంతరం ఇద్దరు నేతలు కాసేపు నవ్వుతూ ముచ్చటించారు. ఎప్పుడూ పరస్పర విమర్శలు చేసుకొనే నేతలు ఒకేచోట నవ్వులు పూయిస్తూ మాట్లాడుకుంటున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అంబేద్కర్‌కు నివాళులర్పించారు. 'సమానత్వం, మానవ గౌరవం కోసం డా.బీఆర్ అంబేద్కర్ చేసిన అవిశ్రాంత పోరాటం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఈరోజు ఆయన సహకారాన్ని గుర్తుచేసుకుంటూ... ఆయన సంకల్పాన్ని నెరవేర్చేందుకు మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

అదానీని స్టాలిన్ కలవలేదు

తమిళనాడు మంత్రి బాలాజీ

చెన్నై: ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కలవలేదని, అదానీ గ్రూపుతో ఎలాంటి ఒప్పందంపైనా సంతకం చేయలేదని ఆ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి వి.సెంథిల్ బాలాజీ చెప్పారు. ఈ అంశంపై ఎవరైనా వదంతులు వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎంకే హయాంలో ఆ సంస్థతో ఎలాంటి ఒప్పందం చేసుకోలేదన్నారు. సీఎం స్టాలిన్ అదానీని కలిశారని, అధిక ధరకు సోలార్ విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నారంటూ ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను, మీడియా కథనాలను బాలాజీ ఖండించారు. అదంతా కల్పిత ప్రచారమేనన్నారు. యూనిట్‌కు రూ.7.01 చొప్పున విద్యుత్ కొనుగోలుకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. అన్నాడీఎంకే హయాంలో రామనాథపురం జిల్లాలో అదానీ గ్రూపునకు చెందిన 648 మెగావాట్ల సోలార్ ప్లాంట్ నుంచి విద్యుత్ కొనుగోలు కోసం 2015లో చేసుకున్న ఒప్పందాన్ని డీఎంకే ప్రభుత్వం చేసుకున్నట్లుగా చిత్రీకరించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సుప్రీంకోర్టులో ఉన్న కేసును పక్కనపెట్టి తెలిసీ తెలియకుండా మాట్లాడుతున్నారన్నారు. సీఎం ప్రతిష్ఠను దిగజార్చేలా తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

శబరిమలలో నటుడికి వీఐపీ దర్శనమా?

కేరళ హైకోర్టు ఆగ్రహం

కొచ్చి: శబరిమలలోని అయ్యప్ప క్షేత్రంలో నటుడికి వీఐపీ దర్శనం కల్పించడాన్ని కేరళ హైకోర్టు తప్పుబట్టింది. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ)పై ఆగ్రహం వ్యక్తం చేసింది. మలయాళ నటుడు దిలీప్ గురువారం శబరిమలలోని అయ్యప్ప క్షేత్రాన్ని దర్శించుకున్నారు. టీడీబీ ఆయనకు వీఐపీ దర్శనం కల్పించింది. ఆ సమయంలో భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి చూడాల్సి వచ్చింది. కొందరు భక్తులు దేవుడిని దర్శించుకోకుండానే వెనుదిరిగారు. దీనిపై మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా కేరళ హైకోర్టు ఈ విషయాన్ని సుమోటోగా తీసుకొని విచారించింది. చాలా సమయం నటుడు ఆలయంలో ఉండటానికి ఎలా అనుమతిచ్చారని టీడీబీని ప్రశ్నించింది. ఆయన వల్ల పిల్లలు, వృద్ధులు సహా ఇతర భక్తులు గంటల తరబడి లైన్లలో వేచి ఉండాల్సి వచ్చిందని పేర్కొంది. యాజమాన్యమే ఇలా ప్రవర్తిస్తే... భక్తులు ఎవరికి ఫిర్యాదు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులకు మాత్రమే వీఐపీ దర్శనం కల్పించాల్సి ఉంటుందని, ఇతరులకు ప్రత్యేక దర్శనం కల్పించడం నిబంధనలకు విరుద్ధమని టీడీబీపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టి శనివారంలోగా వీడియో ఫుటేజీ, నివేదిక కోర్టుకు సమర్పించాలని న్యాయమూర్తులు జస్టిస్ నరేంద్రన్, జస్టిస్ మురళీకృష్ణతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. నటుడిని ప్రతివాదిగా చేర్చాలని వస్తున్న డిమాండ్లను పరిశీలిస్తామని తెలిపింది.

భారత సరిహద్దుల్లో బంగ్లాదేశ్ డ్రోన్లు

న్యూఢిల్లీ: భారత్, బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు పెరుగుతున్నాయి. పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో బంగ్లాదేశ్ సైన్యం కిల్లర్ డ్రోన్ మోహరించింది. బంగ్లాదేశ్ సైన్యం మోహరింపుతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పెరిగింది. ఈ ప్రాంతం భారతదేశంలో చాలా సున్నితమైనదిగా పరిగణించబడుతుంది. ఈ డ్రోన్‌లు చాలా శక్తివంతమైనవి. ఈ డ్రోన్లు దాడి చేయడమే కాకుండా గూఢచర్యం చేయడంలో కూడా సహాయపడతాయి. దీంతో రెండు దేశాల మధ్య పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఈ డ్రోన్‌లను బంగ్లాదేశ్‌లో 67వ సైన్యం నిఘా కార్య కలాపాల కోసం వినియోగిస్తున్నట్లు చెబుతున్నారు. బంగ్లాదేశ్ రక్షణ అవసరాల కోసం మోహరింపు అని చెప్పినప్పటికీ ఆధునాతన డ్రోన్‌లను సున్నితమైన ప్రాంతంలో ఉంచడం చర్చనీయాంశంగా మారింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరతను ఉపయోగించుకుని కొన్ని ఉగ్రవాద గ్రూపులు, స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లు భారత్‌లోకి చొరబడుతున్నాయని అనేక నివేదికలు చెబుతున్నాయి. హసీనా బహిష్కరణ తరువాత సరిహద్దు ప్రాంతాలలో భారతదేశ వ్యతిరేక కార్యకలాపాలు పెరిగాయి. బంగ్లాదేశ్‌లో అశాంతి నేపథ్యంలో భారత సాయుధ దళాలు ఇప్పటికే అప్రమత్తమయ్యాయి. సరిహద్దుల్లో తాజా డ్రోన్ విస్తరణలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఆ ప్రాంతాలలో కౌంటర్ డ్రోన్ కార్యకలాపాలను తీవ్రతరం చేశారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితిని తెలుసుకునేందుకు భారతదేశం గూఢచార భాగస్వామ్య యంత్రాంగాలను ఉపయోగిస్తోంది. అయితే ఇలాంటి దుందుడుకు చర్యలపై తాము అప్రమత్తమయ్యామని భారత అధికారులు చెబుతున్నారు.

ప్రిన్సిపల్‌ను తుపాకీతో కాల్చి చంపిన విద్యార్థి

భోపాల్: పాఠశాలలో క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పిన ప్రిన్సిపల్‌ను ఓ విద్యార్థి దారుణంగా కాల్చి చంపాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఛతర్‌పూర్ జిల్లాలోని ధమోరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌కే సక్సేనా (55) ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పాఠశాలకు వచ్చిన ప్రిన్సిపల్ మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో బాత్రూమ్‌కు వెళ్లారు. అక్కడే కాపు కాసిన 12వ తరగతి విద్యార్థి... ఆయన బయటకు రాగానే ఒక్కసారిగా కాల్పులకు పాల్పడ్డాడు.

విశాలాంధ్ర హైదరాబాద్

అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఆధ్వర్యంలో గాంధీభవన్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. మరియు మహిళా ప్రయాణికులుకు బస్సులో మిఠాయిలు పంచి ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర ప్రజా పరిపాలన విజయోత్సవాల వేడుకలు పురస్కరించుకొని సీఎం రేవంత్ రెడ్డి హయాంలో నిరుపేద కుటుంబాలకు కార్పొరేటర్ స్థాయిలో వైద్యం అందజేయడం జరిగిందని అన్నారు ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ముఖ్యంగా మహిళలకు రైతులకు యువకులకు పెద్ద పీట వేస్తుందని సునీత రావు అన్నారు. ఇటు బిజెపి వాళ్లకు అటు బిఆర్ఎస్ వాళ్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక తిక్కతికగా మాట్లాడుతున్నారని పది సంవత్సరాలు మీరు చేసింది ఏముందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ప్రెసిడెంట్ పుస్తకాల కవిత ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభు ఉషశ్రీ మేడ్చల్ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జయమ్మ స్టేట్ ఆఫీసు బేరర్స్ బ్లాక్ ప్రెసిడెంట్స్ డివిజన్ ప్రెసిడెంట్స్ మొదలగు వారు పాల్గొన్నారు.

అరెస్టులతో నిరసన కార్యక్రమాలు ఆపలేరు

విశాలాంధ్ర- కొత్తూరు : అభివృద్ధి చేయాలని అడిగితే ఇటీవల బిఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తమ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉండడంతో శుక్రవారం ముందస్తుగానే పోలీసులు స్థానిక బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు బిఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్ ఎదురుగా మాట్లాడుతూ అరెస్టులతో నిరసన కార్యక్రమాలను ఆపలేరని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేయకపోవడంతో ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికీ ఏడాది గడుస్తున్న అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం దురదృష్టం అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడితే తాము స్వాగతిస్తామని, లేని యెడల ఎన్ని అడ్డంకులు ఎదురైన ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మెండె కృష్ణ యాదవ్, సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, దేవేందర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్‌లు కోస్గి శ్రీనివాస్,మాదారం నరసింహులు గౌడ్, సోమ్లా నాయక్, నాయకులు జె.శ్రీను, బాల్రాజ్, బండి కృష్ణ, రాజశేఖర్, రవి నాయక్, లక్ష్మయ్య, శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

వడ్డెరల అభ్యున్నతికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: వడ్డెర కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్‌లోని తెలంగాణ వడ్డెర సంఘం సభ్యులు ఎమ్మెల్యే కెపి.వివేకానందని ఆయన నివాస కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం సభ్యులు వడ్డెర కులస్తుల పిల్లలకు గురుకుల పాఠశాలలో ఎటువంటి ఎంట్రన్స్ టెస్ట్ లేకుండా సీట్లను కేటాయించడంతోపాటు, బండ క్వారీలు, క్రషర్లపై పూర్తిగా వడ్డెర కులస్తులకే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్ల బడ్జెట్ కేటాయించి బ్యాంకు కన్సల్టేషన్ లేకుండా వడ్డెర యువతకు లోన్లు ఇవ్వాలని, వడ్డెర కులస్తులకు రాజకీయంగా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ వడ్డెర కులస్తుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఎస్టీ జాబితాలో చేర్చేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు, గౌరవాధ్యక్షులు పీట్ల మల్లేష్, వడ్డెర సంఘం సభ్యులు జెరిపేట్ రాములు, శ్రీను, యాది, కె. హన్మంతు, సిహెచ్.రాజు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా అల్మాస్ ఖాన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా అల్మాస్ ఖాన్ ఎంపికయ్యారు. 2009 నుండి కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ సేవలు అందించిన ఆయనకు పార్టీ సముచిత స్థానం కల్పించిందని అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అన్ని రకాలుగా కృషి చేశామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా యువతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఇప్పటికే 55వేల ఉద్యోగాలు భర్తీ చేసిన ప్రభుత్వం మునుముందు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించనుందన్నారు. అటు పార్టీకి, యువతకు మధ్య వారధిగా పనిచేసే అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయ నాయకులు సమగ్ర సర్వేకు సహకరించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన ప్రతిష్టాత్మకంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరిగిందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అయితే రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉన్నత స్థాయి అధికారులు ఇప్పటికీ ఎవరైనా తమ సమాచారాన్ని ఇవ్వకపోయి ఉంటే మీ ప్రాంత సమాచార సేకరణ అధికారి ఎన్యుమరెటర్స్‌నీ పిలిచి సమాచారం ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రాజకీయాలు లేవు గతంలో టిఆర్ఎస్ పార్టీ సమాచారం సేకరించినప్పుడు కూడా ప్రతిపక్ష నాయకులుగా మేమంతా సమాచారాన్ని ఇచ్చామన్నారు. ఇప్పటికీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎమ్మెల్యేలు పలువురు నాయకులు ఇంతవరకు సమగ్ర కుల సర్వేలో పాల్గొనలేదని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నాయకులందరూ కుల సర్వేకు సహకరించాలన్నారు. సమాచారాన్ని ఇవ్వకుండా బీసీలకు వ్యతిరేకంగా ఈ సర్వే నిర్వహణకు వ్యతిరేకంగా మీలో భావం ఉంటే చెప్పండని ప్రశ్నించారు. ప్రభుత్వం తీసుకున్న సర్వేలో మీరు లేకుండా ఉంటే మంచిది కాదన్నారు. సమాచార శాఖలో మీరు భాగస్వాములై వివరాలు ఇవ్వాల్సిందిగా కోరారు. ఎవరైనా రాకపోతే పోస్టులు పెట్టి విమర్శించడం కాదు, సమాచార లోపంతో, అవగాహన లోపంతో అధికారులు రాకపోయి ఉంటే బాధ్యతగల వాళ్లుగా ప్రభుత్వం తరుపున విజ్ఞప్తి చేశారు. విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఆహ్వానం, తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణకు రావాల్సిందిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఆహ్వానిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా ప్రతిపక్ష నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను 9వ తేదిన జరిగే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కు ఆహ్వానించడానికి వారి సిబ్బందికి సమాచారం ఇచ్చి సమయం ఇవ్వాల్సిందిగా అడుగుతున్నామని చెప్పారు. వాళ్ళు సమయం ఇచ్చిన దాని ప్రకారంగా పోయి వాళ్ళందరికీ తెలంగాణ ప్రభుత్వం పక్షాన ఆహ్వానం ఇవ్వడం జరుగుతుందన్నారు. వారు ఈ సమావేశానికి రావాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం తరుపున విజ్ఞప్తి చేశారు.

టీజీపీఎస్సీ పదవి బాధ్యతలు స్వీకరించిన బుర్ర వెంకటేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిరుద్యోగులు, ఉద్యోగస్తుల కోసం టోల్ ఫ్రీ నంబర్ అమ ల్లోకి తెస్తామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం చెప్పారు. శుక్రవారంనాడు కమిషన్ భవనంలో ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ పదవిలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. తాను ఐదున్నరేండ్ల పాటు పదవిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. పరీక్షలన్నీ షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని, అందరూ బాగా చదుకొని ధైర్యంగా పరీక్షలు రాయాలని అన్నారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెబితే నమ్మొద్దని, పోలీసులకు ఫిర్యాదులు చేయాలని చెప్పారు. పరీక్షల నిర్వహణను స్పీడప్ చేస్తామని చెప్పారు. తనకు ఐఏఎస్‌లో 15 వ ర్యాంకు వచ్చిందని గుర్తు చేశారు.

తనకు ఇంకా మూడున్న రేండ్లు సర్వీసు ఉన్నా నిరుద్యోగుల కోసం టీజీపీ ఎస్సీ చైర్మన్‌గా జాయిన్ అయ్యానని అన్నారు. రాష్ట్రంలో మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తామని వివరించారు. తన కలను ఎలా సాకారం చేసుకున్నానో నిరుద్యోగుల కలను అదే విధంగా సాకారం చేస్తానని చెప్పారు. ఇప్పటివరకు తప్పులు చేసిన వారు ఎవరైనా కమిషన్ ఉంటే స్వచ్ఛందంగా తప్పుకోవాలని సూచించారు.

ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతులు లేవు

మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక మీదట బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. స్టార్ హీరోల సినిమాల బెనిఫిట్ షోలు వేసుకోవ దానికి ఏపీ, తెలంగాణ, ప్రభుత్వాలు అనుమతులు ఇస్తుండటం తెలిసిందే. అల్లు అర్జున్ తాజా చిత్రం 'పుష్ప-2' కు కూడా ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు బెనిఫిట్ షోలకు అనుమతులు ఇచ్చాయి. అయితే, హైదరాబాద్ సంధ్యా థియేటర్ వద్ద బెనిఫిట్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోవ డం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఇకపై ఏ సినిమాకు కూడా బెనిఫిట్ షోకు అనుమతులు ఇవ్వబోమని ఆయన చెప్పారు. నగరంలో బెని ఫిట్ షోలు వేయడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని కోమటిరెడ్డి అన్నారు. కుటుంబంతో కలిసి సరదాగా సినిమా చూసేందుకు వచ్చినవారు తమ కుటుంబ సభ్యురాలిని కోల్పోవడం తనను ఎంతో బాధించిందని చెప్పారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ఉన్న సంధ్య థియేటర్ లో కుటుంబంతో కలిసి సినిమా చూసేందుకు అల్లు అర్జున్ వచ్చారు. దిల్ సుఖ్ నగర్ కు చెందిన రేవతి (39), ఆమె భర్త భాస్కర్, పిల్లలు శ్రీతేజ్, శాన్వికలు కూడా సినిమా చూసేందుకు వచ్చారు. బన్నీ వచ్చిన సమయంలో ఎవరూ ఊహించని విధంగా తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో రేవతి, కుమారుడు శ్రీతేజ్ ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీన్ని గమనించిన పోలీసులు ఆమెకు సీపీఆర్ చేసినా లాభం లేకపోయింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయిందని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో విషాదాన్ని నింపింది. మహిళ మృతిపై 'పుష్ప' టీమ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. మృతురాలి కుటుంబానికి అండగా నిలబడతామని ప్రకటించింది.

మల్కాజిగిరిలో హైడ్రా కూల్చివేతలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మల్కాజిగిరి సర్కిల్ ఆల్వాల్ సర్కిల్ పరిధిలోని ఫంక్షన్ హాల్, ఇతర నిర్మాణాలను శుక్రవారం కూల్చి వేసింది. నాగిరెడ్డికుంట నాలా ఆక్రమించి బఫర్ జోన్‌లోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్లు 14,32లో నిర్మించిన డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నిర్మాణం జరిగినట్లుగా రెవిన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులు పూర్తి విచారణ జరిపి హైడ్రా అధికారులకు నివేదిక అందజేయడంతో ఫంక్షన్ హాల్ ను కూల్చి వేశారు. అదే ప్రాంతంలో సర్వే నెంబరు 32 దోభీఘాట్‌ను కబ్జా చేసి ప్రహరీ నిర్మించడంతో ఆ ప్రహరీ నిర్మాణాన్ని సైతం కూల్చివేశారు. కోర్టు స్టే ఉన్న సర్వే నెంబరు 25 లో కూల్చివేతలు చేపట్టలేదని, యాప్రాల్లోని ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పోరాటం చేయడంతో పాటు పలుమార్లు అధికారులకు విన్నవించారు. కొన్ని సార్లు వారిపై కేసులు నమోదైన సందర్భాలు ఉన్నాయి. హైడ్రాతో న్యాయం జరిగిందని, ప్రభుత్వ భూములకు రక్షణ లభిస్తుందన్న నమ్మకం కుదిరిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఫంక్షన్ హాల్ నిర్మించిన యజమాని కోర్టును సైతం తప్పుదోవ పట్టించారని హైడ్రా అధికారులు తెలిపారు. ప్రైవేట్ స్థలంలోనే ఫంక్షన్ హాల్ నిర్మాణం జరిగిందని ఫంక్షన్ హాల్ మొత్తం మీద యజమాని స్టేటస్ కో తీసుకొని వచ్చారని, అందులో వాస్తవం లేదన్నారు. ప్రభుత్వ విచారణలో ప్రభుత్వ భూమిలో ఉన్న ఫంక్షన్హాల్ కొంతభాగాన్ని, కాంపోడ్ గోడ జీహెచ్ఎంసీ యాక్ట్ 405 ప్రకారం కూల్చివేతలు చేశామన్నారు. ఫంక్షన్ హాల్ యజమాని గతంలో నేరెడ్మెట్ డివిజన్ కార్పొరేటర్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, బీఆర్ఎస్ నాయకుడుగా పని చేస్తున్నారు.

9న సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రదాత కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ 78వ జన్మదినోత్సవ వేడుకలను డిసెంబర్ 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సోనియా గాంధీ లేనిదే తెలంగాణ లేదన్నారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ఏడాదిలో చేసి చూపించిందన్నారు. ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం 55 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. అధికారం కోల్పోయిన కేటీఆర్ అహంకార ధోరణి వీడలేదని ఇంకా కేటీఆర్ పగటి కలలు కంటున్నారని దుయ్యబట్టారు. లక్షల కోట్లు దోపిడీ చేసిన మీ పార్టీ అధికారంలోకి వస్తుందని ఎలా అనుకుంటున్నారని ప్రశ్నించారు.

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా తెలంగాణ తల్లి విగ్రహం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ కోసం కేటీఆర్, కవిత ఏం త్యాగం చేశారని రాజీవ్ గాంధీ గురించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదని అన్నారు. దేశంలోనే తక్కువ సమయంలో ఎక్కువ దోచుకున్న కుటుంబం ఏదైనా ఉందంటే అది కేసిఆర్ కుటుంబం అంటూ మండిపడ్డారు. బిఆర్ఎస్ హయంలో స్వేచ్ఛ కొరవడిందని కానీ సీఎం రేవంత్ హయంలో స్వేచ్ఛకు కొదువ లేదనున్నారు. కౌశిక్ రెడ్డి వాడిన భాష సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని విమర్శించారు. చట్టం ఎవరికి చుట్టం కాదని, పదేళ్ల నిరంకుశ పాలనకు తెలంగాణ ప్రజలు చరమ గీతం పాడి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. కేసిఆర్, కేటీఆర్ తప్ప బిఆర్ఎస్ పార్టీలో ఎవరుకూడ ఉండలేని పరిస్థితి ఉందన్నారు.

బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డికి సరిగ్గా సరిపోయే పేరు కిస్మత్ రెడ్డి అని, బీజేపీ పార్టీకి పేదల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ప్రతిపక్ష నాయకుడిని ఫాం హౌస్‌లో బంధించి కేటీఆర్, హరీష్ పిల్ల చేష్టలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. లా అండ్ ఆర్డర్ డిస్టబ్ చేస్తే చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని స్పష్టం చేశారు.

అంబేద్కర్‌కు సీపీఐ నేతల ఘన నివాళి

విశాలాంధ్ర - హైదరాబాద్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దూరదృష్టితో రాజ్యాంగాన్ని రచించడం వలన నేటికీ ప్రజాస్వామ్యం దేశంలో కొనసాగుతు న్నదని, ఆ ప్రజాస్వామ్యాన్ని తూట్లు పొడవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్ని స్తుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 65వ వర్ధంతి సందర్భంగా హైదరాబాదులోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం, ముగ్దుం భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఏం. బాల్ నరసింహాతో కలిసి చాడ వెంకటరెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎన్ని అవమానాలు, అడ్డంకులు ఎదురైనా ఏమాత్రం వెనుకడుగు వేయకుండా రాజ్యాంగాన్ని నిర్మించారని, ఆ రాజ్యాంగ ఫలాలు ఇంకా అందరికీ అందడం లేదని అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల నుండి దేశంలో రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతుందని, పౌర హక్కులను కాలరాస్తుందని, ప్రశ్నించే గొంతుకులను నొక్కుతుందని ఆయన అన్నారు. అదాని ఆర్థిక కుంభకోణాలపై అమెరికాలో కేసులు పెట్టినా, ఆ కేసులపై విచారణ జరిపించాలని జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవడానికి కృషి చేయాలని చాడ వెంకట్ రెడ్డి కోరారు. ఎం.బాల నరసింహ మాట్లాడుతూ భారతదేశాన్ని ఏలుతున్నటువంటి పాలకులు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఏ విధంగా అయినా మార్చాలని కుట్ర పన్నుతన్నారని, ఈ పరిస్థితులలో రాజ్యాంగం ద్వారా లబ్ధి పొందిన బడుగు బలహీనవర్గాలు రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని ఆయన కోరారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, డిహెచ్పిఎస్ నాయకులు రాజు, సిపిఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఏ గోవిందరావు, కార్యాలయ బిల్డింగ్ ఇన్చార్జి శ్రీరాములు, సిపిఐ శాసనసభ పక్ష కార్యాలయ కార్యదర్శి వైయస్ మూర్తి, ఆఫీస్ సిబ్బంది దశరథ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ రాంనగర్ సెయింట్ పైస్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని అన్నారు. సైన్స్ లేని జీవనం ఊహించుకోలేనిదని మన మందరం సైన్స్‌లో జరిగే సాంకేతిక పరిణామల వల్ల ఈ విధమైన జీవనం గడుపుతున్నామని అన్నారు. మనం కూర్చునే కుర్చీ, గాలి కోసం వాడే ఫ్యాన్, ధ్వని కోసం వాడే మైకులని కూడా సైన్స్ వల్లనే వచ్చాయని అన్నారు. పెన్సులిన్ కనిపెట్టిన అలగ్జాండర్ ఫ్లెమింగ్ అలాగే యాపిల్ చెట్టు నుండి కాయ కింద పడడం చూసిన న్యూటన్ గొప్ప శాస్త్రవేత్తగా చేసే మూల కారణం అని వారి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. విద్యార్థులు సృజనాత్మకత నైపుణ్యంను పెంపొందించుకోవాలని అలాగే వినూత్నమైన ఆలోచనలతో ప్రతి ఒక్కరు అలోచించి తమ భావి జీవితానికి పునాదులు వేసుకోవాలని సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శనలు ఇందుకు ఒక చక్కని వేదికగా వాడుకొని విద్యార్థులందరు ఆధునిక శాస్త్రవేత్తలుగా సమాజానికి ఉపయోగపడే పౌరులవ్వాలని ఆకాంక్షించారు. తదుపరి వైజ్ఞానిక ప్రదర్శనశాలను ప్రారంభించి, బాల, బాలికలు చేపట్టిన పలు వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించి అభినదించారు. ఈ ఎక్సీబీట్ లో 6 నుండి 10 వ తరగతి చదువుతున్న 78 పాఠశాలల విద్యార్థులచే 147 వైజ్ఞానిక పదర్శనలు ఏర్పాటు చేసారు. కార్యక్రమం ముందుగా విద్యార్థులచే కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రోహిణి, డిప్యూటీ డిఈఓ చిరంజీవి, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లిండా జరాల్డ్, కోర్డినేటర్ జ్యోతి, తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన శ్రీలీల

విశాలాంధ్ర - పటాన్ చెరువు : ఫ్యాషన్ల సరికొత్త ఏకైక గమ్యం సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తమ 37వ షోరూంను శుక్రవారం రామచంద్రపురంలో ప్రారంభించింది. యువతరం తారామణి కుమారి శ్రీలీల ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, శుభారంభం చేశారు. ఈ విశేష కార్యక్రమం కలకాలం గుర్తుండిపోయేలా, వస్త్రప్రియులు ఆనందించేలా, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారు రూ. 150 కనీస ధరతో, 'కాస్ట్ టు కాస్ట్' అమ్మకాలతో తమ ప్రత్యేకతను చాటి చెప్పారు. విస్తారమైన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ బ్రాండ్ తాలూకు అంకితభావానికి, ప్రత్యేకతకు గుర్తుగా కొనుగోలుదారులను అలరిస్తోంది. వివాహాది శుభకా ర్యాలు మొదలుకుని, ప్రత్యేక పర్వదినాలవరకు అన్ని తరాలను, తరగతులను అలరించే లక్షలాది వైవిధ్యభరిత వస్త్రశ్రేణి ఇక్కడ అందుబాటులో ఉండటం విశేషం. ఈ శుభ సందర్భాన్ని ప్రతిబింబిస్తూ, స్థానికులకు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సంస్థ డైరెక్టరైన సురేశ్ సీర్ణ, అభినయ్, రాకేశ్, కేశవ్ స్వాగతం పలికారు.

వస్త్రప్రియుల అభిరుచులను దృష్టిలో ఉంచుకుని విశేష సేవలు అందిస్తున్న సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారి అంకిత భావాన్ని ప్రశంసిస్తున్న కొనుగోలుదారులందరికీ సంస్థ డైరెక్టర్లు తమ హృదయపూర్వక కృతజ్ఞతలను, సంతోషాన్నీ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ రామచంద్రాపురంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 37వ షో రూమ్ శుభారంభం చేయడం మాకెంతో సంతోషంగా ఉందని రామచంద్రాపురం వాసులు కోరుకునే నాణ్యతకు, నవ్యత్వానికీ పెద్దపీట వేసి, వారి అభిరుచులను అడుగడుగునా ప్రతిబింబించే వైవిధ్యభరిత వస్త్రశ్రేణిని, షాపింగ్ అనుభూతినీ మీ గృహాలకు ఎంతో చేరువగా తీసుకురావటం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాం" అన్నారు.

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: రాచకొండ పోలీస్ కమిషనరేట్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో మేడిపల్లి పోలీస్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా హాజరైన మేడిపల్లి సీఐ గోవిందా రెడ్డి విద్యార్థులతో మాట్లాడుతూ మంచి క్రమశిక్షణ పాటించాలని, భావి భారత భవిష్యత్తు విద్యార్థుల చేతిలోనే ఉందని, సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని, ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకుని మంచిగా కష్టపడి చదవాలని, ఉపాధ్యాయులను గౌరవించాలని, వారు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వినాలని, తప్పు చేస్తే దండన తప్పదని, ఎట్టి పరిస్థితులలో నేరాలలో (క్రైమ్‌లో) ఇన్వాల్వ్ కాకూడదని, చెడు పనులు చేయకూడదని విద్యార్థులకు సూచనలు అందించారు. డ్రగ్స్, మత్తు పానీయాలు జోలికి వెళ్లకూడదని, మంచిగా చదువుకోవాలని పుట్టిన గ్రామానికి, తల్లిదండ్రులకు అందరికీ మంచి పేరు తేవాలని, సమాజంలో మంచి ఉన్నత స్థానంలో పేరు పొందాలని, సత్ప్రవర్తన కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం సహ పంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యను, భోజన సదుపాయాలను, వసతులు, పరిసరాలను మెనూను పరిశీలించి ప్రిన్సిపాల్‌ను ఉపాధ్యాయులని అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పి. నిర్మల, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు దాదాపు 350 మంది పాల్గొన్నారు.

ఏడాదిలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు

విశాలాంధ్ర - మొయినాబాద్ : మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన గడ్డం సౌమ్యా రెడ్డి ఏడాది కాలంలోనే ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఓ మహిళ సత్తా చాటారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం నాదర్ గూల్ గ్రామానికి చెందిన గడ్డం సౌమ్యారెడ్డికి మొయినాబాద్ మండలం చిలుకూరుకు చెందిన శ్రీధర్‌రెడ్డితో 2014లో వివాహమైంది. పెళ్లయినా తరువాత విద్యను కొనసాగించింది. భర్త ప్రోత్సాహంతో డిగ్రీ పూర్తి చేసిన తరువాత ఆమె బీఎడ్, ఎంఎస్సీ చదివారు అనంతరం 2022లో టీజీటీ, పీజీటీ గురుకులాల జేఎల్కు నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు పెట్టుకోగా 2023లో నిర్వహించిన పరీక్షకు హాజరయ్యారు. వాటిల్లో ఉత్తమ ప్రతిభ చూపి ఒకేసారి మూడు ఉద్యోగాలు పొందారు. తాజాగా టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించి జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ప్రస్తుతం గురుకుల జూనియర్ కళాశాలలో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సౌమ్యారెడ్డి చెప్పారు.

పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలే లక్ష్యం

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. గ్రీన్‌వర్క్స్‌బయో, సీఎస్ఐఆర్ - ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ సహకారంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా రూపొందించిన ఉత్పత్తులను హైదరాబాద్‌లోని హబ్సిగూడ స్వామి వివేకానంద ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమస్యలను ఎదుర్కొనడంలో విజ్ఞాన ఆధారిత పరిష్కారాలకు ఎంతో ప్రాముఖ్యత కలదన్నారు. సీఎస్ఐఆర్ - ఐఐసీటీతో గ్రీన్‌వర్క్స్ బయో సహకారం సాంకేతికత ద్వారా స్థిరమైన అభివృద్ధిని ఎలా నడిపించగలదో చూపిస్తుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించే మా ప్రయత్నాలలో ఈ ప్రయోగం ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని తెలిపారు. ప్రపంచంలోని పర్యావరణ సవాళ్లను పరిష్కరించడానికి సైన్స్, టెక్నాలజీ సామర్థ్యం ఎనలేనిదన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పచ్చదనం వైపుగా సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు దోహదపడే కార్యక్రమాలకు ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. గ్రీన్‌వర్క్స్‌బయో ఉత్పత్తులు ప్లాస్టిక్ కాలుష్యానికి వ్యతిరేకంగా మన సామూహిక పోరాటంలో ముందడుగు అన్నారు. ఈ సందర్భంగా గ్రీన్‌వర్క్స్‌బయో డైరెక్టర్ రిషికా రెడ్డి మాట్లాడుతూ ఈ ఉత్పత్తులు ప్రపంచ ప్లాస్టిక్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో ఒక ముందడుగు అన్నారు. పర్యావరణ స్పృహతో నిర్ణయాలు తీసుకునేలా ప్రజలను శక్తివంతం చేస్తాయన్నారు. సీఎస్ఐఆర్ - ఐఐసీటీ సహకారంతో అభివృద్ధి చేసిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం, ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలలో సానుకూల మార్పును తీసుకురావడంపై ప్రభావం చూపుతున్నామని తెలిపారు. ఈ ఆవిష్కరణ ఒక గ్రీన్ వరల్డ్ సృష్టించడంలో మా నిబద్ధతకు నిదర్శనమన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - జవహర్ నగర్ : మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నూతన మండల, గ్రామ కమిటీల నిర్మాణం కార్యచరణలో భాగంగా ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాప్రా మండల ఇన్చార్జి వడ్డేపల్లి శివకుమార్ మాదిగ ఆధ్వర్యంలో కాప్రా మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఎమ్మార్పీఎస్ కాప్రా మండల అధ్యక్షులుగా కొత్త నరేష్ మాదిగ ప్రధాన కార్యదర్శి నాగల్ల రాజేష్ మాదిగ ఉపాధ్యక్షులు అశ్విన్ మాదిగ సంయుక్త కార్యదర్శి తుడుం నర్సింగ్ రావు మాదిగ ప్రచార కార్యదర్శి నాగల్ల యాదయ్య పెరుమాండ్ల కిషన్ మాదిగలు కార్యదర్శి ఆనందాస్ ప్రకాష్ మాదిగ కార్యవర్గ సభ్యులు గూడ ఇంద్రయ్య మాదిగ ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ పాల్గొనగా కమిటీ గౌరవ సలహాదారులుగా గడ్డం కిష్టయ్య మాదిగ గడ్డం రామచందర్ మాదిగ మాజీ కౌన్సిలర్ బాలయ్య మాదిగ గడ్డం దుర్గయ్య మాదిగలు ఈ కార్యక్రమంలో యువ నాయకులు గూడ విజయ్ కుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - కాప్రా : కాప్రా సర్కిల్ పరిధిలోని నాచారం ఓల్డ్ విలేజ్లో 54 లక్షల రూపాయలు వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేశారు. గత ఎన్నో సంవత్సరాలుగా నాచారం ఓల్డ్ విలేజిలో భూగర్భ డ్రైనేజీలో ప్రొఫెసర్ మంచినీటి సమస్యను కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ ప్రత్యేక చొరచూపి కోటి రూపాయలు మంజూరు చేయించి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తన ధ్యేయమని ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్నానని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఈ బాలకృష్ణ ఏ ఈ కీర్తి వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, స్థానిక బారాసా నాయకులు కార్యకర్తలు మరియు నాచారం ఓల్డ్ విలేజ్ స్థానికులు పాల్గొన్నారు.

మంత్రి హామీతో ఆటో కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ : కూనంనేని

విశాలాంధ్ర - హైదరాబాద్ : రేపటి నుండి జరిగే ఆటో కార్మికుల సమ్మెను మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీతో తాత్కాలికంగా విరమణ చేస్తున్నట్లు ఆటో యూనియన్ జెఎసి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సమక్షంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జెఎసి వారు సాంబశివరావును కలిసి వారు పలు డిమాండ్లను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించాలి వారు కోరారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 10వ తేదీ లోపు ఆటో యూనియన్‌లతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని సాంబశివరావు తెలిపారు. ఈ చర్చలలో ప్రజాప్రతినిధులుగా కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ కోదండరామ్ పాల్గొంటారని, ఆటో యూనియన్ జెఎసి నుండి ఆటో యూనియన్ సంఘాల నాయకులు పాల్గొని సామరస్యపూరిత వాతావరణంలో చర్చలు జరుపుకొంటామని కూనంనేని సాంబశివరావు విశ్వాసం వ్యక్తం చేశారు. ఆటో యూనియన్‌ల సమస్యలు అనేకం వున్నా వాటిలో కొన్నింటికైన పరిష్కారం లభిస్తున్నదని వారు ఆశభావం వ్యక్తం చేశారు. అవసరమైతే సమస్యల పరిష్కారానికి అవసరమైతే ముఖ్యమంత్రి దగ్గరికి కూడా వెళ్ళి చర్చలు జరుపుతామని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో కార్మికులు మహాలక్ష్మి పథకాన్ని తీసివేయాలని కోరడం లేదని, కాని వారికి సంవత్సరానికి రూ. 15000 ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, వారి సంక్షేమార్థం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తదితర హామీలను పూర్తి చేయాలని సాంబశివరావు తెలిపారు.

ఎంఎల్ఆర్ఐటి కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య

విశాలాంధ్ర - దుండిగల్ : విద్యార్థుల మరణాలపై ప్రభుత్వానికి పట్టింపే లేకుండా పోయిందని, వారం రోజుల వ్యవధిలో రెండు మూడు మరణాలు సంభవిస్తున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి ఎంఎల్ ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రావణి (18) హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శ్రావణి తల్లితండ్రులకు కనీస సమాచారం ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం మృతదేహాన్ని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా మైలారం కొత్త తండా ధరూర్ మండలం బలరాం, కవితల పెద్ద కుమార్తె శ్రావణిగా గుర్తించారు. ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని శ్రావణి సూసైడ్ లెటర్ వ్రాసి బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం. లెటర్‌లో చదువు ఒత్తిడి పెరిగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపిందని నిర్ధారించారు. తదుపరి విచారణలో విద్యార్థిని ఆత్మహత్యపై గల వివరాలను సేకరిస్తామని, కేసు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు చేపడతామని అయన అన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని కళాశాల లో ఏం జరిగిందో తెలుపకుండా యాజమాన్యం దాచిపెడుతుందని, మా కూతురు చనిపోయిన తర్వాత కనీసం మాకు సమాచారం ఇవ్వకుండా హాస్పిటల్ కు తరలించారని, మా కూతురి చావుపై పూర్తిగా దర్యాప్తు చేయాలనీ, మాకు తగిన న్యాయం చేయాలని కళాశాల ఆవరణలో మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : రాజ్యాంగం రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చాల్సిన అవసరం ఉందని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి నీ పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్, మల్లికార్జున నగర్ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వర్ధంతి వేడుకలలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పాల్గొని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, సిద్ధి రాములు, నరహరి, బైరు అనిల్, నగేష్ గౌడ్, మల్లేష్ యాదవ్, అనిత, వాసు, కావాలి శ్రీనివాస్, భాను, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో :

భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతిని శుక్రవారం మండల కేంద్రంలోని వై జంగ్ షన్ వద్ద పలువురు నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమానత్వం ,సామరస్యం, సామాజిక న్యాయం కోసం సాటిలేని కృషిచేసిన గొప్ప మహనీయులు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జె సుదర్శన్ గౌడ్, కర్రోళ్ల సురేందర్, చిల్కమారి నరసింహ, నవీన్ చారి, రాజశేఖర్ రెడ్డి, తేజ, గోవింద్ నాయక్, మ్యాదరి శ్రీను, శివ గౌడ్, పాశం కృష్ణ, ఆంజనేయులు గౌడ్, టిఆర్ఎస్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, దేవేందర్ యాదవ్, రవి నాయక్, జే శీను, కోస్గి శీను, డోలి రవీందర్, మాదారం నరసింహులు గౌడ్, శ్రావణ్ కుమార్, సోమ్లా నాయక్, రాజశేఖర్, బాల్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బషీర్ బాగ్‌లో :

అంబేద్కర్ జీవతం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అని ఉమ్మడి ఎపి హైకోర్టు రిటైర్డ్ జడ్జి జి.చంద్రయ్య అన్నారు.ఆయన గొప్ప సంఘసంస్కర్త కొనియాడారు. భారత స్వతంత్ర పోరాటంలో కీలక భూమిక పోషించిన మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మారకోపన్యాసం శుక్రవారం రాత్రి బషీరాబాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఉమ్మడి ఎపి హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జి.చంద్రయ్య అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. 'డా. బాబా సాహెబ్ అంబేద్కర్ జీవితం-ఆశయం ఆచరణ, విజయాలు' అనే అంశంపై ప్రసంగించారు. ట్రస్టు కార్యదర్శి గనుముల జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డా. యాదయ్య, పరుశరామయ్య, గద్దం ఝాన్సీ, జివి రావు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో :

బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్‌లో గల అంబేద్కర్ కూడలి నందు గల అంబేద్కర్ విగ్రహానికి కొండాపూర్ డివిజన్ గౌరవ కార్పొరేటర్ హమీద్ పటేల్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హామీ పటేల్ మాట్లాడుతూ, స్వశక్తితో ఎదిగిన బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారతదేశ రాజ్యాంగ ప్రదాత అని, బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచి వారి అభ్యున్నతి కొరకు అహర్నిశలు కష్టపడిన మహెూన్నతుడని పేర్కొన్నారు. కార్పొరేటర్ హమీద్ పటేల్ గారితో పాటుగా స్థానిక సీనియర్ నాయకులు నందు, సిద్ధిక్ నగర్ బస్తీ అధ్యక్షులు కే బసవరాజు, లక్ష్మి బాయ్, విజయ్, వినోద్ యాదవ్, యం శ్రీను, రవి, సదర్ సాయి, సదర్ రాము, గణపతి, బుడుగు తిరుపతి రెడ్డి, పెద్ద రవి, కే. రవి, బళ్ళు, రాజు పాల్గొన్నారు.

జవహర్ నగర్‌లో :

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పని చేస్తూ జవహర్ నగర్ అభివృద్ధి చేస్తామని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలో అంబేద్కర్ చౌరస్తా నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 65వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అన్నారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శారద మనోహర్ రెడ్డి లావణ్య సతీష్ గౌడ్,కుతాడి సాయి, జమాల్ పుర్ నవీన్. ప్రేమల శ్రీనివాస్,బల్లి శ్రీనివాస్, స్థానికులు ఇతరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ 68 వ వర్ధంతి సందర్భంగా జవహర్ నగర్ కార్పోరేషన్‌లో కులాల, మతాల, అతీతంగా ఆయన విగ్రహానికి వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పలు రాజకీయ పార్టీల నాయకులు తో కలిసి జవహర్ నగర్ సిఐ సైదులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సమసమాజ దాశనికుడు అని వారి సేవలను స్మరించుకున్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి : మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి : స్వతంత్ర సమరయోధుడు, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పీర్జాదిగూడ నగరపాలక సంస్థ మేయర్ అమర్ సింగ్ ఆ మహానేతకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, అణగారిన వర్గాల హక్కులకోసం, సమాజంలోని అసమానతలను రూపుమాపడానికి జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని మహిళా హక్కుల కోసం పదవిని త్యాగం చేశారు. అంబేద్కర్ చేసిన కృషిని సేవలను కొనియాడుతూ విద్య, రాజకీయ అంశాలు అభివృద్ధికి రెండు చిహ్నాలు అని గుర్తించిన మొదటి వ్యక్తి అంబేద్కర్ అని ఆ మహానుభావుని ఆశయాలను సాధించడములో ముందుండి దేశ భవిష్యత్తులో మమేకం అయినప్పుడే అంబేద్కర్‌కి నిజమైన నివాళి అవుతుంది అని ప్రతి భారతీయుని బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాడుగుల చంద్రారెడ్డి, పప్పుల అంజిరెడ్డి, పాశం బుచ్చి యాదవ్, పంగా ప్రణయ్ కుమార్, మణిరామ్ నాయక్, నరసింహారెడ్డి, సుక్క జయేందర్, బొటుమంచి సునీల్, కాటపాక కుమార్, తవిటి ప్రశాంత్ పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం జీవితకాలం కృషి చేసిన మహా పురుషుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం కుత్బుల్లాపూర్‌లోని వారి నివాస కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కెపి వివేకానంద్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం రాజ్యాంగాన్ని రచించి మనకు స్వేచ్ఛ స్వాతంత్రాన్ని ప్రసాదించిన మహా మేధావి బాబా సాహెబ్ అంబేద్కర్ అని వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణే తమ ధ్యేయం అని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు రాజ్యాంగబద్దంగా నేడు ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను గృహ నిర్బంధం చేస్తూ రాజ్యాంగ పరిరక్షణకు తూట్లు పొడుస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతమైన వ్యక్తి అంబేద్కర్: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక శాసనసభ్యులు ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ 124 డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ మహెూన్నతమైన వ్యక్తి అని, పేద, బడుగు బలహీనులకు రాజ్యాంగ పరంగా అనేకచట్టాలు తెచ్చి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. సామాజిక న్యాయం కోసం జరిగే సమరశీల పోరాటాలపై చెరగని ముద్రవేసిన మహనీయుని ఆశయాలు నేటి యువతకు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, పాండు గౌడ్, జిల్లా గణేష్, కొమ్మగళ్ల మోజెస్ శివరాజ్ గౌడ్, శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : నియోజకవర్గ అభివృద్దే తన ధ్యేయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం తుర్కయాంజల్ మున్సిపాలిటీ లోని 1, 8, 13, 15, 17, 19 వార్డులో 2 కోట్ల 64 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రోడ్డు డెవలప్మెంట్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ మల్ రెడ్డి అనురాధ, స్థానిక కౌన్సిలర్లతో కలసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు ప్రారంబోత్సవాలు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, వేముల స్వాతి అమరేందర్ రెడ్డి. తాళ్లపల్లి సంగీత మోహన్ గుప్తా, నక్క శివలింగం గౌడ్, నారని కవిత శేఖర్ గౌడ్. మర్రి మాధవి మహేందర్ రెడ్డి, కొత్త కుర్మ మంగమ్మ కమిషనర్ అమరేందర్ రెడ్డి, డీఈ బిక్షపతి, ఏ ఈ చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు పుర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ స్కూల్‌ను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం కమిషనర్ జి. రామలింగం పర్యవేక్షణ అధికారిగా బోడుప్పల్ జిల్లా పరిషత్ స్కూల్, ఇందిరా నగర్ మండల పరిషత్ స్కూల్, మేడిపల్లి మండల పరిషత్ స్కూల్‌ల యందు పారిశుధ్య స్థితులు, టాయిలెట్స్, భోజనశాల, వండిన వంటలు, రోజు వారి వంట మెనూలను పరిశీలించడం జరిగినది. అదే విధముగా వంటల సుచి, శుభ్రత, రుచి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేసారు.

సమ సమాజ స్థాపనే అంబేద్కర్‌కు నిజమైన నివాళి: రాజా

న్యూదిల్లీ: రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌తో పాటు క్రాంతి సిన్హా నానా పాటిల్ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శుక్రవారం నివాళులర్పించింది. దిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో అంబేద్కర్, పాటిల్ చిత్రపటాలకు పూల మాలలు వేసి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి బాలచంద్ర కాంగో తదితరులు అరుణాంజలి ఘటించారు. అనేక మంది పార్టీ నేతలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ ఆధునిక భారత్ నిర్మాణంలో అంబేద్కర్ తోడ్పాటును శ్లాఘించారు. ఆయన వల్ల లక్షల మంది అణగారిన వర్గీయుల సమాన హోదా, గౌరవప్రద జీవితం కల సాకారమైందని అన్నారు. భారత్ మత రాజ్యం కాదని అంబేద్కర్ స్పష్టంచేశారని గుర్తు చేశారు. మత సిద్ధాంతాలపై ఆధారంతో దేశానికి ముప్పు తప్పబోదని అప్పట్లోనే అంబేద్కర్ హెచ్చరించారన్నారు. అంబేద్కర్ దూరదృష్టితో రాజ్యాంగాన్ని రూపొందించారని, సమ సమాజం కోసం జీవితం మొత్తం పని చేశారని రాజా అన్నారు. కులం, మతం, పితృస్వామ్యం సంకెళ్లు తెంచి... సమ సమాజాన్ని సాధించగలగడమే ఆయనకు నిజమైన నివాళని అని రాజా అన్నారు. అంబేద్కర్ ఆశయసాధనకు పునరంకితం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

సమన్వయంతో ముందుకు...

సీపీసీ నేతతో సీపీఐ ప్రతినిధుల చర్చలు

బీజింగ్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) కలిసి ముందుకెళ్లాలని సంకల్పించాయి. సమన్వయం, సంప్రదింపులతో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. సీపీఐ జియాంచావ్‌తో సమావేశంలో ఈ మేరకు ఏకాభిప్రాయం కుదిరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ పరిణామాలు, రెండు దేశాలకు సంబంధించిన కీలక అంశాలపై ప్రతినిధులు చర్చించారు. పార్టీల మధ్య సమన్వయం పెంచుకోవాలని... మనస్పర్థలు, విభేదాలను పక్కపెట్టి కలిసి ముందుకెళ్లాలన్న నాయకులు నిర్ణయించారు.

కార్యదర్శి రామ కృష్ణ పాండా అధ్వర్యంలో ప్రతినిధి బృందం చైనా పర్యటనలో భాగంగా ఆ దేశ రాజధాని బీజింగ్‌లో సీపీసీ కేంద్ర కమిటీ అంతర్జాతీయ విభాగాధిపతి లియూ చైనా-భారత్ మధ్య సంబంధాల మెరుగుదలకు దోహదం కావాలని రెండు కమ్యూనిస్టు పార్టీల నాయకులు సంకల్పించారు.

బాలమల్లేష్ కుటుంబానికి అజీజ్ పాషా, రామకృష్ణ పరామర్శ

విశాలాంధ్ర-హైదరాబాద్: ఇటీవల మరణించిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ కుటుంబాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ పరామర్శించారు. మేడ్చల్ మల్కాజ్ జిల్లా యాప్రాల్ గ్రామంలోని బాలమల్లేష్ నివాసానికి శుక్రవారం నాయకులు వెళ్లి ఆయన చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు. బాలమల్లేష్ సతీమణి వందన, కుమార్తె నికిత, కుమారుడు నిషాంత్‌కు వారు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీపీఐ, ప్రజాసంఘాల ఉద్యమాల నిర్మాణంలో బాలమల్లేష్ విశేషమైన కృషి చేశారని, ఆ కృషిని ఎన్నటికీ మరిచిపోలేమని వారు ఈ సందర్భంగా అన్నారు. సీపీఐ, ప్రజా సంఘాల శ్రేణుల్లో అత్యంత విషాదాన్ని నింపిన బాలమల్లేష్ మరణం గురించి వారు వందనను అడిగి తెలుసుకున్నారు. బాలమల్లేష్ కుటుంబానికి సీపీఐ అన్ని విధాలుగా అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు. బాలమల్లేష్ ఆకస్మిక మరణం సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితికి, ఆయన కుటుంబానికి తీరనిలోటు అని అజీజ్ పాషా అన్నారు. విద్యార్థి దశలో ఉన్న కాలం నుంచి పార్టీ కోసం అవిశ్రాంతంగా పనిచేశారని, అనంతరం ఏఐవైఎఫ్‌లోనూ క్రియాశీల నాయకుడిగా ఎదిగారని గుర్తు చేశారు.

పవన్‌ను అడ్డుపెట్టి పోర్టు వాటాలకు చంద్రబాబు కుట్ర: అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అడ్డుపెట్టుకుని కాకినాడ సీపోర్ట్‌లో చంద్రబాబు సృష్టించిన హంగామా వెనుక పోర్ట్ వాటాలను దక్కించుకో వాలనే కుట్ర దాగి ఉందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వ్యాపార సంస్థలపై తప్పుడు ఫిర్యాదులు చేయించడం, అక్రమ కేసులను బనాయించడం వెనుక చంద్రబాబు ధనదాహం ఉందని ఆయన దుయ్యబట్టారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంబటి మాట్లాడుతూ సీపోర్ట్‌లో వాటాలపై వివాదాన్ని సృష్టించి, తన బినామీ కేవీ రావు ద్వారా తిరిగి లబ్ధిపొందాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు... పాలనలో వైఫల్యం చెందారన్నారు.

ఎస్వీబీసీ చైర్మన్ పదవి ఎవరికో?

- ముగ్గురు సినీ ప్రముఖుల చూపు
- పవన్, బాలయ్యతో లాబీయింగ్
- చంద్రబాబు నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్‌లో నామినేటెడ్ పదవులపై ఎంతో మంది కూటమి నేతలు ఆశలు పెట్టుకున్నారు. పెండింగ్ పదవుల భర్తీపై కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే కూటమిలోని మూడు పార్టీల (టీడీపీ, జనసేన, బీజేపీ) నేతలకు అవకాశం కల్పిస్తూ రెండు విడతలుగా పదవులు ప్రకటించారు. ఇటీవల అత్యంత ప్రతిష్టాత్మకమైన టీటీడీ బోర్డును నియమించారు. మరోపక్క ఎమ్మెల్సీ, రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక పైనా కసరత్తు జరుగుతోంది. ఇదే సమయంలో మరో ప్రతిష్టాత్మకమైన శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) చైర్మన్ నియామకం పైనా చర్చలు జరుగుతున్నాయి. ఇందుకు సినీ ప్రముఖుల పేర్లు ప్రధానంగా వినబడుతున్నాయి. ఈ పదవి కోసం ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సైతం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత కీలక పదవుల ఖరారుపైన ఆసక్తి నెలకొంది. టీటీడీ బోర్డుపై సుదీర్ఘ కసరత్తు తరువాత అందరూ ఊహించినట్లుగా టీటీడీ చైర్మన్‌గా మీడియా సంస్థల అధినేత బీఆర్ నాయుడుకు చంద్రబాబు అవకాశం కల్పించారు. ఇదే క్రమంలో మూడు పార్టీల వారికి టీటీడీ పాలక మండలిలో చోటు కల్పించారు. ఇక ఇప్పుడు టీటీడీకి అనుబంధ విభాగమైన ఎస్వీబీసీ చైర్మన్ పదవి కోసం పెద్ద ఎత్తున పోటీ కనిపిస్తోంది. ఎస్వీబీసీతో పాటుగా శ్రీ వెంకటేశ్వర ఎంప్లాయీస్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్‌వీఈటీఏ) చైర్మన్ నియామకం పైనా ప్రస్తుతం కసరత్తు జరుగుతోంది. కూటమి మూడు పార్టీల నుంచి ఈ పోస్టుల కోసం లాబీయింగ్ మొదలైనట్లు తెలుస్తోంది. ఎస్వీబీసీ సీఈవో, సలహాదారు, చీఫ్ అడ్వైజర్ వంటి పదవులను భర్తీ చేయాల్సి ఉంది. వీటిపైన కసరత్తు జరుగుతోంది. గతంలో టీడీపీ హయాంలో ఎస్వీబీసీ చైర్మన్‌గా ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావుకు అవకాశం లభించింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సినీ నటుడు పృథ్వీని ఆ స్థానంలో నియమించారు. కానీ ఆయనపై ఆరోపణలు రావటంతో తప్పించారు. ఆ తరువాత సాయికృష్ణ యాచేంద్ర ఎస్వీబీసీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు ఈ పదవి కోసం సినీ ప్రముఖులు మురళీ మోహన్, అశ్వనీదత్, రాజేంద్ర ప్రసాద్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పవన్, బాలకృష్ణ ద్వారా మరికొందరు సినీ రంగానికి చెందిన వారు ఈ పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే టీటీడీ చైర్మన్ పదవి దక్కించుకున్న సామాజిక వర్గానికి కాకుండా ఇతరులకు ఎస్వీబీసీ ఇవ్వాలనే సూచనను కొందరు తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాలం సినీ పరిశ్రమలో కొనసాగుతున్న ఒక ప్రముఖుడి పేరు బాలయ్య సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పవన్ అభిప్రాయం సైతం తీసుకున్న తరువాతనే చంద్రబాబు... ఎస్వీబీసీ చైర్మన్‌ను ఖరారు చేసే అవకాశం ఉందని అంటున్నారు. శ్రీ వెంకటేశ్వర ఎంప్లాయీస్ ట్రైనింగ్ అకాడమీ చైర్మన్ పదవి కోసం తిరుపతి జనసేన నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఈ తరుణంలో ఎస్వీబీసీ చైర్మన్ పదవిని సినీ పరిశ్రమ నుంచి ఎవరు దక్కించుకుంటారనేది ఆసక్తిగా మారింది.

నాలుగు పంచాయతీలకు జాతీయ పురస్కారాలు

అభినందనలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం అందించే 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్' లో ఆంధ్ర ప్రదేశ్ నుంచి నాలుగు పంచాయతీలు అగ్ర స్థానంలో నిలిచి పురస్కారాలు కైవసం చేసుకున్నాయి. హెల్దీ పంచాయత్ అనే విభాగంలో చిత్తూరు జిల్లాలోని బొమ్మ సముద్రం, వాటర్ సఫిషియెంట్ విభాగంలో అనకాపల్లి జిల్లాలోని న్యాయంపూడి, క్లీన్ అండ్ గ్రీన్ విభాగంలో అనకాపల్లి జిల్లాలోని తగరంపూడి, సోషల్లీ జస్ట్ అండ్ సోషల్లీ సెక్యూర్డ్ పంచాయత్ విభాగంలో ఎన్టీఆర్ జిల్లాలోని ముప్పాళ్ల పంచాయతీ అవార్డులు పొందాయి. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ పురస్కారాలు పొందిన పంచాయతీలకు అభినందనలు తెలిపారు. ఈ ఘనత స్థానిక సంస్థల బలోపేతం, గ్రామాలు స్వయం సమృద్ధి సాధించే దిశగా పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతూ, స్థానిక పరిపాలనను ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వ కృషికి నిదర్శనమన్నారు. పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు.

భాస్కర్‌రెడ్డి బెయిల్ రద్దు చేయండి

సుప్రీంలో సునీత మరో పిటిషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు వైఎస్ భాస్కర్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె సునీత సుప్రీం కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై శుక్రవారం సుప్రీం కోర్టు విచారణ నిర్వహించి, భాస్కర్‌రెడ్డికి నోటీసులు జారీచేసింది. వైఎస్ వివేకా హత్య అనంతరం నుంచి తెలంగాణ, ఏపీ హైకోర్టుల ద్వారా ఆమె న్యాయ పోరాటం చేస్తోంది. సుప్రీం కోర్టును ఆశ్రయించింది. తాజాగా మరో పిటిషన్ వేయడం చర్చనీయాంశమైంది. ఇటీవల రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను సునీత కలిశారు. వివేకా కేసు విచారణలో పురోగతి పెంచాలని ఆమె అభ్యర్థించారు. ఇప్పటికే నిందితుడు భాస్కర్‌రెడ్డి బెయిల్‌పై విడుదలయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ ఈ కేసుపై సునీత న్యాయ పోరాటం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు.

వైసీపీ హయాంలో భూకబ్జాలు

రెవెన్యూ సదస్సుల్లో మంత్రులు, ఎమ్మెల్యేల ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. 33 రోజులపాటు ప్రభుత్వం నిర్వహించనుంది. జిల్లా కలెక్టర్ల అధ్వర్యంలో జరిగిన సదస్సులను మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ప్రజల నుంచి ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ కబ్జాలను మంత్రులు ఎత్తిచూపారు. బాపట్ల జిల్లాలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, నెల్లూరు జిల్లాలో మునిసిపల్ మంత్రి పి.నారాయణ, పల్నాడు జిల్లాలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సదస్సులను ప్రారంభించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసినా, ప్రైవేటు వ్యక్తి ఆస్తి లాక్కున్నా నాన్ బెయిల్ కింద 10 నుంచి 14 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని మంత్రి నారాయణ హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సెంటు భూమి నుంచి కొన్ని ఎకరాల వరకు వైసీపీ నేతలు కబ్జా చేశారని అన్నారు. పరిశ్రమలు, పోర్టులను సైతం కబ్జా చేశారని చెప్పారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చామని మంత్రి నారాయణ తెలిపారు. వైసీపీ పరిపాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని రెవెన్యూ మంత్రి సత్య ప్రసాద్ చెప్పారు. భూ హక్కుదారులకు పూర్తి హక్కులు కల్పించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విజయనగరం జిల్లాలోని బొండపల్లిలో రెవెన్యూ సదస్సును రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా 45 రోజుల్లో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పార్వతీపురంలో రెవెన్యూ సదస్సును మహిళా శిశు, సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రారంభించారు. ప్రభుత్వ లోగోతో భూమి పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ అగ్రహారం భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐదేళ్లు ప్రైవేట్ ఆస్తులు కొల్లగొట్టారని, ప్రభుత్వ ఖజానా లూటీ చేశారని మండిపడ్డారు. లంచాల పేరుతో రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పదోరోజూ వాయిదాలే

ఆగని నిరసనలు - సాగని ఉభయ సభలు

న్యూదిల్లీ: పార్లమెంటు సమావేశాలు పదవ రోజు రసాభాస అయ్యాయి. ఉభయ సభల్లో వాయిదా పర్వం కొనసాగింది. అదానీ వ్యవహారం, జార్జ్ సారోస్‌తో సంబంధాలపై లోక్‌సభ దద్దరిల్లగా, రూ.500 నోట్ల కట్ట దొరకడం రాజ్యసభలో దుమారం రేపింది. విపక్ష సభ్యుల నిరసనలు, అధికార పక్షం వాగ్వాదాలతో లోక్‌సభ, రాజ్యసభ సోమవారానికి వాయిదా పడ్డాయి. కాంగ్రెస్ పార్టీకి అమెరికా సంపన్నుడు జార్జ్ సారోస్‌తో బీజేపీ ముడిపెట్టడంపై విపక్ష సభ్యుల ఆందోళనలతో శుక్రవారం లోక్‌సభ వాషౌట్ అయింది. జీరో అవర్‌లో బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే మరలా అదే అంశాన్ని లేవనెత్తడం దుమారం రేపింది. కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. వారికి సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, తృణమూల్ ఎంపీ సౌగతా రాయ్ మద్దతిచ్చారు. లోక్‌సభ ఉదయం 11 గంటలకు సమావేశమైన నిమిషంలోపే మధ్యాహ్నానికి వాయిదా పడింది. దూబే ఆరోపణలకు బదులిచ్చేందుకు కాంగ్రెస్ సభ్యులు గౌరవ్ గొగోయ్, కేసీ వేణుగోపాల్ ప్రయత్నించగా స్పీకర్ అడ్డుకున్నారు. 'ప్రశ్నోత్తరాలను సాగనివ్వరా... సభ హుందాతనానికి భంగం కలిగించనివ్వను. దాని ప్రతిష్ఠను ఇలా మీరు దిగజార్చలేరు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. సభను వాయిదా వేశారు. తిరిగి మధ్యాహ్నం సమావేశం మొదలు కాగానే సభాపతి స్థానంలో బీజేపీ సభ్యుడు దిలీప్ సైకియా పార్లమెంటరీ పత్రాల సమర్పణకు అనుమతిచ్చారు. ఆపై దూబేను మాట్లాడమన్నారు. వెంటనే కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి బీజేపీకి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గందరగోళం నెలకొనడంతో సభను వాయిదా వేస్తున్నట్లు సైకియా వెల్లడించారు. అటు రాజ్యసభలో రూ.500 నోట్ల కట్ట (రూ.50వేలు) లభ్యం కావడంపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. ఎగువ సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది.

ఇద్దరు మాజీ సర్పంచ్‌ల కిడ్నాప్... హత్య

పోలీసు ఇన్‌ఫార్మర్లుగా మారినందుకే చంపామన్న మావోయిస్టులు

విశాలాంధ్ర-చింతూరు (అల్లూరి జిల్లా): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా నైమెడ్, భైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఇద్దరు మాజీ సర్పంచ్‌లను మావోయిస్టులు కిడ్నాప్ చేసి హత్య చేశారు. వీరు బీజేపీ కార్యకర్తలని, పోలీసు ఇన్‌ఫార్మర్లుగా పనిచేస్తున్నారని, అందుకే వీరిని హతమార్చినట్టు మావోయిస్టులు తెలిపారు. వివరాలివి. ఖదర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుఖ్‌రామ్ ఆవలం, బీజాపూర్‌లోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం స్వగ్రామం ఖదర్‌కు వెళ్లారు. వ్యక్తిగతపనిపై అక్కడి నుంచి సమీపంలోని కైక గ్రామానికి వెళ్లి తిరిగి ఖదర్‌కు వస్తుండగా... ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు సుఖ్‌రామ్‌ను అడవి వైపు తీసుకెళ్లారు. మావోయిస్టులు అతడిని హత్య చేసి, మృతదేహాన్ని ఖదర్-కైకా రహదారిపై పడేశారు. గంగలూరు ఏరియా కమిటీ మావోయిస్టులు ఘటనా స్థలంలో జారవిడిచిన కరపత్రాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో మాజీ సర్పంచ్ సుకాలు ఫర్సాను బిర్యాభూమి గ్రామానికి వెళ్లే మార్గంలో కిడ్నాప్ చేశారు. అతడి కుమార్తె తన తండ్రిని వదిలిపెట్టమని ఎంత ప్రాధేయపడినా కనికరం చూపలేదు. ఫర్సాను హతమార్చారు. పోలీసులు మృత దేహాన్ని, అక్కడ వదిలిన కరపత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఫర్సా బీజేపీలో చేరినందుకు చంపేశామని మావోయిస్టులు పేర్కొన్నారు.

'ఈశాన్యం'పై గత పాలకుల శీతకన్ను: మోదీ

న్యూదిల్లీ: రాబోయే రోజులన్నీ తూర్పు, ఈశాన్య భారతావనివేనని తాను ప్రగాఢంగా విశ్వసిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శుక్రవారం దిల్లీలోని అష్టలక్ష్మి మహోత్సవ్ కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. ఈశాన్య ప్రాంతం గొప్ప సంస్కృతి, చైతన్యవంతమైన వ్యక్తులతో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే అపారమైన సామర్థ్యంతో ఉందన్నారు. గత ప్రభుత్వాలు చాలాకాలంగా ఓట్ల సంఖ్యతో అభివృద్ధిని ఎలా తూకం వేశాయో చూశామని ప్రధాని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఓట్లు, సీట్లు తక్కువగా ఉండటంతో గత పాలకులు అభివృద్ధిపై దృష్టిపెట్టలేదని దుయ్యబట్టారు. దిల్లీ... ఈశాన్య ప్రాంత ప్రజల మనస్సులకు దూరమనే భావనను తగ్గించేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ప్రయత్నించామన్నారు. ఈ దశాబ్ద కాలంలో కేంద్రమంత్రులు 700 సార్లు ఇక్కడ పర్యటించారని, ప్రజల మనోభావాలు, ఆర్థిక వ్యవస్థ, జీవావరణంతో ఈశాన్య ప్రాంతాలను అనుసంధానం చేసుకుంటూ ముందుకెళుతున్నామన్నారు.

షోకాజ్ నోటీసులపై ఐఐటీ ఖరగ్‌పూర్ ఫ్యాకల్టీ ఆందోళన

కోల్‌కతా: ప్రొఫెసర్లకు షోకాజ్ నోటీసులపై ఐఐటీ ఖరగ్‌పూర్ ఫ్యాకల్టీ ఆగ్రహం వ్యక్తంచేసింది. 86 మంది ప్రొఫెసర్‌లకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను తీవ్రంగా వ్యతిరేకించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ ఫ్యాకల్టీలోని ఓ విభాగం చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. నోటీసులు వెనక్కి తీసుకోకుంటే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించింది. నోటీసులపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపింది. బుధవారం నుండి 100 మందికి పైగా ప్రొఫెసర్లు బ్లాక్ బ్యాడ్జీలు ధరించి... ప్లకార్డులు పట్టుకుని ఐఐటీ పాలనా భవనం ఎదుట నిరసన చేపడుతున్న సంగతి తెలిసిందే. ఐఐటీ ఖరగ్‌పూర్ డైరెక్టర్ వీరేంద్ర కుమార్ తివారీపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ టీచర్స్ అసోసియేషన్ (ఐఐటీటీఏ) సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. బంధుప్రీతితో పాటు ఏకపక్షంగా ఫ్యాకల్టీని నియమించడం, మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించడంలో వైఫల్యం, ఫ్యాకల్టీ నుండి అక్రమంగా అధిక నగదు వసూలు చేయడం, ఐఐటీ క్యాంపస్, ఇతర వర్గాల మధ్య సామరస్యతను దెబ్బతీయడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు లేఖలో పేర్కొంది. ఈ అంశాలపై ఇప్పటికే డైరెక్టర్, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్, చైర్మన్‌కు లేఖ రాసినా స్పందించలేదని తెలిపింది. తగిన విద్యార్హతలు కలిగిన, సుపరిపాలన అందించగలిగిన వ్యక్తిని డైరెక్టర్‌గా నియమించాల్సిందిగా లేఖలో కోరింది. కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంపై ఐఐటీ యాజమాన్యం మండిపడింది.

సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లు

మంత్రి జనార్దన్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల చెక్ పోస్టు నుంచి గార్గేయపురం వెళ్లే రహదారి అనేక ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. ఇక్కడ 100 అడుగుల రోడ్డు నిర్మించాలా, లేదంటే 120 అడుగులకు నిర్మించాలా అనే విషయంలో జాతీయ రహదారుల సంస్థ, కార్పొరేషన్ మధ్య సందిగ్ధత నెలకొనడంతో చాలా కాలంగా ఆ రోడ్డు ఆగిపోయిందన్నారు. దీనికి పరిష్కారం కోసం నేడు తామంతా సమావేశమైనట్లు మంత్రి తెలిపారు. 100 అడుగుల వరకు రోడ్డును జాతీయ రహదారుల సంస్థ తీసుకుని, మిగిలినది కార్పొరేషన్‌కు అప్పగించాలని నిర్ణయానికి వచ్చామన్నారు. రోడ్డు విస్తరణ పనులు, అక్కడ భవనాల నష్టపరిహారానికి ఎంత ఖర్చు అవుతుందనే దానిపై డీపీఆర్ తయారు చేయమని అధికారులను కోరామన్నారు. ఈ నెల 15న నోటిఫికేషన్ ఇచ్చి, ఆ తర్వాత 45 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసి అనంతరం ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించామని, సాధ్యమైనంత త్వరగా 120 అడుగులకు విస్తరించాలని కోరినట్లు మంత్రి చెప్పారు. కర్నూలు డివిజన్‌లో 42 శాతం, ఆదోని డివిజన్‌లో 72 శాతం రోడ్లకు మరమ్మతులు పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలోని 32 వేల కిలోమీటర్ల రోడ్లను సకాలంలో రెన్యువల్ చేయకపోవడంతో రోడ్లు గుంతలమయంగా మారాయన్నారు. దీంతో నేడు రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు వెనక్కి పోయాయని, పర్యాటకం పూర్తిగా దెబ్బతిందన్నారు. నేడు జాతీయ రహదారులు, అమరావతి రోడ్డుతో కలిపి దాదాపు రూ.లక్ష కోట్లు కేంద్రం నుంచి తీసుకొచ్చామని, త్వరలో ఆ పనులు మొదలు పెడతామన్నారు. ప్రభుత్వానికి రోడ్లు భారంగా మారుతున్నందున పీపీపీ మోడల్‌లో 3 వేల కి.మీ పైగా గుర్తించామని, వాటికి రూ.42 కోట్లకు ఏజెన్సీల ద్వారా టెండర్లు పిలుస్తామని ఆయన వివరించారు. రాష్ట్రాభివృద్ధి కాంక్షించి పెట్టుబడులు పెట్టేవారికి సింగిల్ విండ్ విధానంలో అన్ని అనుమతులు ఇస్తామన్నారు. ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌కు రూ.3 వేల కోట్లు కేంద్రం నుంచి తీసుకురావడం గర్వ కారణమని అన్నారు. డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి 300 ఎకరాలు మన ఓర్వకల్లులో కేటాయించడంపై ముఖ్యమంత్రికి తామంతా రుణపడి ఉంటామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య పాల్గొన్నారు.

ఆరు నెలల్లో ఆ ప్రక్రియ పూర్తి కావాలి: సుప్రీం

న్యూదిల్లీ: ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరే వారి పత్రాల పరిశీలన, ధ్రువీకరణ, దర్యాప్తును ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని అన్ని రాష్ట్రాల పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. పదవీ విరమణ తేదీకి రెండు నెలల ముందు ఆప్తాల్మిక్ అసిస్టెంట్ తొలగింపు కేసు విచారణ క్రమంలో ఈ మేరకు ఉత్తర్వులను జారీచేసింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంపికయ్యే అభ్యర్థుల వ్యక్తిత్వం, పౌరసత్వం, వారసత్వం, నిజాయతీ వంటి అంశాల పరిశీలన, సంబంధిత పత్రాల ధ్రువీకరణను నియామక తేదీ నుంచి ఆరు నెలల లోపు పూర్తి చేయాలని జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలిచ్చింది. ధ్రువీకరణ ముగిసిన తర్వాతే నియామకాలు చేపట్టాలని సూచించింది. పిటిషనర్ 1985, మార్చి 6న ఉద్యోగంలో చేరారు. ఆయనకు సంబంధించిన పోలీసు వెరిఫికేషన్ 2019, జులై 7న మొదలైంది. పదవీ కాలం ముగిసేందుకు రెండు నెలల ముందు ఆయన అసలు భారత పౌరుడే కాదని పోలీసులు తేల్చారు. ఆ క్రమంలో ఉద్యోగిపై వేటు పడింది. దీంతో బసుదేవ్ దత్తా సుప్రీంకోర్టును ఆశ్రయించగా తాజా తీర్పు వెలువడింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.